Pubilshed from Kadapa
PRGI NO : APTEL/25/A1220

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com




| కడప KADAPA | సంపుటి : 03 | సంచిక : 22 | ఆదివారం | అక్టోబర్ 18, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ |
|---|---|---|---|---|---|---|---|
| | Vol.No : 03 | Issue No : 22 | Sunday | 18 OCTOBER 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/- |

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



# సిగ్గు పడాల్సింది మీరా.. జర్నలిస్టులా..



(రామమోహన్ రెడ్డి )

"మనదీ ఒక బ్రతు కేనా? కుక్కలవలె, నక్కల వలె!
మనదీ ఒక బ్రతుకేనా? సందులలో పందులవలె!"

సమాజంలో పేదరికం, దోపిడీ, అణచివేతకు గురవుతున్న బడుగు జీవుల దయనీయ స్థితిని, వారు పశువుల కంటే హీనంగా బ్రతుకుతున్న తీరును శ్రీ శ్రీ ఈ కవిత ద్వారా తీవ్రంగా ప్రశ్నించారు.సాటి మనిషిని మనిషిగా గౌరవించని వ్యవస్థ మీద, మనుషుల దుర్భర బ్రతుకుల మీద ఆయన చేసిన తిరుగుబాటు గీతం ఇది.అచ్చం ఆ మహనీయుడు శ్రీ.శ్రీ రాసిన కవిత నూటికీ నూరు శాతం వాస్తవానికి అద్దం పడుతుంది నేటి ఈ సమాచార శాఖ అధికారుల తీరు.వ్యక్తుల స్వార్థం వలన సమాజానికి మూలమైన నాలుగో స్తంభముగా పిలువబడుతూ ఉన్న జర్నలిజం వ్యవస్థలలోకి వస్తున్న వారి వివరాలు పరిశీలన చేస్తే పక్కున నవ్వుతోంది నేటి ప్రజాస్వామ్యం. జర్నలిజం వ్యవస్థ ద్వారా పీడిత బానిస బ్రతుకుల నుండి ప్రజలను రక్షించక పోయినా పర్వాలేదు కానీ అదే వ్యవస్థను బజారులో అంగడి సరుకు చేసి అమ్ముకాలు చేస్తున్న తీరును చూస్తుంటే ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ లో జర్నలిజం ఇందుకే అపహాస్యం అవుతుందా అన్న ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతయినా ఉంది.

"పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥"

- మీడియా అంటే ఇంత నీచమా.. » మీరు జీతాలు తింటూ ఈ లాలూచీ పనులేల..
- దసరా పాసులను కూడా అభాసు పాలు చేస్తారా... » నిజమైన జర్నలిస్ట్ కు నిలువెత్తు అవమానాలు చేస్తూ...
- జ్యోతిష్య పండితులు,పాటలు పాడించే వారికి పాసులిస్తారా... » పరుచూరి విజయలక్ష్మి ,ప్రసూన రామన్ ఏ యుగం జర్నలిస్టులు..
- మీ పనికి మాలిన పనులకు కలెక్టర్ పేరు బధనామ్ చేస్తారా...
- మీ బరితెగింపు కు అడ్డుకట్ట వేసేవారు లేరా..
- దిష్టి బొమ్మ లాగా డీ ఐ పీఆర్వో ఉంటుంటే...
- నకిలీ వద్దన్న నాగేశ్వరావుపై వెకిలి కూతలు కూసి..
- రవి ఉదయించని సూర్యుడిలా ఉంటే ..
- ఆర్జేడీకి అన్ని ఓకే అని నమ్మబలికి...
- నడి వీదుల్లో నవ్వుల పాలయ్యేలా ..
- తెర వెనుక మాజీ తాజా ఉద్యోగి తందనాలు పలికి...
- ఎవరి కక్కుర్తి కోసం కలాన్ని కించపరిచారూ....కించ పరుస్తూ ఉన్నారు...
- ఎవడబ్బ సొమ్మని పాసులు పంచారు...
- ఈ అధికారం శాశ్వతమని అనుకున్నారా...
- అందుకే ఈ బరితెగింపు పనులా...
- మీ వల్ల జర్నలిజమే గబ్బు పట్టిందా...లేక మీరే గబ్బు పట్టిస్తున్నారా... ఎవరా మధు ... అతగాడికి కు పెత్తనం ఇచ్చిందెవరు ..
- ఉత్సవాల ఉద్యోగికి పాసులు ఇచ్చేంత స్థాయి ఉందా...
- మీ వెకిలి చేష్టలకు నకిలీలు పుట్టరా మరి...
- కలెక్టర్ గారు మీరైనా చర్యలు చేపట్టలేరా...
- అందుకేనా ఎంపీ కూడా ధర్నా చేసింది...
- దుర్గమ్మ ఈ దుర్మార్గాలకు దండన విధించవా...











సజ్జనులను (మంచి వారిని) రక్షించడానికి, దుర్మార్గులను నాశనం చేయడానికి మరియు ధర్మాన్ని తిరిగి ప్రతిష్ఠించడానికి నేను ప్రతి యుగంలోనూ అవతరిస్తాను అని శ్రీకృష్ణ పరమాత్మ ఈ శ్లోకం ద్వారా తెలియజేశాడు.కానీ ఈ జర్నలిజం కు బడుతున్న

వివరాలు 2లో..




## ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు

**నామినేషన్ కేంద్రాల వద్ద నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

- విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై సస్పెన్షన్, బదిలీ వేటు
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ : ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. స్థానిక రాష్ట్ర ఎన్ని కల కమిషనర్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశం లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా శని వారం మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబం ధిత అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలు తలెత్తిన సంద ర్భాల్లో జిల్లా కలెక్టర్లు, పోలీసు సూపరి ంటెండెంట్లు (ఎస్పీలు), పోలీసు కమిషనర్లను తక్షణమే అప్రమత్తం చేసి పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

2 పేజీలో..

## ఏపీలో పలు జిల్లాలకు వర్ష సూచన..

ప్రజాభూమి ప్రతినిధి, విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాబోయే 3 గంటల్లో రాష్ట్రంలోని పలు జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని, ప్రజలు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.



ఈ మేరకు అధికారికంగా ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. అల్లూరి సీతారామరాజు, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, తిరుపతికి ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. రంపచోడవరం, నర్సీపట్నం, కృష్ణదేవిపేట, రౌతులపూడి, మాడుగుల, ఓర్వకల్లు, వెల్దుర్తి, డోన్, గుత్తి, బద్వేలు, సత్యవేడు, శ్రీకాళహస్తి, పొదిలి, సూళ్లూరుపేట, నాయుడుపేట, గొట్టిప్రోలులో మోస్తరు వర్షాలు కురవనున్నాయి. వర్షంతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఉరుములు, మెరుపులు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## ఏపీని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు

- టీడీపీ, వైసీపీలపై షర్మిల ఫైర్
- టీడీపీ, వైసీపీలది ప్రతీకార రాజకీయమన్న షర్మిల
- స్థానిక ఎన్నికల్లో హింసపై తీవ్ర స్థాయిలో విమర్శలు
- ఎన్నికల సంఘం, పోలీసుల తీరుపై ప్రశ్నలు
- స్వేచ్ఛాయుత ఎన్నికలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : టీడీపీ, వైసీపీలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ రెండు పార్టీలు దాష్టీక రాజకీయాలు చేస్తూ, ప్రతీకారాలతో రతనాల సీమను రక్తసీమగా మారుస్తున్నా యని ఆరోపించారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను మరో 'సౌత్ బీహార్'గా మార్చే పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న హిం సాత్మక ఘటనలపై సోషల్ మీడియా వేదికగా ఆమె స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాయచోటి, పుంగనూరులో జరిగిన ఘర్షణలు రాష్ట్ర ఎన్నికల చరిత్రలో ఆందోళనకరమైన పరిణామాలని షర్మిల అన్నారు.



ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికలను ఘర్షణలు, దాడులతో రణరంగంగా మారుస్తున్నారని విమర్శించారు. "కూటమిది నిజంగా పవిత్ర పాలనే అయితే దాడులు ఎందుకు? బలవంతపు

2 లో



## కాలువలో పడిన మినీ బస్సు

**8 మంది మృతి**

ప్రజాభూమి ప్రతినిధి, కోటా : రాజస్థాన్‌లోని కోటా జిల్లాలో ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేపై శనివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న మినీ బస్సు అదుపుతప్పి వంతెనపై నుంచి కాలువలో పడిపోవడంతో ఎనిమిది మంది మృతి చెందారు. పలువురు గాయపడగా, బస్సులో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు సహాయక బృందాలు చర్యలు చేపట్టాయి.

2 పేజీలో..



## బంగ్లాదేశ్‌లో రిసార్ట్‌లో భారీ అగ్నిప్రమాదం..

- 10 మంది మృతి
- 9 మందికి గాయాలు..
- మంటల్లో చిక్కుకున్న మరికొందరి వివరాలు తెలియాల్సి ఉంది

2 పేజీలో..

ప్రజాభూమి ప్రతినిధి, బంగ్లాదేశ్ : బంగ్లాదేశ్‌లోని కాక్స్ బజార్ జిల్లాలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సముద్ర తీరంలోని ఓ రిసార్ట్‌లో శనివారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో 10 మంది ప్రాణాలు



## సిజెపి అధినేత అభిజిత్ దీప్కేకు బెయిల్

ప్రజాభూమి ప్రతినిధి, న్యూఢిల్లీ : కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) అధినేత అభిజీత్ దీప్కే కు ఢిల్లీలోని న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం ఢిల్లీలో తిరంగా మార్చ్‌లో పాల్గొనేందుకు కనాట్ ప్లేస్‌కు బయలుదేరిన ఆయనను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. దీనిపై శనివారం విచారణ చేపట్టిన న్యాయస్థానం బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

వివరాలు 2లో..

# ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు

మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే జిల్లా కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు కమిషనర్ వెల్లడించారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు, ఎన్నికల నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని ఆదేశించినట్లు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

నామినేషన్ కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, హైకోర్టు ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించినట్లు తెలిపారు. నామినేషన్ల దాఖలు సమయంలో నిర్దేశించిన నిబంధనల ప్రకారం అభ్యర్థితో పాటు అనుమతించిన ముగ్గురు వ్యక్తులకు మాత్రమే ప్రవేశం కల్పించాలని స్పష్టం చేశారు. ఈ నిబంధన అమలులో ఎలాంటి ఉల్లంఘనలకు అవకాశం ఇవ్వకూడదని అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు.

ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నిర్వహణలో గానీ, శాంతిభద్రతల పరిరక్షణలో గానీ అధికారులు నిర్లక్ష్యం లేదా అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని అనిల్ చంద్ర పునేఠా హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు గుర్తించిన అధికారులపై నిబంధనల ప్రకారం సస్పెన్షన్ లేదా బదిలీ వంటి క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎన్నికల ప్రక్రియలో ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ, ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించేలా, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పించేందుకు సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశించారు.

**ఎన్నికల ప్రశాంత నిర్వహణకు అన్ని జిల్లాల్లో పటిష్ట పోలీసు బందోబస్తు : ఐజీ బి.రాజకుమారి**

ఐజీ గా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యాలయం లో డిప్యూట్ కాబడిన ఐజీ బి. రాజకుమారి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని జిల్లాల్లో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర డీజీపీ శ్రీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల్లో తగిన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా క్రిటికల్, హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల పరిధిలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసేందుకు అన్ని జిల్లాల ఎస్పీలు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు.

ఇటీవల చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై పోలీసులు తక్షణమే స్పందించి పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి, శాంతిభద్రతలను పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అన్ని జిల్లాల ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు బి. రాజకుమారి తెలిపారు. ఏ చిన్న అవాంఛనీయ ఘటన జరిగినా వెంటనే స్పందించి, పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించినట్లు వెల్లడించారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు నామినేషన్ కేంద్రాల వద్ద కూడా ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, వీడియో కవరేజ్‌తో పాటు తగిన పోలీసు బందోబస్తు కల్పించి, నామినేషన్ల దాఖలు సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని బి. రాజకుమారి సూచించారు. పాత్రికేయుల సమావేశం లో రాష్ట్ర ఎన్నికల కార్యదర్శి డాక్టర్. ఏ. మల్లికార్జున పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్‌లో రిసార్ట్‌లో భారీ అగ్నిప్రమాదం..

కోల్పోగా, మరో 9 మంది గాయపడ్డారు.

మంటల్లో చిక్కుకున్న మరికొందరి వివరాలు తెలియాల్సి ఉంది. కాక్స్ బజార్ జిల్లాలోని ఇనాని ప్రాంతం, మెరైన్ డ్రైవ్ పరిధిలో ఉన్న పత్వార్టెక్ బీచ్ సమీపంలో 'టుపుటుప్' పేరుతో ఈ రిసార్ట్ నిర్వహిస్తున్నారు. మూడు అంతస్తులుగా ఉన్న ఈ భవనాన్ని పూర్తిగా వెదురుతో నిర్మించారు. శనివారం ఉదయం సుమారు 6.30 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. భవనం వెదురుతో నిర్మించడంతో అగ్నికీలలు వేగంగా వ్యాపించాయి. దీంతో పై అంతస్తుల్లో ఉన్నవారు కిందికి చేరుకోలేక లోపలే చిక్కుకుపోయారు. ప్రమాదం జరిగిన సమయంలో రిసార్ట్‌లో సుమారు 30 మంది ఉన్నట్లు అంచనా. వారిలో నలుగురు లేదా ఐదుగురు మాత్రమే బయటపడగలిగినట్లు సమాచారం. మిగిలినవారు మంటల మధ్య చిక్కుకుపోవడంతో ప్రాణ నష్టం సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు, భవనంలో చిక్కుకున్నవారిని రక్షించేందుకు ప్రయత్నించారు. అయితే మంటలు వేగంగా వ్యాపించడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. అధికారులు ఇప్పటివరకు 10 మంది మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. గాయపడిన తొమ్మిది మందిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. మంటల్లో ఇంకా ఎవరైనా చిక్కుకున్నారా అనే విషయంపై అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రమాదానికి కచ్చితమైన కారణం ఇంకా వెల్లడికాలేదు. ఈ ఘటనపై విచారణ కొనసాగుతోంది. రిసార్ట్‌లోని వంటగదిలో చెలరేగిన మంటలే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

# సిజెపి అధినేత అభిజిత్ దీప్కేకు బెయిల్

రూ.50 వేల వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. సిజెపి ప్రతినిధులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకా అనుమతి లేకుండా జంతర్ మంతర్ దగ్గర నిరసన చేశారని ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకా కు న్యాయస్థానం ఐదు రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించింది. సౌరవ్ దాస్, ఆశుతోష్ ?లపై కేసు, అరెస్ట్?ను నిరసిస్తూ అక్టోబర్ 16న ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్?లో సిజెపి లెహ్రా దో తిరంగా మార్చ్?కు పిలుపునిచ్చింది. శాంతి భద్రతల కారణాలతో సిజెపి ప్రొటెస్ట్?కు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఇందులో భాగంగానే కన్నాట్ ప్లేసులో లెహ్రా దో తిరంగా ర్యాలీ చేపట్టకుండా సిజెపి ఫౌండర్ అభిజిత్ దీప్కేను శుక్రవారం (అక్టోబర్ 16) ఢిల్లీ పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారనే ఆరోపణలతో దీప్కేపై బీఎన్ఎస్?లోని సెక్షన్ 126, 170 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. దీప్కేను శనివారం (అక్టోబర్ 17) మందిర్ మార్గ్ స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టులో పోలీసులు ప్రవేశపెట్టారు. స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు దీప్కేకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కోర్టు నిర్దేశించిన షరతులతో కూడిన శాంతి ఒప్పందంపై సంతకం చేసిన తర్వాత దీప్కే విడుదల అవుతారని ఢిల్లీ పోలీసులు తెలిపారు.



# సిగ్గు పడాల్సింది మీరా..జర్నలిస్టులా...

అన్యాయాన్ని కాపాడడానికి ఎవడు వస్తాడన్న ప్రశ్న అనేక మంది సీనియర్ పాత్రికేయుల ద్వారా వెల్లడి కాబడుతోంది.

ఒక నిజమైన జర్నలిస్ట్ ఏ రంగంలో ఉన్నా ఆ రంగం సమాజానికి హాని కలిగించినది అయితే అది అతని బ్రతుకు దెరువు కోసం అని సంతోష పడచ్చు.కానీ జర్నలిజంలో ఓనమాలు రాక,కులం,మతం,జాతి , ఇతర ప్రయోజనాల కోసం అది కూడా తమ స్వార్ధ పూరిత ప్రయోజనాల కోసం సమాజం లో ఏదో ఒక రంగు పులుముకుని నిజమైన అక్షరానికి అన్యాయం చేస్తుంటే అక్షరం కూడా ఆవేదన చెందక తప్పని పరిస్థితి.

ఇంతటి ఉపోద్ఘాతం దేని గురించని అనేక మంది పండితులమనే వారు బ్రమ పడచ్చు.ఇందుకు సంబంధించిన వివరాలలోకి వెళ్తే ఆ భ్రమలు నిజామా కాదా అన్నది అందరికీ అర్థం అవ్వచ్చు.

దసరా (విజయదశమి) అనేది హిందువులు జరుపుకునే ఒక ముఖ్యమైన పండుగ. ఇది చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుంది.1. రావణాసురుడిని వధించి సీతాదేవిని రక్షించుకున్న శ్రీరాముడి విజయానికి గుర్తుగా ఉత్తర భారతదేశంలో ఈ పండుగను జరుపుకుంటారు.మహిషాసురుడు అనే రాక్షసుడిని దుర్గాదేవి సంహరించి లోకాన్ని కాపాడిన విజయానికి గుర్తుగా దక్షిణ, తూర్పు భారతదేశంలో దుర్గా పూజ ముగింపుగా ఈ పండుగను జరుపుకుంటారు.ఈ పండుగను ముఖ్యమంత్రి

చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవాడ ఇంద్రకీలాద్రి పై వెలసి ఉన్న శ్రీకనక దుర్గమ్మ ఆలయంలో అత్యంత వైభవంగా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా చేస్తున్న అధికారులను ఆదేశించారు. దీనికి తోడు విజయవాడ వైభవాన్ని నలుదిక్కులకు తెలిసేలా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ విజయవాడ ఉత్సవ్ పేరుతో అమ్మవారి భక్తులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుండగా ,విజయవాడ సరస్ పేరుతో మరో బ్రహ్మాండమైన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ అద్భుతమైన కార్యక్రమాలకు దేశ ప్రథమ పౌరురాలు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము,ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందడం జరుగుతూ ఉంది.ఇంతటి మహోన్నతమైన కార్యక్రమ వివరాలు యావత్ ప్రపంచ పఠంలో ఉండేలా మీడియా వేదికగా ప్రచారాన్ని కూడా ప్రభుత్వం తరుపున కోరడం , సమాజానికి నాలుగో స్తంభము బాధ్యతగా మీడియా సంస్థలు కూడా ఎన్నో వ్యయ ప్రయాసలు పడి ఈ కార్యక్రమాలు కవరేజ్ చేసుకునేందుకు సిద్ధం అయ్యింది.

అయితే ఈ కార్యక్రమాల్ని కవరేజ్ చేసుకునేందుకు కొన్ని ఆంక్షలు ఉండడం సహజం.ఎందుకంటే లక్షలాది మంది భక్తుల భద్రతా దృష్ట్యా అందరినీ అన్ని ప్రదేశాలకు అనుమతి ఇవ్వరు కాబట్టి మీడియా వారికి,ఉత్సవాల సందర్భంగా పనిచేస్తున్న ప్రభుత్వ,ప్రవేటు యంత్రాంగానికి ప్రత్యేక పాసులు అర్హత ప్రామాణికంగా మంజూరు చేయడం ప్రభుత్వ బాధ్యత.అయితే



ఇక్కడే అసలు సమస్య మొదలు అయ్యిందని చెప్పచ్చు.ఈ కార్యక్రమాల్ని జిల్లా కలెక్టర్ పర్యవేక్షణ లో జరుగుతూ ఉంటాయి.జిల్లా కలెక్టర్ ఒక సామాన్య భక్తుడు కంటే ఎక్కువగా అటు భక్తుల సౌకర్యాలు,ఇటు అతిథులు,అతి ముఖ్య అతిథుల పర్యటనలు,ఆయా కార్యక్రమాలు చూస్తున్న సమయంలో మీడియా సంస్థలకు సంబంధించి జిల్లా సమాచార పౌర సరఫరాల శాఖ అధికారులకు ఈ బాధ్యత అప్పగించి అర్హులైన వారి పాసుల జాబితా ఇచ్చి ఎక్కడా కూడా మీడియాతో సమన్వయ లోపం లేకుండా చూసేలా ఆదేశించారు.

ఈ ఆదేశాలు ఆయన ఛాంబర్ వరకే పరిమితం చేసిన జిల్లా అధికారులు కలెక్టరేట్ బైటికి రాగానే జిల్లా డి ఐ పి ఆర్వో ఒక దిష్టి బొమ్మలాగా ఆయన ఛాంబర్ వరకే పరిమితం కాగా నకిలీ వెకిలి జర్నలిజం అడ్డుకట్ట వేయడం నాతోనే సాధ్యం అవుతుందని బ్రమ పడిన డీపీ ఆర్వో నాగేశ్వరరావు ప్రధాన పత్రికలు ,ప్రధాన చానెల్స్ కి మాత్రమే పాసులంటూ కట్టడి చేయడానికి పూనుకుని ముందుకు వెళ్తే ఏదయితే మహిషాసురుడు అనే రాక్షసుడిని దుర్గాదేవి సంహరించి లోకాన్ని కాపాడిన విజయానికి గుర్తుగా దసరా పండుగ చేసుకుంటున్నామో ఈ సమాచార శాఖకు పట్టిన మహిషాసురుడు తన అవినీతి యావ చావక కుల బలం,ఇతర సామాజిక వర్గాల బలంతో దసరా ఉత్సవాలను సైతం అభాసు పాలు చేసేందుకు కూడా వెనుకాడని పరిస్థితి దాపురించింది.దేనికయ్యా ఇదంతా అంటే గత ముప్పై సంవత్సరాలుగా తన హవ్వా కొనసాగిస్తూ అయినవారికి ఆకులో కానీ వారికి కంచంలో వడ్డిస్తూ అవినీతికి అలవాటు పడ్డ జీవితానికి ముగింపు పడినా ఆశ చావక జిల్లా సమాచార శాఖ ను పట్టి పీడిస్తున్న తరుణంలో తనను కాదన్న అధికారులకు అభాసుపాలు చెయ్యడం అలవాటుపడి అమ్మవారి పాసుల విషయంలో నాగేశ్వరరావు దూకుడుకి ఒక్కసారిగా అడ్డుకట్ట వేయడం మీడియా రోడ్డెక్కడం అధికార పార్టీ ఎంపీ కేశినేని శివనాథ్ స్వయంగా మీడియా ధర్నాలో పాల్గొనడం కలెక్టర్ కూడా సమయాభావం వల్ల కొంత మౌనం పాటించడడంతో యదారాజ తదాప్రజా అన్న చందాన నియమ నిబంధనలను కృష్ణమ్మ నీటిలో కలిపివేయడం తో అటు జర్నలిజంలో అక్షర పరిజ్ఞానం లేక ఇటు సంగీతం, జ్యోతిష్యం పై రవ్వంత పట్టు లేకపోయినా వారికి అమ్మవారి పాసులు అడ్డగోలుగా ఇవ్వడం వారు జర్నలిజం ముసుగువేసుకుని అమ్మ ఆలయంలో ఫోటోలకు ఫోజులిస్తూ వాట్సప్ స్టేటస్ లు పెట్టుకుని ఉంటే ఇదేనా జర్నలిజం అన్న అనుమానం వ్యక్తం అవుతోంది.

ఇక్కడ ప్రధానంగా చర్చకు దారితీస్తున్న వారిలో ఒకరు పరుచూరి విజయలక్ష్మి ఈమె మహానటి సావిత్రి కళాపీఠం అనే ఒక సంస్కృతిక సంస్థ ను ఏర్పాటు చేసుకుని కౌథా పూర్ణానంద కళావేదిక,హనంతరాయ గ్రంధాలయం,ఆసీస్ స్టూడియో,ఇతర ప్రాంతాలలో తనకు తాను గొప్ప గాయనీ గాయకులుగా గుర్తించిన వారితో పాటలు పాడిస్తూ ఈమె కూడా పాడుతూ ఉంటుంది.ఇంకొక జర్నలిస్ట్ పాసు పొందిన ఆవిడ ప్రసూన రామన్ ఈమె ప్రముఖ జ్యోతిష్య నిపుణురాలుగా కళా రంగంలో అనేక కార్యక్రమాలలో పాల్గొంటూ ఉంటూ ఉంటారు.వారు వారి వారి కార్యక్రమాలు చేసుకోవడం ఇక్కడ ఎవరికి ఎలాంటి అభ్యంతరం లేదు.వారని అగౌరవపరిచే ఉద్దేశ్యం లేదు.కానీ వారు కూడ మీడియా పాసులు మెడలో ధరించి అమ్మవారి ఆలయంలో చెలామణి అవుతున్న తీరు చూస్తుంటే మీడియా ఇంత దిగజారి పోయిందా లేక దిగజార్చి వేస్తున్నారా అన్న సందేహం వ్యక్తం చేస్తున్నారు మేధావి వర్గాలు.అయితే జిల్లా సమాచార శాఖ అధికారుల ద్వారా వెల్లడవుతున్న విషయాలు చూస్తే ఉత్సవాల సందర్భంగా దుర్గగుడి కొండపైన మీడియా సెంటర్ లో పనిచేసే ప్రవేటు వ్యక్తి మధు కూడా మీడియా పాసులలో చేతివాటం ప్రదర్శించి నట్లు చెప్పకనే చెబుతున్నారు.ఇంత పెద్ద కార్యక్రమం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విషయం తెలిసి జోన్ 2 ఆర్జేడీ పి తిమ్మప్ప తన కింది స్తాయి అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ఉన్నా అమ్మవారి పాసులు అర్హులకు అందకుండా అనర్హులకు ఎలా కేటాయిస్తారన్న ప్రశ్న ఇప్పుడు సర్వత్ర వ్యక్తం అవుతోంది.

ఈ సందర్భంగా మీడియా ముసుగులో చేరి సంక్షేమం,సొరకాయ,గోంగూర కట్ట అని వల్లెమాలిన నీతులు పలుకుతూ కులం ముసుగులో కలాన్ని కించపరుస్తూ పోలీస్ స్టేషన్లలో సస్పెక్ట్ షీట్ ఉందని నేరగాళ్ల ఫోటోలలో ఉన్న వారిని ప్రక్కన చేర్చుకుని వారికోసం పత్తిత్తు కబుర్లు చెబుతూ ఆ అంటే ధర్నా ,అయ్యో అన్యాయం జరిగిందని ఉత్తుత్తి పురాణాలు చెప్పే వృద్ధనారీ పతివ్రతుడు ఇలాంటి అక్రమాలు,అన్యాయాలు జరుగుతుంటే శాలువాలు కప్పి సన్మానించి మళ్ళీ ఇప్పుడు కూడా సన్మానం చేయడానికి మానం లేని పేద సంక్షేమ నాయకుడు ఈ సమాచార అడ్డగోలు వల్ల ,ఇలాంటి సన్నాసి పనుల వల్ల పత్రికల విలువలు ఎంతవరకు దిగజారి పోతున్నాయో అర్థం కాలేదా...అంతా తెలిసినా తాను కూడా అలాంటి తాన్ పీస్ ముక్కనె కదా అని మౌనంగా ఉన్నారా అన్న ప్రశ్నలు తలెత్తున్నాయి.

ఇలాంటి దుర్మార్గకర పరిస్థితులలో విలువలు, నీతి నిబద్ధత నిజాయితీ కొత్తి మీర కట్ట అన్నవి ఏమి పనిచేయవన్న ధోరణి కనపడుతోంది.

# సంపాదకీయం

## గళమెత్తిన నవతరం

ప్రజల అవసరాలను, ఆకాంక్షలను నెరవేర్చలేని వ్యవస్థలూ, ప్రభుత్వాలూ సమస్యలను సృష్టిస్తుంటే, వాటిని ప్రశ్నిస్తూ పలు దేశాల్లోని యువతీయువకులు, విద్యార్థినీ విద్యార్థులూ వీధుల్లోకి రావటం వర్తమాన దృశ్యం. ఫ్రాన్స్‌లో పాఠశాలల దిగ్బంధం, స్పెయిన్‌లో గృహవసతి హక్కు కోసం భారీ ప్రదర్శనలు, భారత్‌లో యువజన, విద్యార్థుల పోరాటం... పెరుగుతున్న అసంతృప్తికి, మార్పును కోరుతున్న ఆకాంక్షకు సంకేతాలు! దేశాలు, భాషలూ వేరైనా నవతరం ఎదుర్కొంటున్నవి దాదాపుగా ఒకే తరహా సమస్యలు. సంపద పెరుగుతున్నా నాణ్యమైన విద్య, స్థిరమైన ఉపాధి, అందుబాటులో ఇల్లు, గౌరవప్రదమైన జీవితం ఎందుకు లభ్యం కావటం లేదన్న ఆవేదన, ఆలోచనలే యువతరం అసంతృప్తికి పునాది. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ సంపదను కేంద్రీకరించటంలో చూపే శ్రద్ధ ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చడంలో ప్రదర్శించదు. దీంతో చదువులు పూర్తయ్యాక యువతరం ఉద్యోగం కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ఉద్యోగం దొరికినా వేతనం కనీస అవసరాలకు సరిపోవడం లేదు. ఆర్థిక స్థోమత ఉన్నవారికి అవకాశాలు విస్తరిస్తుంటే, సామాన్య కుటుంబాల యువతకు పోటీ కఠినమవుతోంది. ఈ పరిస్థితులే వారు వీధుల్లోకి రావటానికి ప్రధాన కారణం. ఫ్రాన్స్‌లో గత సెప్టెంబరు మధ్యలో ప్రారంభమైన విద్యార్థుల ఉద్యమం అక్టోబరులో దేశవ్యాప్త నిరసనగా విస్తరించింది. పారిస్ సమీపంలోని క్రెటెయిల్ పాఠశాలలో మొదలైన ఆందోళనకు ఉపాధ్యాయుల కొరత, కిక్కిరిసిన తరగతి గదులు, శిథిల భవనాలు, విద్యా వనరుల లేమి ప్రధాన కారణాలు. అక్టోబరు 1 నాటికి దేశవ్యాప్తంగా వెయ్యికి పైగా పాఠశాలలు ఆందోళనల్లో పాల్గొన్నాయి. అక్టోబరు 6న జరిగిన ప్రదర్శనల్లో ప్రభుత్వ అంచనా ప్రకారం 2.66 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఒక్క పారిస్‌లోనే 56 వేల మంది వీధుల్లోకి వచ్చారు. విద్యా సదుపాయాల మెరుగుదలతోపాటు ప్రభుత్వ వ్యయాల కోతలు, ప్రభుత్వ సేవల క్షీణత, ఉద్యోగ భద్రతపైనా నిరసనకారులు గొంతెత్తారు. ఎట్టకేలకు ప్రభుత్వం దిగొచ్చి, కొరత ఉన్న పాఠశాలల్లో 3,000 మంది ఉపాధ్యాయులను నియమిస్తామని ప్రకటించింది. అన్ని సమస్యలూ పరిష్కారమయ్యేంతవరకూ పోరాటం కొనసాగుతుందని విద్యార్థి సంఘాలు తెలిపాయి. ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీనపరిస్తే పర్యవసానాలు ఎలా ఉంటాయో ఫ్రాన్స్ విద్యార్థుల ఆందోళన ఉదాహరణ. స్పెయిన్‌లో యువతరం పోరాటం మరో మౌలిక సమస్యను ముందుకు తెచ్చింది. అక్టోబరు 3న మాడ్రిడ్‌తోపాటు దేశంలోని సుమారు 50 నగరాల్లో వేలాది మంది గృహవసతి సంక్షోభానికి వ్యతిరేకంగా నిరసనలకు దిగారు. అద్దెల పెరుగుదల, ఇళ్ల కొరత, పెట్టుబడి సంస్థల ఆధీనంలోకి నివాస భవనాలు వెళ్లడం సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. మారికార్మెన్ అబాస్కల్ అనే 87 ఏళ్ల వృద్ధురాలిని సెప్టెంబరు 23న మాడ్రిడ్‌లో ఆమె నివసిస్తున్న ఇంటి నుంచి ఖాళీ చేయించిన సంఘటన ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తించింది. అద్దెదారులకు ఉపశమనం కల్పించే ప్రతిపాదనలు పార్లమెంటులో తిరస్కరణకు గురికావడంతో నిరసనలు ఉధృతమయ్యాయి. స్పెయిన్ యువజన సంఘం 2026 మేలో విడుదల చేసిన నివేదిక ప్రకారం, 2025లో యువత స్వతంత్రంగా నివసించే రేటు 14.5 శాతానికి పడిపోయింది. సగటు నెలవారీ ఇంటి అద్దె 1,176 యూరోలు కాగా, సగటు నెలవారీ వేతనం 1,191 యూరోలు మాత్రమే! అంటే వేతనంలో 98.7 శాతం అద్దెకే ఖర్చు చేయాల్సిన పరిస్థితి! ఇల్లు జీవన హక్కులో భాగం కాకుండా, పెట్టుబడిపై అధిక లాభాలు ఆర్జించే సాధనంగా మారడం ఆందోళనకరం. అద్దె మార్కెట్ యువత జీవనాన్ని సంక్షోభంలోకి నెడుతూ పెళ్లి, కుటుంబం, పిల్లలు, స్వతంత్ర జీవనం వంటి నిర్ణయాలనూ ప్రభావితం చేస్తోంది. భారత్‌లో విద్యార్థి, యువజనుల అసంతృప్తి విస్తృతమైన సమస్యలతో ముడిపడి ఉంది. నీట్ పరీక్షల్లో అవకతవకలు, ప్రభుత్వ నిర్లక్ష్యం విద్యార్థుల్లో తీవ్ర ఆందోళనకు దారితీశాయి. ప్రభుత్వ విద్యను బలహీనపరచడం, కార్పొరేటు విద్యారంగాన్ని విస్తరించడం, కుటుంబాలపై పెరుగుతున్న ఆర్థిక భారం, అవకాశాల కొరత ఈ సంక్షోభానికి కారణాలు. అలాగే కాంట్రాక్టు ఉద్యోగాలు, తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం యువత నిరాశను పెంచుతున్నాయి. ఈ సమస్యలకు పరిష్కారం చూపాల్సిన పాలకులు ప్రజల దృష్టిని మళ్లించే మతోన్మాద, విద్వేష రాజకీయాలకు పాల్పడుతున్నారు. అధికారమే పరమావధిగా వ్యవస్థలన్నింటినీ భ్రష్టు పట్టిస్తున్నారు. నిరుద్యోగం గురించి ప్రశ్నిస్తే దేశభక్తి గురించి మాట్లాడటం, తమ వైఫల్యాలను ప్రత్యర్థుల కుట్రగా చిత్రీకరించడం, ఆర్థిక అసమానతల చర్చను మతపరమైన విద్వేషంగా మార్చడం బిజెపి హయాంలో జాతీయ విధానంగా మారిపోయింది. ఇతర దేశాల ప్రజలను, ఇతర మతాలను సమస్యలకు మూలంగా చూపే సంకుచిత ఎత్తుగడలు ప్రపంచవ్యాప్త ధోరణిగా మారాయి. భారతదేశంలో మోదీ, అమిత్ షాల పాలన ఇందులో రెండాకులు ఎక్కువే చదివింది. అందుకే జంతర్ మంతర్ ఆందోళనలను సంభాషణతో, సామరస్య వాతావరణంతో పరిష్కరించాల్సిందిపోయి నిరంకుశంగా, అప్రజాస్వామికంగా అణచివేయాలని చూస్తోంది. ఉద్యమాలను అణచివేస్తే అవి సమసిపోవు. తగిన పరిష్కారం చూపిస్తేనే సద్దుమణుగుతాయన్న కనీస ఇంగితాన్ని మరచి ప్రవర్తిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా యువతరం వీధుల్లోకి రావడం ప్రస్తుత పెట్టుబడిదారీ, నయా ఉదారవాద విధానాల వైఫల్యాలకు స్పష్టమైన సూచిక. అభివృద్ధి ఫలాలు కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమైతే మెజారిటీ ప్రజలు ఇక్కట్లలో పడతారు. వీధుల్లోకి వస్తారు. ఉత్పత్తి పెరుగుతున్నా ఉద్యోగాలు పెరగకపోవడం, విద్య విస్తరిస్తున్నా అర్హతలకు తగ్గ ఉపాధి లభించకపోవడం, నగరాలు అభివృద్ధి చెందుతున్నా సామాన్యులకు ఇళ్లు అందుబాటులో లేకపోవడం పెట్టుబడిదారీ వ్యవస్థలోని తీవ్రమైన వైరుధ్యాలు. వీటిని పరిష్కరించాలంటే సంపద కేంద్రీకరణను తగ్గించి, విద్య, ప్రజారోగ్యం, సామాజిక భద్రతపై ప్రభుత్వ వ్యయాన్ని పెంచాలి. ప్రజల అవసరాలను నెరవేర్చలేని అభివృద్ధి నమూనాను ప్రశ్నించడం యువతరం బాధ్యత మాత్రమే కాదు, ప్రజాస్వామ్యానికి అవసరం కూడా.

# కాలువలో పడిన మినీ బస్సు

కోటా జిల్లాలోని సిమ్లియా పోలీస్ స్టేషన్ పరిధిలో, కరాడియా గ్రామం సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఏపీని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు

ఏకగ్రీవాలు ఎందుకు? నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడమెందుకు?" అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. నాడు వైసీపీ హయాంలో హింసాకాండ జరిగితే, నేడు టీడీపీ హయాంలో అంతకుమించిన ఘోరాలు జరుగుతున్నాయని ఆమె పోల్చారు.నామినేషన్ కేంద్రాల వద్ద గూండాలు స్వైరవిహారం చేస్తుంటే ఎన్నికల సంఘం ఏం చేస్తోందని, శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు ఎందుకు విఫలమవుతున్నారని షర్మిల నిలదీశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ సాగిస్తున్న ఈ దౌర్జన్య వైఖరిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో కక్ష సాధింపు రాజకీయాలకు, రక్తపాతానికి తావులేదని, అభివృద్ధి కోసం పోటీ పడాలి కానీ భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆమె పలు డిమాండ్లు చేశారు. స్థానిక ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించాలని, ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నామినేషన్ వేసేలా చూడాలని, బలవంతపు ఏకగ్రీవాలను అడ్డుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగ కావాలి కానీ, పగలు ప్రతీకారాలకు వేదిక కాకూడదని ఆమె పేర్కొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై ఎంపీ బాలశౌరి సమీక్ష



మచిలీపట్నం, ప్రజాభూమి, ప్రతినిధి

సంస్థల ఎన్నికల నిర్వహణ, ఎన్నికల వ్యూహాలు, ప్రచార కార్యక్రమాలపై మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి సమీక్ష సమావేశం నిర్వహించారు. మచిలీపట్నంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో పార్లమెంట్ నిర్వాహక దళ్ సభ్యులు, సపోర్ట్ టీం సభ్యులతో ఆయన సమావేశమై ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణ, ప్రచార ప్రణాళికలు, సమన్వయంతో పనిచేయాల్సిన అంశాలపై సమీక్షించినట్లు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు, నిర్వాహకులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో కోఆర్డినేషన్ సమన్వయకర్త, ప్రచార కమిటీ సభ్యుడు, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి పాల్గొని ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం చేశారు.

## 7వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థిగా ఈమడ బత్తుల జోష్ణ నామినేషన్



మచిలీపట్నం ప్రజాభూమి, ప్రతినిధి

మచిలీపట్నం నగరపాలక సంస్థ ఎన్నికల్లో 7వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ బలపరిచిన ఈమడ బత్తుల జోష్ణ నామినేషన్ దాఖలు చేశారు. మచిలీపట్నంలోని ఆరో వార్డు సచివాలయంలో ఆమె నామినేషన్ పత్రాలను సమర్పించారు.ఈ సందర్భంగా 7వ డివిజన్ నుంచి టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆమె నామినేషన్ దాఖలు చేశారు.

## ఎన్నికల నేపథ్యంలో 'మీకోసం' ప్రజా ఫిర్యాదుల స్వీకరణ తాత్కాలిక నిలుపుదల

ప్రజాభూమి, ప్రతినిధి మచిలీపట్నం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 14న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో కృష్ణా జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రతి సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్–మీకోసం) కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఎన్నికల ప్రక్రియ పూర్తయి, రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల ముగింపుపై అధికారిక ప్రకటన వెలువరించిన అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికను తిరిగి యథావిధిగా నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు.కావున ప్రజలు, అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి, తమ ఫిర్యాదులు, వినతులను ఎన్నికల ప్రక్రియ ముగింపుపై అధికారిక ప్రకటన వెలువడిన అనంతరం సమర్పించాలని అధికారులు సూచించారు.

## 8వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థిగా శీలం భారతి నాగ కుసుమ రాణి నామినేషన్

మచిలీపట్నం, ప్రజాభూమి, ప్రతినిధి

మచిలీపట్నం నగరపాలక సంస్థ ఎన్నికల్లో 8వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన శీలం భారతి నాగ కుసుమ రాణి తన నామినేషన్‌ను దాఖలు చేశారు. ఆరో వార్డు సచివాలయంలో ఆమె నామినేషన్ పత్రాలను సమర్పించారు.ఈ సందర్భంగా 8వ డివిజన్ నుంచి కార్పొరేటర్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆమె నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిసింది.





## ఇంద్రకీలాద్రిపై భక్తజన సందోహం

### భవానీల రాకతో పెరిగిన రద్దీ.. సమన్వయంతో ఏర్పాట్ల పర్యవేక్షణ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిస్తున్న కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులతోపాటు భవానీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారి నామస్మరణతో కొండపై ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు వాలంటీర్లు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. రెడ్‌క్రాస్, ఎన్ఎస్ఎస్ బృందాలు సేవలందిస్తుండగా, వైద్య బృందాలు ప్రాథమిక చికిత్స అందిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల కోసం అంబులెన్సులు అందుబాటులో ఉన్నాయి.

**శాఖల మధ్య సమన్వయం:** జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం వివిధ శాఖల సేవలను సమన్వయం చేస్తోంది. దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ ఆధ్వర్యంలో ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు.

నగర పోలీసు కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు ఆధ్వర్యంలో పోలీసులు భద్రత, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేప డుతున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర ఆధ్వర్యంలో పారిశుధ్యం, పరిసరాల నిర్వహణపై సిబ్బంది దృష్టి సారిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ బృందాలు, రెడ్‌క్రాస్, ఎన్ఎ స్ఎస్ వాలంటీర్లు తమ సేవలను అందిస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా సహకరిస్తున్నారు.

## దసరా ఉత్సవాలలో వృద్ధులకు, దివ్యాంగులకు ప్రత్యేక బ్యాటరీ వాహనాలు



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారి దేవస్థానంలో వృద్ధులకు దివ్యాంగులకు ప్రత్యేకమైన సదుపాయాలు కల్పిస్తున్నారు. వృద్ధులు కోసం దివ్యాంగుల కోసం ప్రత్యేక బ్యాటరీ వాహనాలు ఏర్పాటు చేసి వారికోసం సదుపాయాలు దేవస్థాన అధికారులు ఏర్పాటు చేశారు. వృద్ధులు దివ్యాంగులు కు సదుపాయాలు కల్పిస్తున్న తీరుపై ఆలయ ఈవో శీనా నాయక్ ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తూ వారికి ఇబ్బందులు లేకుం డా దర్శన ఏర్పాట్లు చేయాలని ఆదేశిస్తున్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆదేశాల మేరకు వృద్ధుల కోసం దివ్యాంగుల కోసం ప్రత్యేకమైన బ్యాటరీ వాహనాల ద్వారా సిబ్బంది తమ సేవలను అందిస్తున్నారు. అమ్మవారి ఆలయానికి వచ్చిన సందర్భంలో దసరా ఉత్సవాలలో తమ కోసం ప్రత్యేకంగా బ్యాటరీ వాహనాలు ఏర్పాటు చేయడంపై వృద్ధులు దివ్యాంగులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఆలయ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## దుర్గమ్మ వారికి సారె సమర్పించిన టీటీడీ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి దుర్గమ్మ వారికి సారెను శనివారం మధ్యాహ్నం సమర్పించారు. ఆలయ అధికారులు తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తలు జాస్తి సాంబశివ రావు, నన్నపనేని సదాశివరావు, ఆలయ సూపరిమెంటె సూర్యనారాయణ టిటిడి సిబ్బంది సారెను అమ్మవారికి సమర్పించిన వారిలో ఉన్నారు. అమ్మవారికి సారె సమర్పించిన అనంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు వారికి వేద ఆశీస్సులు అందజేశారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ( గాంధీ ) అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాలను వారికి అందజేశారు





## మచిలీపట్నం మేయర్ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ అబీదా

### కూటమి తరఫున బరిలోకి.. నగర అభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాభూమి,మచిలీపట్నం ప్రతినిధి :

స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగడంతో మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థి ఎవరనే అంశంపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ కూటమి తమ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ మైనారిటీ నాయకుడు హసీంబేగ్ సతీమణి షేక్ అబ్దుల్ అబీదాను ప్రకటించింది.ఈ సందర్భంగా మేయర్ అభ్యర్థి షేక్ అబ్దుల్ అబీదా మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా ఎంపిక చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరికి కృతజ్ఞతలు తెలిపారు.మచిలీపట్నం నగర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. నగర ప్రజల అవసరాలను గుర్తించి, అందరి సహకారంతో నగరాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ పనిచేస్తానని చెప్పారు.స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీలకు చెందినా నాయకులు కార్యకర్తలు అభిమానులు మేయర్ అభ్యర్థి ఐనా తననూ , కూటమి కు చెందినా కార్పొరేటర్లగా పోటీ చేస్తున్న అభ్యర్థులను కూడా ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించవలసిందిగా షేక్ అబ్దుల్ అబీదా విజ్ఞప్తి చేశారు. మేయర్ అభ్యర్థితో పాటు కృష్ణా జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ హసింబేగ్, నగరానికి చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేయర్ అభ్యర్థి అబ్దుల్ ఆబిదా బేగంకు జనసేన నేతల మద్దతు



మచిలీపట్నం, ప్రజాభూమి, ప్రతినిధి

మచిలీపట్నం కూటమి మేయర్ అభ్యర్థి షేక్ అబ్దుల్ ఆబిదా బేగం, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ హసీం బేగ్ దంపతులు శనివారం మచిలీపట్నంలో జనసేన పార్టీ స్థానిక సంస్థల సమన్వయకర్తలు మండలి వెంకట్రామ్, బండి రామకృష్ణ, చిలకలపూడి పాపారావులను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కూటమి మేయర్ అభ్యర్థిగా ఎంపికైన షేక్ అబ్దుల్ ఆబిదా బేగంకు జనసేన నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఆమెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, విజయానికి సహకరిస్తామని భరోసా ఇచ్చారు.ఈ భేటీతో మచిలీపట్నంలో కూటమి అభ్యర్థికి జనసేన నాయకుల మద్దతు మరింత బలపడినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## దోహా–ఖతార్‌లో క్రైస్తవ సేవకులకు సేవా రత్న అవార్డుల ప్రదానం



### క్రైస్తవ సంఘాల ఆహ్వానం మేరకు పర్యటించిన జాన్ బెన్నీ లింగందోహా–ఖతార్

ప్రజాభూమి, ప్రతినిధి . గుడ్లవల్లేరు

దోహా–ఖతార్‌లోని పలు క్రైస్తవ సంఘాల ఆహ్వానం మేరకు అసోసియేషన్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు, క్రైస్తవ ఐక్యవేదిక అధ్యక్షులు దైవజనులు జాన్ బెన్నీ లింగం పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ క్రైస్తవ సంఘాల ఆరాధనా కార్యక్రమాల్లో పాల్గొని, విశ్వాసులకు ఆధ్యాత్మిక సందేశాలను అందించారు. ఖతార్‌లో ఉద్యోగాలు చేస్తూ నివసిస్తున్న భారతీయ క్రైస్తవుల యోగక్షేమాలను తెలుసుకుని, వారి సంఘ పరిచర్యలు, సువార్త సేవలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలపై వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా జాన్ బెన్నీ లింగం మాట్లాడుతూ, విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ క్రైస్తవులు తమ విశ్వాసాన్ని కొనసాగిస్తూ, సంఘాల ద్వారా ఆధ్యాత్మిక సేవలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ సంఘాల్లో దేవుని వాక్యాన్ని ప్రకటించి విశ్వాసులకు ఆధ్యాత్మిక ప్రోత్సాహాన్ని అందించడంతో పాటు, క్రీస్తును విశ్వసించిన వారికి బాప్తిస్మాలు ఇచ్చినట్లు తెలిపారు. విదేశాల్లో నివసిస్తున్న క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి జీవన పరిస్థితులను కూడా తెలుసుకున్నట్లు పేర్కొన్నారు.

**క్రైస్తవుల ఆరాధనకు ఖతార్‌లో సదుపాయాలు అభినందనీయం..** ఖతార్‌లో క్రైస్తవులు ఆరాధనా కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ప్రత్యేక ప్రార్థనా స్థలాలు, భద్రతా సదుపాయాలు కల్పించడం అభినందనీయమని జాన్ బెన్నీ లింగం అన్నారు. వివిధ దేశాల నుంచి వచ్చి ఖతార్‌లో నివసిస్తున్న క్రైస్తవులకు తమ విశ్వాసం ప్రకారం ప్రార్థనలు చేసుకునే అవకాశాలు కల్పిస్తున్న ఆ దేశ పాలకులకు భారతీయ క్రైస్తవుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. క్రైస్తవుల ఆధ్యాత్మిక అవసరాలను గౌరవిస్తూ, ప్రార్థనా కార్యక్రమాలకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం ప్రశంసనీయమన్నారు.

**క్రైస్తవ సేవకులకు సేవా రత్న అవార్డులు..** భారతదేశం నుంచి ఖతార్‌కు వెళ్లి ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే దేవుని సేవలో నిబద్ధతతో పనిచేస్తున్న పలువురు క్రైస్తవ సేవకులను గుర్తించి, క్రైస్తవ ఐక్యవేదిక తరఫున సేవా రత్న అవార్డులను ప్రదానం చేశారు. విదేశాల్లో జీవనోపాధి కోసం శ్రమిస్తూ, తమ విలువైన సమయాన్ని కేటాయించి సంఘ పరిచర్యలు, ప్రార్థనా కార్యక్రమాలు, బైబిల్ అధ్యయనాలు, ఆధ్యాత్మిక సహవాసం ద్వారా విశ్వాసులకు సేవలందిస్తున్న వారి కృషిని గుర్తించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని జాన్ బెన్నీ లింగం తెలిపారు.దేవుని సేవలో నిస్వార్థంగా పనిచేసే వారిని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింతమంది సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేందుకు అవకాశం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు.

**సేవా కార్యక్రమాల్లో కృషి చేస్తున్న వారికి గుర్తింపు...** దోహా–ఖతార్‌లో క్రైస్తవ సేవలు నిర్వహిస్తూ, విశ్వాసుల ఆధ్యాత్మిక అభివృద్ధికి కృషి చేస్తున్న పలువురు సేవకులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. వారిలో ఫెయిత్ మినిస్ట్రీస్ అధినేత పాస్టర్ హేమంత్, గ్రేస్ ఫెలోషిప్ తెలుగు బైబిల్ స్టడీకి చెందిన బ్రదర్ స్టీఫెన్, క్రైస్తవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న బ్రదర్ మహేష్, క్రీస్తు సైనికుల సహవాసం ద్వారా సేవలందిస్తున్న దైవజనులు రమోన్ ఉన్నారు.వీరితో పాటు ఖతార్‌లోని వివిధ ప్రాంతాల్లో దేవుని సేవలో కొనసాగుతున్న ఇతర సేవకుల కృషిని కూడా అభినందించారు. కుటుంబాలకు దూరంగా విదేశాల్లో నివసిస్తూ, ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూనే ఆధ్యాత్మిక సేవలకు ప్రాధాన్య త ఇవ్వడం గొప్ప విషయమని జాన్ బెన్నీ లింగం అన్నారు. ఇలాంటి సేవకులకు గుర్తింపు, ప్రోత్సా హం అందించడం ద్వారా వారి సేవలు మరింత విస్తరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**2027లో మరింతమంది సేవకులకు అవార్డులు..** ఖతార్‌లో సువార్త సేవలు, సంఘ పరిచర్యలు, ప్రార్థనా సహవాసాలు, బైబిల్ అధ్యయన కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రైస్తవ సేవకులను భవిష్యత్తులోనూ గుర్తించి ప్రోత్సహించనున్నట్లు జాన్ బెన్నీ లింగం వెల్లడించారు. ఇందులో భాగంగా 2027 సంవత్సరంలో మరికొంతమంది అర్హులైన క్రైస్తవ సేవకులకు సేవా రత్న అవార్డులు అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.దేవుని సేవలో నిబద్ధతతో పనిచేసే వారిని ప్రోత్సహించడం, వారి సేవలను సమాజానికి పరిచయం చేయడం, క్రైస్తవ సంఘాల మధ్య ఐక్యతను పెంపొందించడం క్రైస్తవ ఐక్యవేదిక ప్రధాన లక్ష్యాలని ఆయన పేర్కొన్నారు. దేశవిదేశాల్లోని క్రైస్తవ సంఘాల మధ్య పరస్పర సహకారం, ఆధ్యాత్మిక ఐక్యత, సేవా దృక్పథం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం ద్వారా ఖతార్‌లో సేవలందిస్తున్న భారతీయ క్రైస్తవ సేవకుల కృషికి తగిన గుర్తింపు లభించడంతో పాటు, భవిష్యత్తులో మరింతమంది దేవుని సేవలో చురుకుగా పాల్గొనేందుకు ప్రోత్సాహం లభిస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## వంగవీటి రాధాకృష్ణకు మద్దతుగా రాధా రంగా మిత్రమండలి

### విజయవాడ మేయర్ అభ్యర్థిగా నియమించడంపై పవన్ కళ్యాణ్, చంద్రబాబు, మోదీల చిత్రపటాలకు పాలాభిషేకం

మచిలీపట్నం, ప్రజాభూమి, ప్రతినిధి





మాజీ శాసనసభ్యులు వంగవీటి రాధాకృష్ణ జనసేన పార్టీలో చేరడం, విజయవాడ మేయర్ అభ్యర్థిగా ఆయనను నియమిం చడాన్ని స్వాగతిస్తూ మచిలీపట్నంలోని రాధా రంగా మిత్రమండలి రాష్ట్ర కార్యాలయంలో బుల్లెట్ ధర్మారావు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగా చిత్రపటంతో పాటు జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం బుల్లెట్ ధర్మారావు, మహిళా కమిటీ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా ఒక కులానికో, మతానికో పరిమితమైన నాయకుడు కాదని, అన్ని వర్గాల ప్రజలకు ఆత్మీయుడిగా నిలిచిన ప్రజానాయకుడని పేర్కొ న్నారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచి వారి హక్కుల కోసం పోరాడిన నాయకుడిగా రంగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు.రంగా వారసుడైన వంగవీటి రాధాకృష్ణను విజయవాడ మేయర్ అభ్యర్థిగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాధాకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రేపు ఆదివారం ఉదయం 9.30 గంటలకు వంగవీ టి మోహనరంగా నివాసం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరి రాధాకృష్ణ నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో, రంగా అభిమానులు, పవన్ కళ్యా ణ్ అభిమానులు, కూటమి నాయకులు, వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పద్మనాభుని శేఖర్, విన్నకోట సుబ్బారావు, మత్తి వెంకటేశ్వరరావు, మట్టా దత్తుడు, బడుగు ఉమాదేవి, ముంగండ బాలకుమారి, గోపిశెట్టి దుర్గ, రాయపరెడ్డి నాగమణి, ఎడ్ల అప్పాయమ్మ, మీసాల లక్ష్మి, ఉమ్మారెడ్డి నాగమణి, మోగంటి బాలాజీ, నిడదవోలు శ్రీనివాసరావు, నూకల రమేష్ బాబు, చలమలశెట్టి మల్లేశ్వరరావు, దాసరి శంకర్రావు, బెనర్జీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రజాభూమి



## కనక దుర్గమ్మ ఆలయం లో మాగంటి బాబు దంపతుల పూజలు.

ప్రజాభూమి ప్రతినిధి–పెదపాడు



బొమ్ములూరు గ్రామ పరిధిలో ఐఎన్ సి 1947 యూనిట్ కల్యాణ మండపం వద్ద విశ్వహిందూ పరిషత్ నాయకులు పుట్టగుంట వెంకట సతీష్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా కనక దుర్గ మ్మ దేవాలయం లో మాగంటి బాబు, పద్మవల్లీ దేవి దంపతులు ప్రత్యేక అర్చనలు పూజలు నిర్వ హించారు.అమ్మవారి పాదాల చెంత జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవికి ఆభ్యర్ధన పత్రాన్ని ఉంచి వేదపండితుల ఆశీస్సులు తీసుకున్నారు. తదుపరి జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మాగంటి కుటుంబ సభ్యులు, విశ్వహిందూపరిషత్ ప్రతినిధులు,తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు, పెద్ద సంఖ్య లో భవాని భక్తులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ క్వాలిఫైడ్ పోటీ లలో మెయిన్ డ్రా కు 96 మంది అర్హత

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు



సిహెచ్ బుద్ధ అవతారం రాజు మెమోరియల్ ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ క్వాలిఫైడ్ పోటీలు శుక్రవారం, శనివారం తో ముగిసాయని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ భూన్ రాజు తెలిపారు. ఈ టోర్నమెంట్లో మెయిన్ డ్రా కు సింగిల్స్ విభాగంలో 96 మంది డబుల్స్ విభాగంలో 48 మంది క్రీడాకారులు అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. మెయిన్ డ్రా మ్యాచులు 18వ తేదీన ప్రారంభమవుతాయని, ఇనాగరేషన్ కార్యక్రమం ఆదివారం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జల వనరుల శాఖ మాత్యులు డాక్టర్ నిమ్మల రామానాయుడు పాల్గొని ప్రారంభిస్తారని, ఈ టోర్నమెంట్ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, డైరెక్టర్ వివి సోమరాజు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని, మెయిన్ డ్రా కు అర్హత సాధించిన క్రీడాకారులు కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పాలకొల్లు, టౌన్ హాల్ పాలకొల్లు, ఆఫీసర్స్ క్లబ్ నరసాపురం టెన్నిస్ కోర్టులలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు బూన్ రాజు తెలిపారు. ఈ టోర్నమెంట్లో 45, 55, 65, 70,, 75 వయసుల దాటిన వారు , డబల్స్, సింగిల్స్ రూపంలో ఈ టోర్నమెంట్లు ను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

## ఏలూరు మేయర్ అభ్యర్థిగా రెడ్డి అప్పలనాయుడు నామినేషన్

### –భారీ ర్యాలీతో మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు

ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు



నగర మేయర్ పదవికి ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా జనసేన పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు శనివారం భారీ ర్యాలీతో తరలివెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. నగరంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కూటమి నాయకులు,కార్యకర్తలు, అభిమానుల నడుమ ర్యాలీ ప్రారంభమైంది. నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలకగా, మహిళలు హారతులు ఇచ్చారు. అభిమానులు భారీ గజమాలలు వేసి, పూలవర్షం కురిపించారు.జై కూటమి నినాదాలతో నగర వీధులు మార్మోగాయి.ఈ కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు,బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తపన సీతారామాంజనేయ చౌదరి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్,రాష్ట్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఘంటసాల వెంకటలక్ష్మి, జనసేన సీని యర్ నాయకుడు నారా శేషు తదితర కూటమి నాయకులు పాల్గొని రెడ్డి అప్పలనాయుడికి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో మేయర్ అభ్యర్థిగా బరిలో నిలిచినట్లు తెలిపారు.కూటమి ధర్మాన్ని పాటిస్తూ ఏలూరు నగర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొ న్నారు.జనసేన పార్టీని బలోపేతం చేయడంతో పాటు కూటమి పార్టీల మధ్య ఐక్యత, సమన్వ యాన్ని కాపాడేందుకు కృషి చేస్తానన్నారు.నాయకులు, కార్యకర్తలు,వీర మహిళల మనోభా వాలకు ప్రాధాన్యమిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని తెలిపారు.కూటమి ఎమ్మెల్యేలు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో ఐక్యంగా పనిచేసి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కూటమి ఐక్యతను కాపాడుకుంటూ ప్రజల విశ్వాసాన్ని చూరగొనాలని సూచించారు.ఈ ర్యాలీకి ఏలూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి నాయకులు,కార్యకర్తలు తరలివచ్చారు.

## గాదం సత్యనారాయణ మెమోరియల్ వెటరన్ క్రికెట్ టోర్నీ ప్రారంభం



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

బీసీసీఐ లెవెల్–1 కోచ్,క్రీడాకారుడు గాదం సత్యనారాయణ స్మారకార్థం నిర్వహిస్తున్న మెమోరియల్ వెటరన్ రీ–యూనియన్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ఏలూరులోని ఆశ్రమ్ మెడికల్ కాలేజీ క్రికెట్ గ్రౌండ్‌లో ప్రారంభమైంది.తొలుత క్రీడాకారులు దివంగత సత్యనారాయణకు నివాళులర్పించారు.పశ్చిమ గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసరాజు జ్యోతి ప్రజ్వలన చేసి టోర్నీని ప్రారంభించారు.రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వెటరన్ క్రికెటర్లు సత్యనారాయణతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.తొలి మ్యాచ్‌లో చినపారుపూడి జట్టుపై 11 జెమ్స్ జట్టు విజయం సాధించింది.చినపారుపూడి జట్టు 13 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 78 పరుగులు చేయగా,11 జెమ్స్ జట్టు రెండు వికెట్లు కోల్పోయి 105 పరుగులు సాధించింది.38 పరుగులు చేసిన కెన్నీకే కిశోర్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.11 జెమ్స్ బౌలర్ కృష్ణకుమార్ రెండు ఓవర్లలో మూడు పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. లంచ్ అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో బాబా 11 జట్టు వైజాగ్ కోల్ట్స్‌పై విజయం సాధించింది.తొలుత బ్యాటింగ్ చేసిన బాబా 11 జట్టు 13 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 83 పరుగులు చేసింది.అనంతరం వైజాగ్ కోల్ట్స్ జట్టు నాలుగు వికెట్లు కోల్పోయి 75 పరుగులకే పరిమితమైంది.24 పరుగులు చేసిన బాబా 11 బ్యాటర్ విఘ్నేష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

## రోడ్డు ప్రమాదాల నిర్వహణకు శాశ్వత పరిష్కారం

### జిల్లా ఎస్పీ కె ప్రతాప శివ కిషోర్.

ప్రజాభూమి బ్యూరో–ఏలూరు జిల్లా

ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఎన్‌హెచ్–16 పై ఐదు ఫ్లైఓవర్ల ప్రమాదకర ఎత్తుపల్లాలకు రూ.7 కోట్లతో శాశ్వత పరిష్కారం కొరకు పనులు ప్రారంభించారు. ప్రజల ప్రాణరక్షణే ధ్యేయంగా, వాహనదారుల సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, చొరవ ఫలితంగా. జాతీయ రహదారి ఎన్ హెచ్–16 పై తరచూ ప్రమాదాలకు కారణమవుతున్న ఫ్లైఓవర్ల ఎత్తుపల్లాల సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం సుగమమైంది. ఏలూరు జిల్లాలో కలపర్రు నుంచి గుండుగొలను వరకు గల ఐదు ప్రధాన ఫ్లైఓవర్లపై రూ. 7 కోట్ల వ్యయం తో శాశ్వత నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.ఎన్‌హెచ్–16 పై కలపర్రు నుంచి గుండుగొలను వరకు గల ఎస్.వి. రంగారావు విగ్రహం సమీపం, ఏలూరు ఆశ్రమం, కొవ్వలి, దెందులూరు, సత్యనారాయణపురం ఫ్లైఓవర్లపై రహదారి ఉపరితలం దెబ్బతిని ప్రమాదకరమైన ఎత్తుపల్లాలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈ సమస్యపై ఏలూరు జిల్లా డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో ద్వారా పలుమార్లు జాతీయ రహదారి అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, నిర్వహణ సంస్థ తాత్కాలికంగా బీటీ మరమ్మతులు చేపట్టినప్పటికీ సమస్య పునరావృతమవుతూనే ఉంది. ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, స్వయంగా ఫ్లైఓవర్లను పరిశీలించారు. సమస్య తీవ్రతను స్వయంగా అంచనా వేసి, తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా ఎత్తుపల్లాలను శాశ్వతంగా తొలగించాలని ఎంహెచ్–16 అధికారులను ఆదేశించారు.జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో ఈ అంశాన్ని ఎన్ హెచ్ పి డి ఉ సీఎంఓ విద్యాసాగర్ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్పీ యొక్క ఆదేశాలకు స్పందించిన ఎన్‌హెచ్ పీడీ విద్యాసాగర్, నిర్వహణ సంస్థ అయిన



వరాహ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్' కంపెనీ ద్వారా శాశ్వత పనులు చేపట్టేలా తక్షణ చర్యలు ప్రారంభించారు.ప్రస్తుతం తొలిదశలో దెందులూరు , కొవ్వలి ఫ్లైఓవర్లపై దెబ్బతిన్న రోడ్డు బీటీ సైడ్ కాంక్రీట్ వాల్‌ను తొలగించి శాశ్వత నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.తదుపరి దశలో ఆశ్రమం, ఎస్.వి. రంగారావు విగ్రహం సమీపం సత్యనారాయణ పురం ఫ్లైఓవర్లపై కూడా ఇదేరీతిలో పనులు చేపట్టనున్నారు. రూ. 7 కోట్ల అంచనా



వ్యయంతో చేపట్టే ఈ ఐదు ఫ్లైఓవర్ల పనులను రాబోయే రెండు నెలల కాల వ్యవధిలో పూర్తి చేసి రహదారి సమస్యకు శాశ్వత తెరదించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.రోడ్డు లోపాల వల్ల భవిష్యత్తులోనూ ప్రమాదాలు పునరావృతమైతే, సంబంధిత ఇంజినీరింగ్ విభాగం , నిర్వహణ సంస్థల బాధ్యతను పరిశీలించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.కేవలం శాంతిభద్రతల పరిరక్షణే కాకుండా, రోడ్డు భద్రత విషయంలోనూ ఇతర శాఖల యొక్క అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏలూరు జిల్లా పోలీసు శాఖ తీసుకుంటున్న ఈ ముందస్తు చర్యలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఏలూరు వైసిపి మేయర్ అభ్యర్థిగా గంట మోహన్ రావు నామినేషన్

ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు



నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గంట మోహన్ రావు (జీఎంఆర్) నామినేషన్ దాఖలు చేశారు. శనివారం ఉదయం నిర్వహించిన ఈ నామినేషన్ కార్యక్రమంలో ఏలూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్ఆర్) పాల్గొన్నారు.ముందుగా ఏలూరులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నాయకులు ర్యాలీగా బయలుదేరారు.ఈ కార్యక్రమంలో దూలం నాగేశ్వరరావుతో పాటు ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు, శాసనమండలి సభ్యుడు వంక రవీంద్రనాథ్, ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త,పీఏసీ సభ్యుడు పుప్పాల వాసుబాబు,ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ),ఏలూరు నియోజకవర్గ పరిశీలకుడు డీవీఆర్కే చౌదరి పాల్గొన్నారు.పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వరకు కొనసాగింది.అనంతరం పార్టీ మేయర్ అభ్యర్థి గంట మోహన్ రావు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఏలూరు నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున మేయర్ అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయడం ఈ కార్యక్రమంలో ప్రధాన ఘట్టంగా నిలిచింది.పార్టీకి చెందిన పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొనడంతో నగరంలో రాజకీయ సందడి నెలకొంది.



## అమ్మవారికి కుంకుమార్చన

ప్రజా భూమి ప్రతినిధి–చాట్రాయి

దేవి శరన్నవరాత్రుల సందర్భంగా శనివారం ఏడవ రోజు కార్యక్రమంలో భాగంగా అమ్మవారుశ్రీ లక్ష్మీదేవి అవతారంలో దర్శనం ఇవ్వటం జరిగింది. చీపురుగూడెం గ్రామంలో కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహణ చేయడం జరిగినది .ఈ కార్యక్రమం లో సుమారు 120 మంది స్త్రీ మూర్తులు పాల్గొనడం జరిగినది. మండల మహిళా విభాగం మండల మహిళా కన్వీనర్ శ్రీరాముల భాగ్య లక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహణ చేయడం జరిగినది. నూజివీడు కండ ధర్మ ప్రచారకు పరమేశ్వర రావు ఈ కార్యక్రమం లో పాల్గొనడం జరిగింది. ఈ కుంకుమార్చన పూజలో భక్తులు పాల్గొన్నారు.

## క్షీరపురిలో ఘనంగా కవి సార్వభౌముడు

### శ్రీ కృష్ణదేవరాయలు వర్ధంతి వేడుకలు.

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

శ్రీ కృష్ణదేవరాయ సాంస్కృతిక విజ్ఞాన కేంద్రం–పాలకొల్లు వ్యవస్థాపక అధ్యక్షులు యర్రం శెట్టివెంకటరత్నం ఆధ్వర్యంలో. పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్ లో వున్న శ్రీ కృష్ణ దేవరాయలు విగ్రహం వద్ద ఈరోజు రాయలు 497 వ వర్ధంతి నివాళులు ఘనంగా జరిగాయి.సంస్థ గౌరవ అధ్యక్షులు, యూ కే ఎస్ సి గవర్నర్ పెనుమాక రామ్మోహన్ మాట్లాడుతూ దక్షిణ భారత ప్రజల అభిమాన పాత్రుడు, అష్టదిగ్గజాలను తన కొలువులో నిలుపుకొన్న కవిసార్వభౌముడు, ముస్లీం సామ్రాజ్యవాదులను దక్షిణ భారతంలో అడుగిడు నివ్వని ఓటమి ఎరుగని వీరాధి యోధుడు విజయనగర సామ్రాజ్యాధీసుడు శ్రీకృష్ణదేవరాయలు మరణశాసనంకర్ణాటక రాష్ట్రం తుముకూరుజిల్లా హొన్నెన హళ్లి గ్రామం లో ఉన్న గోపాలకృష్ణ దేవాలయం వద్ద కన్నడ శాసనం 17–10–1529 తేది ఆధారంగా రాయల వర్ధంతి వేడుకలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని తెలియజేసారు.

దేశభాషలందు తెలుగు లెస్స అని ప్రపంచానికి ఎలుగెత్తి చాటి చెప్పిన శ్రీ కృష్ణదేవరాయలుకు పూలమాలతో నివాళులు అర్పించడం తో సరిపెట్టక వివిధ సేవా కార్యక్రమాల తో పాటురాయల స్మరణ మనకు తెలుగు భాషపై ప్రేమను, సాహిత్యం పై ఆసక్తిని, సంస్కృతి పై గౌరవాన్ని, సమాజం పట్ల భాద్యతను కలిగిస్తున్న ఈ సాంస్కృతిక విజ్ఞాన కేంద్రం లక్ష్యాలకు తోడుగానిలుస్తామని ముఖ్య అతిధులు గా విచ్చేసిన జాతీయ ఉత్తమ



ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు వంగా నరసింహారావు, కలిదిండి వెంకట పతి వర్మ, సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు జి ఎస్ ఎన్ మూర్తి లు రాయలు కీర్తి ని కొనియాడారు.సంస్థ ఉపాధ్యక్షులు కానూరి ప్రభాకర్ వందన సమర్పణ చేశారు.ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పశ్యావుల రవికుమార్, కొమ్ముల మురళీ కృష్ణ కోశాధికారి జక్కంపూడి మదన్,డా. చవాకుల నరేష్ బాబు, శిరిగినీడి రాంబాబు,మండెల పణినాథ్, బోనం మునసబు,చేగొండి ప్రభాకర్, ఇనుకొండ శేషాద్రి, రాయి సూరిబాబు, మండెల రజనీ, చెరుకూరి శ్రీనివాస్, కర్రా నరసింహారావు, కొండ్రెడ్డి సూరిబాబు, మద్దాల ముత్తాజీ రావు, ఉనికెల శ్రీనివాసరావు, గుండుమోగుల వీరాస్వామి, గంధం యేసుపాదం, రావి సిద్ధార్థ, తాళాబత్తుల వెంకటేశ్వర రావు,తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## రొయ్యల మేత ధరల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలి

### ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్.

ప్రజాభూమి బ్యూరో–ఏలూరు జిల్లా.

వెనామీ ఫీడ్‌పై టన్నుకు రూ.9,350, టైగర్ ఫీడ్‌పై రూ.12,870 అదనపు భారం మోపడం దుర్మార్గమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం ఏలూరు అన్నే భవనంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రొయ్యల మేత (ఫీడ్) కంపెనీలు మరోసారి ధరలు పెంచి ఆక్వా రైతులపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపడం తగదన్నారు.వెనామీ రొయ్యల ఫీడ్‌పై టన్నుకు ఎమ్మార్పీ ప్రకారం రూ.9,350, టైగర్ రొయ్యల ఫీడ్‌పై రూ.12,870 చొప్పున ధరలు పెంచడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తాజా పెంపుతో వెనామీ ఫీడ్ ధర టన్నుకు సుమారు రూ.1.23 లక్షలకు, టైగర్ ఫీడ్ ధర సుమారు రూ.1.39 లక్షలకు చేరిందన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో టన్నుకు రూ.4,000, జూన్‌లో రూ.12,000 చొప్పున ఫీడ్ ధరలను కంపెనీలు పెంచాయని, తాజాగా మరోసారి ధరలు పెంచడంతో ఎనిమిది నెలల వ్యవధిలోనే రైతులపై అదనపు భారం గణనీయంగా పెరిగిందన్నారు.2024 ఏప్రిల్‌లో టన్ను వెనామీ ఫీడ్ ధర రూ.82 వేలు,టైగర్ ఫీడ్ ధర రూ.92 వేలు ఉండగా, ప్రస్తుతం వెనామీ ఫీడ్ ధర రూ.1.23 లక్షలకు, టైగర్ ఫీడ్ ధర రూ.1.39 లక్షలకు చేరడం ఆక్వా రంగంలో పెరుగుతున్న సంక్షోభానికి నిదర్శనమన్నారు. ఫీడ్ ధరల పెరుగుదలతో రొయ్యల ఉత్పత్తి ఖర్చులు విపరీతంగా పెరిగాయని, వెనామీ రొయ్యల ఉత్పత్తి వ్యయం కిలోకు సుమారు రూ.300కు, టైగర్ రొయ్యల ఉత్పత్తి వ్యయం కిలోకు రూ.450కు చేరిందన్నారు. ఒకవైపు పెట్టుబడులు పెరుగుతుండగా, మరోవైపు మార్కెట్‌లో రొయ్యలకు ఆశించిన ధరలు లభించకపోవడంతో ఆక్వా రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం




చేశారు. నెలరోజుల కాలంలో కోనసీమ జిల్లాలో ఒకరు,కృష్ణా జిల్లా మరోకరు ఆక్వా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఆక్వారైతులను ఆదుకోకపోతే భవిష్యత్తులో ఆక్వా సాగు మరింత సంక్షోభంలో కూరుకు పోయే ప్రమాదం ఉంన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం స్ఫూర్తికి విరుద్ధంగా, రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఫీడ్ కంపెనీలు ఏకపక్షంగా ధరలు పెంచడం అన్యాయమని విమర్శించారు. ప్రతి 45 రోజులకు ఒకసారి ఫీడ్ ధరల పెంపును సమీక్షించే విధానం కంపెనీలకు మరింత స్వేచ్ఛ కల్పించినట్లయిందన్నారు. ధరల పెంపును నియంత్రించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహించడం వల్లే కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని మండి పడ్డారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని పెంచిన ఫీడ్ ధరలను తగ్గించాలని, ప్రభుత్వ అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ధరలు పెంచిన కంపెనీలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఫీడ్ ధరల నిర్ణయంలో ఆక్వా రైతుల ప్రతినిధులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, ధరల పెంపుపై పారదర్శకమైన విధానాన్ని అమలు చేయాలని కోరారు.ఆక్వా రైతుల ప్రయోజనాలను కాపాడటం రాష్ట్ర ప్రభుత్వానికి బాధ్యత ఉందన్నారు. ఫీడ్ కంపెనీల లాభాల కోసం రైతులపై భారాలు మోపే విధానాన్ని తక్షణమే నిలిపివేసి, పెరిగిన ఉత్పత్తి ఖర్చుల నుంచి రైతులకు ఉపశమనం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అంతర్వేదిగూడెం ఎంపీటీసీ స్థానానికి సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ అభ్యర్థి కారం లక్ష్మి.

### సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సుధాకర్.

ప్రజాభూమి ప్రతినిధి–బుట్టాయగూడెం

బుట్టాయగూడెం మండలం అంతర్వేది గూడెం ఎంపీటీసీ స్థానానికి సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ అభ్యర్థిగా కారం లక్ష్మి పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి. సుధాకర్ ప్రకటించారు. అంతర్వేది గూడెం మండల ప్రాదేశిక నియోజకవర్గం (ఎం పి టి సి) పరిధి గ్రామాల ముఖ్య నాయకుల సమావేశం ఏ ఐ కే ఎం ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కారం రాఘవ అధ్యక్షతన గురుగుమిల్లిలో శనివారం నిర్వహించారు.ఈ సమావేశంలో సుధాకర్ మాట్లాడుతూ దేశం లో ప్రజాస్వామ్య విధానాలను ధ్వంసం చేస్తూ, పరిపాలన కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడే, ప్రజాస్వామ్య ఉద్యమకారులను గెలిపించవలసిన అవశ్యకత



ఆసన్నమైందన్నారు. ఎన్నికలు, ఓట్లు అనేది ప్రజాస్వామ్యానికి గీటురాయిగా ఉండాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజాస్వామిక ఉద్యమకారులను సమాజం మార్పు కోసం పని చేసే నాయకులను , పార్టీని గెలిపించడం కోసం ప్రజలు సిద్ధం కావాలని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ కొవ్వాసు గోవిందరాజు, మాజీ సర్పంచులు పట్ల చిన్నన్న, గురుగుంట్ల గంగిరెడ్డి, కోర్స గంగరాజు, ధర్ముల సురేష్, ఎస్ రామ్మోహన్, ఈ భూషణం, కె. పోతురెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు

## రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించిన ఆగిరిపల్లి పోలీసులు

### మైనర్ల వాహన చోదనపై తల్లిదండ్రులకు కౌన్సెలింగ్



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్ ఆదేశాల మేరకు, రూరల్ సీఐ ఐ.వి. నాగేంద్ర కుమార్ పర్యవేక్షణలో ఆగిరిపల్లి ఎస్‌ఐ వి. సురేష్ పోలీసు సిబ్బందితో కలిసి ప్రధాన బజారులో కాలినడకన గస్తీ నిర్వహించి ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడంతో పాటు రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణాలు ధరించాలని, అతివేగానికి దూరంగా ఉంటూ నిబంధనలు పాటించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్ల వాహన చోదన వల్ల ప్రమాదాలతో పాటు చట్టపరమైన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని వివరించారు. “వేగం వద్దు.. ప్రాణం ముద్దు” అనే నినాదాన్ని గుర్తుంచుకోవాలని, ప్రతి వాహనదారుడు తమ కోసం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారనే విషయాన్ని గుర్తించి సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని ఎస్‌ఐ వి. సురేష్ సూచించారు. కాలినడక గస్తీతో నేరాల నివారణకు చర్యలు చేపట్టడంతో పాటు ప్రజల్లో పోలీసుల పట్ల భరోసా పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు.

## రెల్లి కమ్యూనిటీ హాల్‌కు రూ.కోటి మంజూరు పట్ల రెల్లి సామాజిక వర్గీయుల హర్షాతిరేఖాలు

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

పాలకొల్లులో రెల్లి సామాజిక వర్గీయుల చిరకాల స్వప్నం సాకారం కానుంది. రెల్లి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేయడంతో ఆ సామాజిక వర్గీయుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ సందర్భంగా రెల్లి యువజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో సామాజిక వర్గీయులు, మహిళలు పాలకొల్లులోని మంత్రి నిమ్మల రామానాయుడు కార్యాలయానికి చేరుకుని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా సామాజిక వర్గీయులు మాట్లాడుతూ.. తమ ఇళ్లలో వివాహాలు, శుభకార్యాలు, ఇతర కుటుంబ వేడుకలు నిర్వహించుకోవడానికి తగిన సామూహిక వసతి లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. శుభకార్యాల సమయంలో ఇంటి ఎదురుగా తాత్కాలిక పందిళ్లు ఏర్పాటు చేసుకోవడం, లేదంటే అద్దెకు ఫంక్షన్ హాళ్లు తీసుకుని కార్యక్రమాలు నిర్వహించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.తమ సామాజిక వర్గానికి సొంతంగా కమ్యూనిటీ హాల్ నిర్మించాలన్నది ఎన్నో ఏళ్లుగా ఉన్న కోరికని పేర్కొన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు చొరవతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.కోటి



నిధులు మంజూరు కావడంతో తమ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని ఆనందం వ్యక్తం చేశారు. ఇకపై తమ కుటుంబాల్లో జరిగే శుభకార్యాలను సొంత కమ్యూనిటీ హాల్‌లో గౌరవప్రదంగా, సౌకర్యవంతంగా నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు.తమ సామాజిక వర్గ అవసరాన్ని గుర్తించి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మంత్రి నిమ్మల రామానాయుడుకు రెల్లి యువజన సంఘం ప్రతినిధులు, సామాజిక వర్గీయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ చిరకాల ఆకాంక్ష నెరవేరే దిశగా చర్యలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

## దసరా నవరాత్రుల్లో లక్ష్మీదేవిగా అమ్మవారి దివ్యదర్శనం

- కివ్వకలో ఘనంగా కుంకుమార్చనలు...
- మహిళలు, భవానీ భక్తుల సామూహిక పూజలు.. భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తజనం

ప్రజాభూమి ప్రతినిధి–కుకునూరు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కివ్వక గ్రామంలోని స్థానిక ఆలయంలో అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సిరిసంపదలను ప్రసాదించే తల్లిగా కొలువుదీరిన అమ్మవారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, ప్రత్యేక అభిషేకాలు, ఆకర్షణీయమైన అలంకరణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లక్ష్మీదేవి కుంకుమ పూజల్లో మహిళలు, భవానీ భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో సామూ



హిక కుంకుమార్చనలు నిర్వహించి అమ్మవారిని కొలిచారు. కుటుంబాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, గ్రామ ప్రజలకు ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన పూజా కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.కివ్వక గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఆసక్తిగా పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో కిటకిటలాడింది. భవానీ భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో నెలకొన్న ఆధ్యాత్మిక వాతావరణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.పూజా కార్యక్రమాలకు హాజరైన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు విస్తృత ఏర్పాట్లు చేశారు. పూజలు ముగిసిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు పులిహోర పంపిణీ చేశారు. భక్తుల భాగస్వామ్యంతో కుంకుమ పూజలు వైభవంగా కొనసాగాయి.ఈ కార్యక్రమంలో అర్చకులు వాడపల్లి సాయి, గురుస్వామి బట్టు వీరబాబు, భవానీలు రాయికృష్ణార్జునరావు, ఇనుముల గోపరాజు, పగిళ్ల రాంబాబు, ఎం. వెంకన్నబాబు, రమేష్ గుప్తా, డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో మహిళలు, భవానీ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందారు.

## జిల్లాలో 542 గ్రామ పంచాయతీలకు నవంబర్ 15 నుంచి డిసెంబర్ 3 వరకు ఎన్నికలు

ప్రజాభూమి బ్యూరో–ఏలూరు జిల్లా

ఏలూరు జిల్లాలోని 542 గ్రామ పంచాయతీలకు నవంబర్, 15వ తేదీ నుండి డిసెంబర్ 3వ తేదీ వరకు 3 దశలలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. జిల్లాలోని 542 గ్రామ పంచాయతీలలలోని 5676 వార్డ్ మెంబర్లకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, 5801 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. మొదటి దశలో ఎన్నికలు నిర్వహించనున్న బుట్టాయిగూడెం, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కామవరపుకోట, కొయ్యలగూడెం, కుక్కునూరు, పోలవరం, టి. నర్సాపురం, వేలేరుపాడు, చింతలపూడి, లింగపాలెం మండలాలకు చెందిన 175 గ్రామ పంచాయతీలలో 1876 వార్డ్ మెంబర్లకు సంబంధించి 1993 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుచేయడం జరిగిందని, వీటికి నామినేషన్లు నవంబర్, 15వ తేదీన విడుదల చేయడం జరుగుతుందని, 17వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. 18వ తేదీన నామినేషన్లు పరిశీలించడం జరుగుతుందన్నారు. తిరస్కరించిన నామినేషన్లపై 19వ తేదీన అప్పీలు చేసుకోవచ్చుని, 20వ తేదీలోగా అప్పీళ్లను పరిష్కరించడం జరుగుతుందన్నారు. 21వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని , అదే రోజు తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు. నవంబర్,26వ తేదీన ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, అదేరోజు ఫలితాలు వెల్లడించడం జరుగుతుందన్నారు. అవసరమైన పక్షంలో 27వ తేదీన రీపోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. రెండవ దశలో ఎన్నికలు నిర్వహించనున్న భీమడోలు, కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి, నిడమర్రు, ఉంగుటూరు, ద్వారకాతిరుమల మండలాలకు చెందిన 194 గ్రామ పంచాయతీలలో 1972 వార్డ్ మెంబర్లకు సంబంధించి 2024 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుచేయడం జరిగిందని, వీటికి నామినేషన్లు నవంబర్, 18వ తేదీన విడుదల చేయడం జరుగుతుందని, 20వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. 21వ తేదీన నామినేషన్లు పరిశీలించడం జరుగుతుందన్నారు. తిరస్కరించిన నామినేషన్లపై 22వ తేదీన అప్పీలు చేసుకోవచ్చుని, 23వ తేదీలోగా అప్పీళ్లను పరిష్కరించడం జరుగుతుందన్నారు. 24వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని , అదే రోజు తుది



జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు. నవంబర్,29వ తేదీన ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, అదేరోజు ఫలితాలు వెల్లడించడం జరుగుతుందన్నారు. అవసరమైన పక్షంలో 30వ తేదీన రీపోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మూడవ దశలో ఎన్నికలు నిర్వహించనున్న దెందులూరు, ఏలూరు, పెదపాడు, పెదవేగి, అగిరిపల్లి, చాట్రాయి,, ముసునూరు, నూజివీడు మండలాలకు చెందిన 173 గ్రామ పంచాయతీలలో 1828 వార్డ్ మెంబర్లకు సంబంధించి 1844 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటుచేయడం జరిగిందని, వీటికి నామినేషన్లు నవంబర్, 21వ తేదీన విడుదల చేయడం జరుగుతుందని, 23వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. 24వ తేదీన నామినేషన్లు పరిశీలించడం జరుగుతుందన్నారు. తిరస్కరించిన నామినేషన్లపై 25వ తేదీన అప్పీలు చేసుకోవచ్చుని, 26వ తేదీలోగా అప్పీళ్లను పరిష్కరించడం జరుగుతుందన్నారు. 27వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని , అదే రోజు తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు. డిసెంబర్, 2వ తేదీన ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, అదేరోజు ఫలితాలు వెల్లడించడం జరుగుతుందన్నారు. అవసరమైన పక్షంలో డిసెంబర్, 3వ తేదీన రీపోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బందికి అన్ని అంశాలలో శిక్షణ అందించడం జరుగుతున్నదన్నారు. నామినేషన్, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు వీడియోలు చిత్రీకరించడం జరుగుతుందని, అంతేకాక సిసి కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో భద్రతకు అదనపు భద్రతా సిబ్బందిని నియమించడం జరిగిందని కలెక్టర్ వెట్రిసెల్వి తెలియజేసారు.

## నూజివీడులో 50 నామినేషన్లు. టీడీపీలో చైర్మన్ సీటుపై హైటెన్షన్!

### ఐవీఆర్ సర్వేలో ట్విస్ట్.. రేపే ఫైనల్ ఫైట్!

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

నూజివీడు మున్సిపల్ ఎన్నికల రాజకీయం రోజురోజుకూ ఆసక్తికరంగా మారుతోంది. నామినేషన్ల ప్రక్రియ ఊపందుకోవడంతో ప్రధాన పార్టీల నాయకులు, అభ్యర్థులు భారీ ర్యాలీలతో తమ బలాబలాలను ప్రదర్శిస్తున్నారు. మరోవైపు, తెలుగుదేశం పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి ఎంపికపై ఇంకా స్పష్టత రాకపోవడంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.నేడు మున్సిపల్ కార్యాలయంలో మొత్తం 50 నామినేషన్లను మున్సిపల్, ఎన్నికల అధికారులు స్వీకరించారు. వీటిలో తెలుగుదేశం పార్టీ నుంచి 33, వైసీపీ నుంచి 12, జనసేన నుంచి 4, బీజేపీ నుంచి ఒక నామినేషన్ దాఖలైనట్లు సమాచారం. అయితే కొంతమంది అభ్యర్థులు రెండు సెట్ల చొప్పున నామినేషన్లు సమర్పించడంతో మొత్తం నామినేషన్ల సంఖ్య 50కి చేరినట్లు తెలుస్తోంది.

**టీడీపీలో కొత్త పేర్లు.. ఐవీఆర్ సర్వేతో ఉత్కంఠ!**

నూజివీడు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి ఎంపిక విషయంలో తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. గత రెండు రోజులుగా ఐవీఆర్ కాల్స్ ద్వారా బర్రె ఇళయరాజా, బొడ్డు శ్యాంప్రసాద్ పేర్లతో సర్వే నిర్వహించినట్లు సమాచారం.అయితే తాజాగా ఈ సమీకరణాల్లో మార్పు చోటుచేసుకుంది. బొడ్డు శ్యాంప్రసాద్ పేరును తొలగించి, బర్రె ఇళయరాజాతో పాటు చొక్కా రావు పేరును చేర్చి మరోసారి ఐవీఆర్ కాల్స్ ద్వారా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.అభ్యర్థుల పేర్లలో చోటుచేసుకుంటున్న ఈ మార్పులు టీడీపీ శ్రేణుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. సామాజిక సమీకరణాలు, గెలుపు అవకాశాలు, స్థానిక రాజకీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పార్టీ అధిష్ఠానం అభ్యర్థిని ఖరారు చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటివరకు టీడీపీ చైర్మన్ అభ్యర్థిపై అధికారిక ప్రకటన వెలువడలేదు. అసలు బర్రె ఇళయరాజాకు అవకాశం దక్కుతుందా? చొక్కా రావును బరిలోకి దింపుతారా? లేక అధిష్ఠానం అనూహ్య నిర్ణయం తీసుకుంటుందా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.వైసీపీ చైర్మన్ అభ్యర్థిగా కంచర్ల లవకుమార్మరోవైపు వైసీపీ తరఫున మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా కంచర్ల లవకుమార్ పేరు ఖరారైనట్లు సమాచారం. ఆయన ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందినవారు కాగా, ఆయన భార్య కాపు సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో నూజివీడు పట్టణంలో కాపు సామాజిక వర్గ ఓట్లపై ప్రభావం ఉండవచ్చనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.ఈ



నేపథ్యంలో టీడీపీ చైర్మన్ అభ్యర్థి ఎంపికలో సామాజిక సమీకరణాలు కీలకంగా మారినట్లు తెలుస్తోంది. వైసీపీ అభ్యర్థికి పోటీగా ఎవరిని నిలబెట్టాలి? ఏ అభ్యర్థితో గెలుపు అవకాశాలు మెరుగ్గా ఉంటాయి? అనే అంశాలపై టీడీపీ నాయకత్వం కసరత్తు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.నేడు 50 నామినేషన్లు.. చైర్మన్ అభ్యర్థుల నామినేషన్లు ఎక్కడ? నేడు మొత్తం 50 నామినేషన్లుదాఖలైనప్పటికీ, చైర్మన్ అభ్యర్థికి సంబంధించి ఒక్క నామినేషన్ కూడా నమోదు కాలేదని సమాచారం. దీంతో ప్రధాన పార్టీల చైర్మన్ అభ్యర్థులు ఎప్పుడు నామినేషన్లు దాఖలు చేస్తారన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది.మరోవైపు, పార్టీల వారీగా నామినేషన్ల సంఖ్యలో టీడీపీ ముందంజలో కనిపిస్తోంది. అయితే నామినేషన్ల సంఖ్య ఒక్కటే ఎన్నికల ఫలితాలను నిర్ణయించదు. చైర్మన్ అభ్యర్థుల ఎంపిక, స్థానిక నాయకుల సమన్వయం, ఓటర్ల మద్దతు వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి.రేపే చివరి రోజు..



టీడీపీ నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి!నామినేషన్ల దాఖలుకు రేపే చివరి రోజు కావడంతో నూజివీడు మున్సిపల్ ఎన్నికల రాజకీయం మరింత వేడెక్కనుంది. ముఖ్యంగా టీడీపీ అధిష్ఠానం చైర్మన్ అభ్యర్థిని ఎప్పుడు ప్రకటిస్తుంది? ఐవీఆర్ సర్వేలో ఉన్న పేర్లలో ఎవరికి అవకాశం దక్కుతుంది? వైసీపీ అభ్యర్థికి పోటీగా టీడీపీ ఎలాంటి వ్యూహాన్ని అనుసరిస్తుంది? అన్న అంశాలపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ కొనసాగుతోంది.మొత్తానికి, నూజివీడులో నేడు 50 నామినేషన్లు దాఖలు కాగా, ప్రధాన పార్టీల చైర్మన్ అభ్యర్థుల నామినేషన్లపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. రేపే చివరి రోజు కావడంతో టీడీపీ చైర్మన్ అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ తారస్థాయికి చేరింది. చివరి నిమిషంలో టీడీపీ అధిష్ఠానం ఎవరికి అవకాశం కల్పిస్తుంది? నూజివీడు మున్సిపల్ రాజకీయాల్లో తదుపరి పరిణామాలు ఎలా ఉండబోతున్నాయి? వేచి చూడాలి!

## జిల్లాలో 21 నుంచి 23 వరకే నామినేషన్ స్వీకరణ.

ప్రజా భూమి బ్యూరో–ఏలూరు జిల్లా



ఏలూరు జిల్లాలో ఎంపిటిసి, జెడ్పిటిసి స్థానాలకు ఈనెల 21వ తేదీ నుండి 23వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె. వెట్రిసెల్వి చెప్పారు. 24వ తేదీన నామినేషన్లు పరిశీలించడం జరుగుతుందన్నారు. తిరస్కరించిన నామినేషన్లపై 25వ తేదీన అప్పీలు చేసుకోవచ్చుని, 26వ తేదీలోగా అప్పీళ్లను పరిష్కరించడం జరుగుతుందన్నారు. 27వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని , అదే రోజు సాయంత్రం తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు. నవంబర్,3వ తేదీన వ తేదీన ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, 5వ తేదీన ఓట్ల లెక్కింపు కార్యక్రమం, అదేరోజు ఫలితాలను ప్రకటించడం జరుగుతుందని కలెక్టర్ వెట్రిసెల్వి తెలియజేసారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో భద్రతకు అదనపు భద్రతా సిబ్బందిని నియమించడం జరిగిందని కలెక్టర్ తెలియజేసారు. ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బందికి అన్ని అంశాలలో శిక్షణ అందించడం జరిగిందన్నారు.

## సేవా సంకల్ప అభియాన్ స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాలు.



ప్రజాభూమి ప్రతినిధి–బుట్టాయగూడెం

సేవా సంకల్ప అభియాన్ స్ఫూర్తితో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ పోలవరం నియోజకవర్గం కన్వీనర్, ఎఎంసి వైస్ చైర్మన్ కొండపాటి రామకృష్ణ తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర దామోదర్ దాస్ మోడీ పుట్టినరోజు వేడుకలలో భాగంగా రాష్ట్ర బిజెపి నాయకత్వం ఆదేశాలు మేరకు సేవా సంకల్ప అభియాన్ అనే కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తిచేసుకున్న సందర్భంలో శనివారం స్థానిక సామాజిక ఆసుపత్రిలో రక్తదాన శిబిరం, చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండేపాటి రామకృష్ణ మాట్లాడుతూ ప్రధాని పుట్టినరోజు సందర్భంగా చేపట్టిన సేవా సంకల్పయాన్ కార్యక్రమంలో చేపట్టిన పలు సామాజిక సేవా కార్యక్రమాలు ఎంతో సంతృప్తినిచ్చాయని అన్నారు. ఈ స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టే విధంగా భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు , సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి ఎస్టి మోర్చా సెక్రెటరీ వంకా కాంచన మాల , నందిన సతీష్ , జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి గూట్ల ధర్మరాజు, మెన్నీ కృష్ణ, కుంజా రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్‌లో సమస్యలపై తక్షణ పరిష్కారానికి ఎమ్మెల్యే ఆదేశాలు



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని,ప్రభుత్వ యంత్రాంగం ద్వారా తక్షణ పరిష్కారం చూపడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన నిత్య ప్రజా దర్బార్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ఉంగుటూరు ఎమ్మెల్యే పచ్చమట్ల ధర్మరాజు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన వృద్ధులు, మహిళలు, రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.రెవెన్యూ, పంచాయతీ రాజ్, వ్యవసాయ,వైద్య ఆరోగ్య శాఖలకు సంబంధించిన సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన చింతమనేని, నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పేదలకు వైద్య సహాయం,పింఛన్లు, గ్రామీణ మౌలిక వసతులు, భూ సమస్యలపై సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు.

## లక్ష్మీదేవి అలంకారంలో కనకదుర్గమ్మ దివ్యదర్శనం

### వైభవంగా సామూహిక పాల పొంగళ్ల సమర్పణ.. భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

ఆగిరిపల్లి గ్రామంలోని యాదవుల మండపంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తి వైభవంతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శనివారం స్వయంభు శ్రీ కనకదుర్గమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి నిత్య పూజలు, విశేష అర్చనలు, కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం గ్రామ మహిళలు సామూహికంగా పాల పొంగళ్లను తయారుచేసి భక్తిపూర్వకంగా సమర్పించారు. గ్రామోత్సవం తో స్వయంభు శ్రీ కనకదుర్గమ్మ వారితో పాటు బాలరావమ్మ తల్లి, గంగానమ్మ తల్లికి ప్రత్యేక నివేదనలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవార్ల అనుగ్రహంతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు. వేదమంత్రాల నడుమ పూజా కార్యక్రమాలు, మంగళహారతులు ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపగా, సామూహిక పాల పొంగళ్ల కార్యక్రమంలో మహిళలు, గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్ల కృపాకటాక్షాలను పొందారు.

ప్రజాభూమి
అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6
ఆదివారం 18 అక్టోబరు 2026

# హిందూపురం అభివృద్ధే లక్ష్యం -ప్రజాసేవే ధ్యేయం

## -టిడిపి చైర్మన్ అభ్యర్థి పురిడి మంజునాథ్ నామినేషన్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణ సమగ్రాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలుగు దేశం పురపాలక సంఘం చైర్మన్ అభ్యర్థి పురిడి మంజునాథ్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం దక్కిందని, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు తనకు అవకాశం కల్పిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతోపాటు, అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. హిందూపురం పురపాలక సంఘం ఎన్నికల్లో భాగంగా చైర్మన్ అభ్యర్థిగా పురిడి మంజునాథ్ శనివారం ఎంజీఎం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక నామినేషన్ కేంద్రంలో తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఆయన వెంట తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బండారు బాలాజీతోపాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. నామినేషన్ ప్రక్రియ అనంతరం మంజునాథ్ మాట్లాడుతూ, తనకు ఈ అవకాశం కల్పించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే నందమూరి



బాలకృష్ణ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనపై నమ్మకంతో చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించారని తెలిపారు. వారి నమ్మకాని కి భంగం కలగకుండా ప్రజలకు అందుబాటులో ఉంటూ పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానన్నారు. రాజకీయ పదవిని ప్రజాసేవకు ఒక అవకాశంగా భావిస్తున్నానని, ప్రజల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని పేర్కొన్నారు. పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల అభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణతోపాటు ప్రజలకు అవసరమైన ఇతర సదుపాయాల మెరుగుదలకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల దైనందిన జీవితానికి ఇబ్బందులు కలిగించే సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. పట్టణ అభివృద్ధికి పురపాలక సంఘం నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు తీసుకురావడం ఎంతో ముఖ్యమని మంజునాథ్ అభిప్రాయపడ్డారు. పట్టణ ప్రజలు తనకు అవకాశం కల్పిస్తే స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, సంబంధిత మంత్రులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి హిందూపురం సమస్యలను తీసుకెళ్తానన్నారు. పట్టణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నిధులు మంజూరు చేయించాలని కృషి చేసి, అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు ప్రయత్నిస్తానని స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో హిందూపురాన్ని మరింత అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దాలన్నదే తన లక్ష్యమని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, పట్టణ ప్రగతిలో భాగస్వామిని అవుతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శిగా భూపాలం సతీష్ బాబు నియామకం...

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



భారత ప్రభుత్వంచె గుర్తించబడిన కన్స్యూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లాకు చెందిన భూపాళం సతీష్ బాబు ఎంపిక కాబడ్డారు. అనంతపురం జిల్లాకు చెందిన భూపాళం సతీష్ బాబు గత మూడు శతాబ్దాలుగా వినియోగదారులకు సేవతో పాటు సమాజంలో పత్రిక రంగంలో చేస్తున్న అవిరళ కృషిని గుర్తించి ఆయన సేవలు మరింతగా ముందుకెళ్లాలని భావనతో కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అనంత శర్మ భూపాళం సతీష్ బాబును జాతీయ కార్యదర్శిగా నియమించినట్లు పేర్కొన్నారు. భూపాలం సతీష్ బాబు గతంలో ఆంధ్రప్రదేశ్ సీసీఐలో కార్యదర్శిగా, జాతీయస్థాయిలో క్రమ శిక్షణ గ్రూపులో మెంబర్ గాను, సంయుక్త కార్యదర్శి గా ఉండడం జరిగింది. అలాగే ఇటీవల జైపూర్ రాష్ట్రంలో జరిగిన జాతీయ జనరల్ బాడీ సమావేశంలో జరిగిన ఎన్నికల్లో భూపాలం సతీష్ బాబు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఆ నియామక పత్రాన్ని చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ శివ దయాల్ సైని ద్వారా డాక్టర్ అనంత శర్మ భూపాలం సతీష్ బాబుకు పంపారు. సందర్భంగా భూపాలం సతీష్ బాబు మాట్లాడుతూ తన సేవలను మరింత బాధ్యతనితమైన పదవిలో ఎంపిక కావడానికి సహకరించిన డాక్టర్ అనంతశర్మకు, ప్రస్తుత ప్రెసిడెంట్ సెల్వ రాజు, ప్రీతి పాండ్యా, కన్స్యూమర్ కాన్ ఫెడరేషన్ రేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సంగం నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా వినియోగదారుల సేవలా మరింత ముందు కెళతానని తెలిపారు.

# ఈనెల 19వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం ఉండదు.. : జిల్లా ప్రజలు గమనించాలి- : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



ఈనెల 19వ తేదీన సోమవారం స్థానిక సంస్థల ఎన్నికలు మరియు మహర్నవమి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్నందున అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం జరగదని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలన్నారు. అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్ కు ఎవరూ రాకూడదని తెలిపారు. క్షేత్రస్థాయిలో కూడా పీజీఆర్ఎస్ నిర్వహించడం జరగదని తెలిపారు.

# నూతన రహదారిని ప్రారంభించిన న్యాయమూర్తులు




ప్రజాభూమి, హిందూపురం టౌన్

ప్రధాన రహదారి నుండి న్యాయస్థాన సముదాయం వరకు ఇటీవల నూతనంగా నిర్మించిన సిమెంటు రహదారిని అదనపు జిల్లా జడ్జి వి.వెంకటేశ్వరరావు, న్యాయమూర్తులు హేమలత, నిఖిల్ రెడ్డి, లలితా లక్ష్మీ హారిక కోట, రమణయ్య, రమాదేవిలు శనివారం ప్రారంభించారు. న్యాయస్థానాలతోపాటు రెవెన్యూ కార్యాలయం, ఉప ఖజానా కార్యాలయం, ఉపకారాగారం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆ రహదారి గుండా ఉండగా తీవ్ర గుంతల మయం కావడంతో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున కు విన్నవించడం జరిగింది. ఈ నేపథ్యంలో ఇందుకు స్పందించిన కమిషనర్ త్వరితగతిన రూ.50 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో నూతన సిమెంట్ రహదారి తో పాటు లైటింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆమోదం తెలిపారు. దీంతో ఆ రహదారి నిర్మాణం పూర్తి కావడంతో న్యాయమూర్తులు వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. సకాలంలో రహదారిని నిర్మించి ఆయా కార్యాలయాలకు రాకపోకలు సాగించేందుకు సహకరించడం పట్ల బార్ అసోసియేషన్ ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా రహదారి అందుబాటులోకి రావడం పట్ల న్యాయమూర్తులు అభినందిస్తూ రహదారిపై వాహనాలు నిలబెట్టకుండా రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని అసోసియేషన్ ప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్, కృష్ణమూర్తి, తహసిల్దారు వెంకటేశులు, ఉపఖజానాధికారి జగదీష్ , ఏజీపీ రామచంద్రప్పతో పాటు న్యాయవాదులు, న్యాయస్థానాల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంపొందించాలి

## -పారా లీగల్ వాలంటీర్లకు గుర్తింపు కార్డులు పంపిణీ చేసిన ఎడిజే

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించేందుకు పారా లీగల్ వాలంటీర్లు కృషి చేయాలని ఆదనపు జిల్లా జడ్జి వి.వెంకటేశ్వరరావు సూచించారు. ఇటీవల నియమితులైన 25 మంది పారా లీగల్ వాలంటీర్లకు శనివారం గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు తరచూ సమావేశాలను నిర్వహించి ఎప్పటికప్పుడు మారుతున్న చట్టాల గురించి తెలియజేయాలన్నారు. న్యాయస్థానాల ద్వారా పేదలకు అందుతున్న న్యాయ సహాయం వివరాలను కూడా తెలియజేయాలని సూచించారు. అంకితభావంతో ప్రజల్లో చట్టాలపై విశ్వాసం పెంచడం తోపాటు అవగాహన కల్పించాల్సిన బాధ్యత పారా లీగల్ వాలంటీర్లపై ఉంటుందన్నారు. సామాజిక రుగ్మతలు, అన్యాయం జరిగిన సమయంలో న్యాయం పొందేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ఉచిత న్యాయ సహాయం తదితర అంశాలపై అవగాహన కల్పించాలని న్యాయమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సిబ్బంది రాజా, నాయక్, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికలపై కూటమి కసరత్తు

## -గ్రామస్థాయి నుంచి సమన్వయంతో ముందుకు వెళ్లే దిశగా అడుగులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం రూరల్ మండలంలో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమి నాయకులు స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా శనివారం హిందూపురంలోని సాయి తేజ ఫంక్షన్ హాల్‌లో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థలకు సంబంధించిన అంశాలు, మండల పరిధిలోని రాజకీయ పరిస్థితులు, గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాలు, కూటమి పార్టీల మధ్య సమన్వయం తదితర విషయాలపై ఈ సమావేశంలో చర్చించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన విధానాలపై నాయకులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. స్థానిక సంస్థలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయి. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాల అమలులో స్థానిక సంస్థల బాధ్యత ఎంతో ఉంటుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థలకు సంబంధించిన అంశాలపై కూటమి



నాయకులు చర్చించడం ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించడం, వాటి పరిష్కారానికి కృషి చేయడం, స్థానికంగా పార్టీ శ్రేణుల భాగస్వామ్యాన్ని పెంచడం వంటి అంశాలు సమావేశం ద్వారా చర్చకు వచ్చినట్లు సమాచారం. మండల స్థాయిలో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేయాల్సిన అవసరంపై సమావేశంలో దృష్టి సారించారు. గ్రామాల్లో పార్టీ కార్యకలాపాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రజలకు సంబంధించిన సమస్యలపై స్పందించడం, స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు నాయకుల దృష్టికి తీసుకురావడం వంటి అంశాలు ఎన్నికల సమయంలో కీలకంగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి పార్టీల నాయకులు ఒకే వేదికపై సమావేశమై స్థానిక సంస్థలకు సంబంధించిన అంశాలపై చర్చించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తల పాత్ర కీలకం కానుంది. ఆయా గ్రామాల్లో ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలు, అభివృద్ధికి సంబంధించిన అంశాలను గుర్తించి వాటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కూటమి పార్టీల మధ్య పరస్పర సహకారం, నాయకుల మధ్య సమన్వయం, కార్యకర్తల భాగస్వామ్యం వంటి అంశాలు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన రాజకీయ కార్యాచరణలో ప్రాధాన్యత కలిగి ఉంటాయి. ఈ నేపథ్యంలో హిందూపురం రూరల్ మండలంలో నిర్వహించిన సమావేశం ద్వారా నాయకులు తమ అభిప్రాయాలను పంచుకోవడంతోపాటు స్థానిక సంస్థల అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో హిందూపురం మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ హెచ్.ఎన్. రాము, మార్కెట్ యార్డు చైర్మన్ అశ్వర్ధనారాయణ రెడ్డి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, అరుణాచల రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఆదినారాయణ, తెలుగు యువత నాయకులు మంజు, బీజేపీ నాయకుడు తిరుమలేష్, సింగిల్ విండో శంకర, హనుమంతరాయుడు, చిన్నరెడ్డి, శ్రీరాములు, రామకృష్ణ రెడ్డితోపాటు కూటమి పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిషేధిత కలుపు మందుల విక్రయాలపై వ్యవసాయ శాఖ నిఘా

## నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు

ప్రజా భూమి నార్పల

మండలంలో నిషేధిత కలుపు మందుల నిల్వలు, విక్రయాలను అరికట్టేందుకు వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మండలంలోని పురుగుమందుల డీలర్లతో మండల వ్యవసాయ అధికారి చిన్నవీరస్వామి సమావేశం నిర్వహించి, ప్రభుత్వ నిబంధనలు, ఆదేశాలపై అవగాహన కల్పించారు. 2026 సెప్టెంబర్ 23న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లోని నిబంధనలు, ఆదేశాలను డీలర్లకు వివరించారు. నిషేధిత కలుపు మందులను నిల్వ ఉంచడం, విక్రయించడం చేయరాదని, ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గతంలో మే 22, 2026న నిషేధిత కలుపు మందులకు సంబంధించి 121 లీటర్ల వివరాలను సంబంధిత అధికారులకు సమర్పించినట్లు తెలిపారు. ప్రస్తుతం నిర్వహించిన తనిఖీల్లో నిషేధిత కలుపు మందుల నిల్వలు గుర్తించలేదని పేర్కొన్నారు. నార్పల మండల పరిధిలోని పురుగుమందుల దుకాణాల్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని చిన్నవీరస్వామి తెలిపారు. భవిష్యత్తులో నిషేధిత కలుపు మందులను నిల్వ ఉంచినా, విక్రయించినా సంబంధిత నిల్వలను స్వాధీనం చేసుకోవడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైన సందర్భాల్లో సంబంధిత లైసెన్సులపై కూడా నిబంధనల మేరకు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. రైతులు నిషేధిత కలుపు మందుల వినియోగానికి దూరంగా ఉండాలని ఆయన సూచించారు. నిషేధిత మందుల అక్రమ నిల్వలు, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే నార్పల వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు.

# ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి

## అదనపు జిల్లా జడ్జి వి. వెంకటేశ్వరరావు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

పేదరికంలో ఉన్న వారి కోసం అమలు చేస్తున్న ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు జిల్లా జడ్జి వి.వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలతో ఎప్పటి నుండి కారాగారంలో ఉంటున్నారు, న్యాయవాదులు ఉన్నారా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. దీనికి తోడు ఉపకారాగారంలో ఉన్న సౌకర్యాలు, అవసరమైన సదుపాయాల గురించి తెలుసుకున్నారు. ఉపకారాగారంలో వైద్య సేవలు, భోజన సదుపాయం తదితర అంశాలపై కూడా ఆరా తీశారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ, న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని ఆర్థిక ఇబ్బందులు ఉన్న రిమాండ్ ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి త్వరితగతిన న్యాయవాదులను ఏర్పాటు చేస్తామన్నారు. అర్హత ఉన్నవారు ఎంతమంది దరఖాస్తు చేసుకున్న అందరికీ ఉచిత న్యాయ సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. క్షణికావేశంలో తప్పులు చేసి కారాగారాలకు రావడం వల్ల ఆర్థిక ఇబ్బందులతో పాటు కుటుంబ గౌరవ మర్యాదలు కూడా దెబ్బతింటాయని తెలిపారు. కారాగారాల నుండి బయటకు వెళ్లిన తర్వాత ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులతో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా జీవనం సాగించాలని సూచించారు. అనంతరం ఉపకరాగార రికార్డులను న్యాయమూర్తి పరిశీలించారు. ఈ కారగా కార్యక్రమంలో ఉపకారగార అధికారి హనుమన్న, లోక్ అదాలత్ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.




# చీకట్లో శింగనమల క్రాస్..

## వీధిలైట్లు వెలగక అంధకారంలో ప్రధాన కూడలి

## అనంతపురం నుంచి శింగనమల కు వచ్చే మహిళలు, ప్రయాణికుల ఇబ్బందులు

## మరొకమ్మ క్రాస్ నుంచి శింగనమల రహదారిపై వెలుగులు ఎప్పుడు సారూ?

ప్రజా భూమి శింగనమల



శింగనమల మండలం నుంచి అనంతపురం వెళ్లే క్రాస్ లో సాయంత్రం చీకటి పడితే చాలు..శింగనమల క్రాస్ వద్ద ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం నుంచి సింగనమలకు వచ్చే ప్రయాణికులు క్రాస్ వద్ద దిగాలంటేనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా మహిళలు చీకట్లో ఒంటరిగా వెళ్లేందుకు భయపడుతున్నారని చెబుతున్నారు.క్రాస్ పరిసరాల్లో వీధిలైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో అంధకారం నెలకొంటోందని, దీంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొంటున్నారు. మరొకమ్మ క్రాస్ నుంచి సింగనమలకు వెళ్లే రహదారిపై కూడా వీధిలైట్ల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ సంబంధిత అధికారులు స్పందించాలని, క్రాస్ వద్ద, రహదారి వెంట పనిచేయని వీధిలైట్లను వెంటనే మరమ్మతు చేసి రాత్రివేళల్లో వెలుగులు ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులారా.. ప్రజల ఇబ్బందులు మీ దృష్టికి రావాలంటే ఏదైనా అవాంఛనీయ ఘటన జరగాలా? ముందుగానే స్పందించి శింగనమల క్రాస్, మరొకమ్మ క్రాస్ రహదారిపై వెలుగులు నింపండి సారూ!

# ప్రజాభూమి

వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమయ్య 7

ఆదివారం 18 అక్టోబరు 2026


# కూటమి ప్రభుత్వ అభివృద్ధి పనులే మమ్మల్ని గెలిపిస్తాయి

## - టీడీపీ చైర్మన్ అభ్యర్థి తూగుట్ల గీతాకుమారి

### సైకిల్ గుర్తుకు రెండు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించండి -పులివెందుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



ప్రజాభూమి,పులివెందుల

స్థానిక పురపాలక ఎన్నికల నేపథ్యంలో శనివారం పులివెందులలో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. టీడీపీ చైర్మన్ అభ్యర్థిగా తూగుట్ల గీతాకుమారి, కౌన్సిలర్ అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయంలో తమ నామినేషన్లను దాఖలు చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ లతారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయం నుండి భారీ ర్యాలీ నిర్వహించారు. చైర్మన్ అభ్యర్థి గీతాకుమారి, కౌన్సిలర్ అభ్యర్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ ప్రక్రియను విజయ వంతంగా ముగించారు. అనంతరం టీడీపీ చైర్మన్ అభ్యర్థి గీతాకుమారి విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం సస్యశ్యామలంగా అభివృద్ధి చెందుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చుకుంటూ ముందుకు వెళుతోందన్నారు. ముఖ్యంగా మహిళల కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు ఎంతో మేలు జరుగుతోందని తెలిపారు. జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం ఎర్రబెల్లి చెరువుకు సాగునీరు ఇవ్వడం జరిగిందని, దీంతో ఆ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. పులివెం దుల పట్టణం అభివృద్ధి చెందాలంటే అది కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పులివెందుల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనే పట్టణానికి మంచి రోజులు వచ్చాయన్నారు. కాబట్టి పులివెందుల పురపాలక ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థిగా తనకు సైకిల్ గుర్తుపై, అలాగే వార్డుల్లో పోటీ చేస్తున్న టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై రెండు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె ప్రజలను కోరారు. తమను గెలిపిస్తే పులివెందులలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పులివెందులలో రెండో రోజు నామినేషన్ల సందడి

ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండో రోజు ఉత్సాహంగా సాగింది. రెండవ రోజు నామినేషన్లలో భాగంగా టీడీపీ పార్టీకి చెందిన 37 మంది, వైఎస్ఆర్సీపీ పార్టీకి చెందిన ఇద్దరు, బీజేపీకి చెందిన ముగ్గురు, జనసేన పార్టీకి చెందిన ఒకరు నామినేషన్ దాఖలు చేశారు. మొత్తం 43 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు అధికారులు తెలిపారు.

## క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు ప్రధానం

### - అవోపా అధ్యక్షుడు బైరిశెట్టి సునీల్ కుమార్



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో కొనసాగుతున్న దసరా ఉత్సవాల్లో భాగంగా ఆర్యవైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) మహిళా విభాగం ఆధ్వర్యంలో భారతదేశపు సంస్కృతి సాంప్రదాయాలు అనే అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించినట్లు అవోపా అధ్యక్షుడు బైరిశెట్టి వెంకటసునీల్ కుమార్, అవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు బైరిశెట్టి నాగలక్ష్మి లు వెల్లడించారు. ఈ క్విజ్ పోటీల్లో గెలుపొందిన 10మంది విజేతలకు దాతల సహకారంతో బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతల సహకారం మరువలేనిదన్నారు. అవోపా సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, దాతలు, అవోపా, మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పులివెందులలో రాజారెడ్డి రాజ్యాంగం కుదరదు - బీటెక్ రవి

### నామినేషన్లు మీరు వేస్తే ప్రజాస్వామ్యం... మేము వేస్తే అల్లర్లా? - అవినాష్ రెడ్డిపై బీటెక్ రవి ఆగ్రహం




ప్రజాభూమి, పులివెందుల

పులివెందులలో రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేస్తామంటే ఎట్టి పరిస్థితుల్లోనూ కుదరదని పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో అందరికీ నామినేషన్లు వేసుకునే హక్కు ఉందన్నారు. పులివెందుల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థులు ప్రజాస్వామ్య పద్ధతిలో నామినేషన్లు వేస్తుంటే వైసీపీ ఎంపీ అవినాష్ రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారని ఆగ్రహంవ్యక్తం చేశారు. నిన్నటి రోజు వైఎస్ కుటుంబం నుంచి వైఎస్ ప్రమీలమ్మతో సహా వారి కౌన్సిలర్ అభ్యర్థులు ప్రశాంతంగా నామినేషన్లు వేశారని, ఈరోజు కూటమి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తుంటే చూసి ఓర్వలేక కావాలనే అల్లర్లు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించి 144 సెక్షన్ అమల్లో ఉన్నప్పటికీ ఎంపీ అవినాష్ రెడ్డి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రౌడీలు, గంజాయి బ్యాచ్, తాగుబోతులను గుంపుగా చేసుకుని రోడ్ల మీదకు వచ్చి ఏకంగా పోలీసుల మీదనే దాడులకు తెగబడుతున్నారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పోలీసుల మీద దాడులు చేశారు కాబట్టే ఆత్మరక్షణ కోసం పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చిందని తెలిపారు. మేము ఏదైనా చెప్పే చేస్తాం, మీలాగా పిరికిపంద ల్లా దొంగచాటుగాదాడులు చేయమని సవాల్ విసిరారు. మా నాయకుల వాహనాల మీద దాడులకు పాల్పడిన వైసీపీ నాయకులపై, పులివెందుల మున్సిపాలిటీ పరిధికి సంబంధం లేకుండా బయట నుంచి వచ్చి అల్లర్లు సృష్టిస్తున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాల ని డిమాండ్ చేశారు. శాంతిభద్రతలను కాపాడాలని పోలీసు యంత్రాంగానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు బీటెక్ రవి పేర్కొన్నారు.

## పులివెందులలో పోలీసుల దాష్టీకం

### - వైసీపీ శ్రేణులపై రబ్బరు బుల్లెట్లు, టియర్ గ్యాస్ ప్రయోగం

### నామినేషన్ వేసేందుకు వచ్చిన వైసీపీ నేతలపై పోలీసుల దాడి - పలువురికి గాయాలు

### పులివెందులలో ప్రజాస్వామ్య ఖూనీ

### - కూటమి కనుసన్నల్లో పోలీసుల అత్యుత్సాహం



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల వేళ పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ప్రజాస్వామ్య బద్ధంగా నామినేషన్ వేసేందుకు వచ్చిన వైఎస్ఆర్సీపీ కౌన్సిలర్ అభ్యర్థులను, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. శాంతియుతంగా నామినేషన్ వేసేందుకు వస్తున్న వైఎస్ఆర్సీపీ నేతల వాహనాలను పోలీసులు ధ్వంసం చేశారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఎలాంటి రెచ్చగొట్టే చర్యలు లేకున్నా పోలీసులు విచక్షణా రహితంగా వ్యవహరిం చారని, కార్యకర్తలపై టియర్ గ్యాస్ ప్రయోగించి, గాల్లోకి కాల్పులు జరిపి భయభ్రాంతులకు గురిచేశారని మండిపడ్డారు. ఈ దాడిలో చాలామందికి గాయాలయ్యాయి. పోలీసులు ప్రయోగించిన రబ్బరు బుల్లెట్లు తగలడంతో పలువురికి రక్తస్రావ గాయాలయ్యాయి. టియర్ గ్యాస్ ప్రభావంతో చాలామంది శ్వాస ఆడక, కళ్ళు మంటలతో, అలర్జీతో తీవ్ర ఇబ్బందులు పడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా రు. కూటమి ప్రభుత్వ కనుసన్నల్లోనే పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, వైఎస్ఆర్సీపీ శ్రేణులను నామినేషన్లు వేయకుండా అడ్డుకు నేందుకే ఈ కుట్ర చేశారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పోలీసుల చేతిలో వైఎస్ఆర్సీపీ నాయకులు చాలా ఇబ్బందులు పడ్డారని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాష్టీకం ఎన్నడూ చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడిన కార్యకర్తలను ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. అధికార పార్టీ నేతల ఒత్తిడితోనే పోలీసులు దురుసుగా ప్రవర్తించారని, దీనిపై ఎన్నికల కమిషన్ కు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీ అవినాష్ రెడ్డి తెలిపారు.





## కొత్త పైపులైనుతో తాగునీటి సమస్యకు పరిష్కారం

### - టిడిపి యువ నాయకుడు శివకృష్ణారెడ్డి చొరవ

### - హర్షం వ్యక్తం చేసిన కాలనీవాసులు



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక చింతలమడుగుపల్లి గుట్ట వద్ద ఉన్న కాలనీతో పాటు సమీపంలోని జగనన్న కాలనీల్లో గత కొన్ని రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను టిడిపి జిల్లా మాజీ కార్యదర్శి సింగారెడ్డి జయరామిరెడ్డి, ఆయన కుమారుడు టిడిపి యువ నాయకుడు సింగారెడ్డి శివకృష్ణారెడ్డి (బుజ్జి) దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన వారు ఈ విషయాన్ని టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్ రెడ్డి, పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) దృష్టికి తీసుకెళ్లారు. బీటెక్ రవి స్పందించి మెగా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి తాగునీటి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ క్రమంలో శివకృష్ణారెడ్డి గత రెండు, మూడు రోజులుగా మెగా కంపెనీ ప్రతినిధులతో కలిసి నీటి సరఫరా నిలిచిపోయిన కాలనీలను పరిశీలించారు. సమీపంలోని మెగా కంపెనీ నిర్మించిన వాటర్ ట్యాంకు నుంచి నీటిని సరఫరా చేస్తే సమస్య పరిష్కారమవుతుందని గుర్తించి, కొత్త పైపులైను ఏర్పాటు చేయించారు. దీంతో శనివారం కాలనీలకు తాగునీటి సరఫరా పునరుద్ధరించారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన బీటెక్ రవి, రఘునాథ్ రెడ్డి, సింగారెడ్డి జయరామిరెడ్డి, శివకృష్ణారెడ్డికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.



## ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డికి నోటీసులు అందించిన అర్బన్ సీఐ



ప్రజాభూమి,పులివెందుల

పులివెందులలో 144 సెక్షన్ అమలు లో ఉన్న కారణంగా ఎటువంటి ర్యాలీలకు,ధర్నాలకు అనుమతి లేదని అర్బన్ సిఐ పురుషోత్తం రాజు శనివారం ఎంపీ అవినాష్ రెడ్డిని కలిసి నోటీసుఅందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలకుండా 144 సెక్షన్ అమల్లో ఉంది అని తెలిపారు. వైకాపా పార్టీ నాయకులు సహకరించే విధంగా చూడాలని ఆయనకు తెలిపారు. ధర్నాలు, ర్యాలీలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయనకు తెలిపారు.

## అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు



ప్రజాభూమి, సిద్ధవటం: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, నాటుసారా, మాదకద్రవ్యాల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిద్ధవటం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ హెచ్చరించారు. శనివారం సిద్ధవటం ఎక్సైజ్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. కడప ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు ఆదేశాల మేరకు అట్లూరు, సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాల పరిధిలో అక్రమ మద్యం విక్రయాలు, నాటుసారా తయారీ, రవాణా, మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు మద్యం పంపిణీ చేసినా, అక్రమంగా నిల్వ ఉంచినా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు ప్రజలు, రాజకీయ నాయకులు, మద్యం వ్యాపారులు ఎక్సైజ్ శాఖకు సహకరించాలని కోరారు. అక్రమ మద్యం విక్రయాలు లేదా నాటుసారా తయారీకి సంబంధించిన సమాచారం తెలిస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరు నెలలు గడిచినా బోరు మరమ్మతులకు నోచుకోని బోరు

### - త్రాగునీటి కోసం వెంకటేశ్వరాపురం వాసుల అవస్థలు



ప్రజాభూమి, సిద్ధవటం: త్రాగునీటి బోరు మరమ్మతుల కోసం పైపులు తొలగించి ఆరు నెలలు గడుస్తున్నా పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిద్ధవటం మండలం మాధవరం-1 పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరాపురం గ్రామం 9వ నంబర్ రోడ్డులో ఈ పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా శనివారం స్థానికులు మాట్లాడుతూ.. బోరు మరమ్మతుల కోసం ఆరు నెలల క్రితం పైపులు తొలగించి వదిలేశారని, ఇంతవరకు పనులు పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. త్రాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, పలుమార్లు వారి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరు మరమ్మతులు పూర్తి చేసి త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఈ సమస్యను కడప జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ విషయంపై మండల డిప్యూటీ ఎంపీడీవో మెహతాబ్ యాస్మిన్‌ను వివరణ కోరగా, వెంకటేశ్వరాపురం గ్రామంలో త్రాగునీటి మోటారు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## శ్రీ వృషభాషలేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పుష్పాలంకరణ- భక్తులకు అన్నప్రసాద వితరణ



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని పాపాఘ్ని నదీ తీరాన ఎద్దుల కొండపై వెలసిన శ్రీ వృషభాషలేశ్వర (శ్రీ వెంకటేశ్వర) స్వామివారి దేవస్థానంలో శనివారం స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ఆలయ ముఖ్య అర్చకులు హరిప్రవీణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కడప జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గజ్జల మధుసూదన్ రెడ్డి, ఆయన భార్య సౌభాగ్యమ్మ, కుమార్తెలు దామిని, ధరణి భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని, భక్తులకు అన్నప్రసాదం అందించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ముఖ్య అర్చకులు దాతల కుటుంబ సభ్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించి సత్కరించారు. దేవస్థానంలో ప్రతి శనివారం దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె. సుభాష్ తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలనుకునే దాతలు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. అన్నప్రసాద వితరణ చేసే దాతలకు వారి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ సంప్రదాయం ప్రకారం సత్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

ప్రజాభూమి, సిద్దవటం: స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి, రిటర్నింగ్ అధికారి ఎన్.ఎన్. కృష్ణయ్య అధికారులను ఆదేశించారు. శనివారం సిద్దవటం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్నికల కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించారు. మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి సంబంధించి ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించారు. మండలాన్ని మూడు జోన్లు, నాలుగు రూట్లుగా విభజించి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. నామినేషన్ల స్వీకరణకు అవసరమైన సిబ్బంది, పోలింగ్ సిబ్బంది నియామకం, పోలింగ్ కేంద్రాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిర్వహణలోఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఫణి రాజకుమారి, తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో మెహెతాబ్ యాస్మిన్, కార్యాలయ ఏఓ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లకు రెండో విడత శిక్షణ

## పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు సమర్ధవంతంగా శిక్షణ అందించాలి

### -జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:
జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ అధికారులు (ఫ్రూలు), సహాయ పోలింగ్ అధికారులు (ఫ్యూలు)కు సమర్ధవంతంగా శిక్షణ అందించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సూచించారు. శనివారం చిత్తూరు లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో ఎన్నికల విధుల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ఎన్నికల చట్టాలు, నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించేలా రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్‌జీఎస్‌డబ్ల్యూ అధికారి రవికుమార్ మరియు ఏ ఎస్ ఓ సౌందర్ రాజన్ శిక్షణ అందించగా, ఉపాధ్యాయులు(మాస్టర్ ట్రైనర్లు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల నిర్వహణకు వేలాది మంది ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారుల సేవలు అవసరమవుతాయని తెలిపారు. పెద్ద సంఖ్యలో ఉన్న సిబ్బందికి ఒకేసారి శిక్షణ ఇవ్వడం సాధ్యం కానందున, మండలాల వారీగా మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. ప్రతి శిక్షణ తరగతికి సుమారు 50 నుంచి 60 మంది సిబ్బందిని కేటాయించి, ప్రతి ఒక్కరికీ ఎన్నికల విధులపై స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ అనేది పూర్తిగా నిబంధనలకు లోబడి జరిగే ప్రక్రియ అని, ప్రతి దశలోనూ ఎన్నికల చట్టాలు, నియమావళి, అధికారిక మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో చిన్న పొరపాటు జరిగినా తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉన్నందున, మాస్టర్ ట్రైనర్లు తమకు అందించిన శిక్షణ సామగ్రిని పూర్తిగా అధ్యయనం చేసి, సందేహాలను నివృత్తి చేసుకున్న తర్వాతే క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. గతంలో ఎన్నికల విధులు నిర్వహించిన అనుభవం ఉన్నప్పటికీ, ప్రతి ఎన్నికలోనూ నిబంధనలు, విధానాల్లో మార్పులు ఉండే అవకాశం ఉన్నందున తాజా



మార్గదర్శకాలను తప్పనిసరిగా తెలుసుకోవాలని తెలిపారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారుల విధులు, ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన ప్రతి దశను మాస్టర్ ట్రైనర్లు స్పష్టంగా వివరించాలన్నారు. శిక్షణ సమయంలో సిబ్బంది అడిగే సందేహాలకు అధికారిక శిక్షణ సామగ్రి ఆధారంగా సమాధానాలు ఇవ్వాలని, ఊహాజనిత సమాచారంతో వివరణలు ఇవ్వకూడదని సూచించారు. ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి మాస్టర్ ట్రైనర్లు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని ఆదేశించారు. శిక్షణ తరగతులను ఆర్డీవోలు, తహసీల్దార్లు పర్యవేక్షిస్తారని, తాను కూడా మూడు మండలాల్లో శిక్షణ కార్యక్రమాలను సందర్శించి, శిక్షణ అందించే విధానాన్ని పరిశీలిస్తానని తెలిపారు.

శిక్షణకు సంబంధించిన సందేహాలు, సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసి, అవసరమైన మార్గదర్శకాలు అందిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో జిల్లా పనితీరు మాస్టర్ ట్రైనర్లు అందించే శిక్షణ నాణ్యతపై ఆధారపడి ఉంటుందని ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాన్ని వినియోగించి, ఎన్నికల సిబ్బందికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. ఎన్నికల విధుల ను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో, అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

# కాంతమ్మ మృతదేహానికి నివాళులర్పించిన టిడిపి నాయకులు



ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రపురం
మండలంలోని అనుపల్లి పంచాయతీ గెడ్డకింద పల్లి గ్రామానికి చెందిన కామసాని కాంతమ్మ (80) మృత దేహానికి శనివారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు టిడిపి జడ్పిటిసి అభ్యర్థి మేకల తిరుమలరెడ్డి, నాయకులు నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీకి చెందిన కామసాని మోహన్ రెడ్డి, జ్ఞానేంద్ర రెడ్డిల తల్లి కామసాని కాంతమ్మ శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని దహన క్రియలకు హాజరయ్యారు. మృతురాలు కాంతమ్మ పార్థవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులు కే మోహన్ రెడ్డి, జ్ఞానేంద్ర రెడ్డిలను పరామర్శించి, ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డి బిందు మాధవి, ఎద్దల గుణసుందరి, ఎద్దల దొరస్వామిరెడ్డి, బండి విజయ్ కుమార్ రెడ్డి, గుర్రం దేవరాజుల రెడ్డి, అప్పి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ధూమావతీ దేవి అలంకరణలో శ్రీ మరకత కాళీ దేవి దర్శనం

## స్త్రీమూర్తులకు నిత్య సుహాసిని పూజలు



ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రపురం
రామచంద్రాపురం మండలం రాయల చెరువు కట్ట దగ్గర వెలసియున్న శ్రీ శక్తి పీఠం నందు శనివారం శ్రీ దశమహావిద్యా దేవతల దివ్యోత్సవములు, ఏడవ రోజు కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి దివ్య సమక్షంలో మంత్ర మహేశ్వరి శ్రీ శక్తి పీఠాదీశ్వరి మాతాజీ శ్రీ రమ్యానందభారతీ స్వామినీ వారి ఆధ్వర్యంలో అంగరంగ వైభవముగా జరుగుతున్నాయి. శ్రీ ధూమావతీ దేవి కి విశేష పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు



నిర్వహించారు. ఆనంతరం శ్రీ మరకత శక్తికాళీ దేవికి శ్రీ ధూమావతీ దేవి రూప అలంకరణ లో , విశిష్ట పూజ, హోమము, పూర్ణాహుతి నిర్వహించారు. స్త్రీమూర్తులకు సువాసిని పూజ నిర్వహించారు. సాయంత్రం కళాకారులచే గాన కచేరి, జగద్గురువుల దివ్య సమక్షంలో పూజ్యశ్రీ మాతాజీ వారిచే శ్రీ మరకత శక్తికాళీ దేవికి దర్బారు సేవా నిర్వహించారు.ఈ కార్యక్రమనికి దేశ విదేశాల నుండి విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అందరికీ అన్న ప్రసాద వితరణ చేశారు

# శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి గ్రామోత్సవం



ప్రజా భూమి ప్రతినిధి,వడమాలపేట
తిరుమల తిరుపతి అనుబంధ ఆలయమైన అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తమిళ పెరటాసి నెల చివరివారం (ఐదవ) శనివారం కావ డంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువ జామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొ లిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలపై కొలువుదీర్చారు. ఊంజల్ సేవ కన్నుల పండువగా సాగింది. అనంతరం తిరుచ్చిపై స్వామి, అమ్మవార్లు కొలువుదీరగా మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా సాగిం ది. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకొన్న స్వామి, అమ్మవార్లకు మంగళహారతులిచ్చి పవ లింపు సేవ నిర్వహించారు. ఆలయం వెలుపల ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకొన్నారు. కార్యక్రమాలను ఆలయ సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్ పర్యవేక్షించారు.

# ఎంపీటీసీల నామినేషన్ కేంద్రంలో పటిష్ట చర్యలు తీసుకుంటాం

### - డి.ఎస్.పి జగదీష్ నాయక్.

### నామినేషన్ల కేంద్రాన్ని పరిశీలించిన డి.ఎస్.పి, అధికారులు.

ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రపురం
మండలంలో ఎంపీటీసీ స్థానాలకు నిర్వహించనున్న ఎన్నికలకు అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన నామినేషన్ల కేంద్రం వద్ద పటిష్ట చర్యలు తీసుకుంటామని చంద్రగిరి డిఎస్పి జగదీష్ నాయక్ తెలిపారు. శనివారం ఎంపీడీవో కార్యాలయం లోని నామినేషన్ల కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. నామినేషన్ కేంద్రం వద్ద హెల్ప్ డెస్క్, త్రాగునీరు, తనిఖీ కేంద్రం, లైటింగ్, నిఘా నేత్రాలను ఏర్పాట్లు ను పరిశీలించారు. ఈనెల 21వ తారీఖున ఎంపీటీసీల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం



సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్సై భక్తవత్సలంను ఆదేశించారు. నామినేషన్ల కేంద్రం వద్ద 144 సెక్షన్ విధిస్తామన్నారు. నామినేషన్ వేసేందుకు అభ్యర్థితోపాటు ఒకరికి మాత్రమే నామినేషన్ కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పులిరాం సింగ్, ఎస్సై భక్తవత్సలం, ఏవో చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో తేజోవతి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలే మా బలం.. కూటమి ధర్మాన్ని పాటిస్తూనే పోటీకి సిద్ధం!



ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి:
?విలువలతో కూడిన ఆదర్శ రాజకీయాలను స్థాపించడమే ధ్యేయంగా జనసేన పార్టీ ముందడుగు వేస్తోంది. పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, ఆదేశాలే మార్గదర్శకంగా జనసేన నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గంలో చురుగ్గా పనిచేస్తున్నారని నియోజకవర్గ ఇన్చార్జి దేవర మనోహర్ పేర్కొన్నారు. శనివారం చంద్రగిరి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని చంద్రగిరి నియోజకవర్గంలో జనసేన పార్టీ సమన్వయకర్తలు, కమిటీ సభ్యులు, అసెంబ్లీ, పార్లమెంట్ నాయకుల సమక్షంలో ముఖ్యమైన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఆసక్తి చూపుతున్న ఆశావహుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని 6 జెడ్పీటీసీ స్థానాలకు గాను 15 మంది, 96 ఎంపీటీసీ స్థానాలకు గాను 59 మంది మరియు 6 ఎంపీపీ స్థానాలకు 10 మంది ఆశావహులు పోటీకి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వివరాలను ఆన్‌లైన్ ద్వారా సబ్మిట్ చేసిన అనంతరం, సమగ్రంగా స్క్రూటినీ చేసి అర్హులైన అభ్యర్థులకే బి-ఫామ్‌లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. కూటమి పొత్తు ధర్మాన్ని పూర్థిస్థాయిలో గౌరవిస్తూనే ఎన్నికల బరిలో నిలుస్తామని నాయకులు స్పష్టం చేశారు. పొత్తులో భాగంగా అవకాశాలు ఉన్నచోట కలిసి పోటీ చేస్తామని, అవకాశాలు లేని చోట పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ సూచనల మేరకు ఫ్రెండ్లీ కంటెస్ట్ చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. అలాగే అభ్యర్థులకు బి-ఫామ్‌లు కేవలం జనసేన పార్టీ కార్యాలయం, పార్టీ సమన్వయకర్తల ద్వారా మాత్రమే అందుతాయని, ఇతర పార్టీల నాయకులు లేదా ఇతర కార్యాలయాల నుంచి ఇచ్చే బి-ఫామ్‌లతో సంబంధం లేదని తేల్చి చెప్పారు. ?స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని కూడా కూటమి ధర్మాన్ని పాటిస్తూ, చంద్రగిరిలో జనసేన పార్టీకి రావలసిన న్యాయమైన అవకాశాలను కేటాయించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నట్లు తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో జనసేన జెండాను రెపరెపలాడించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న జనసైనికులు, వీరమహిళలు మరియు నాయకులందరికీ ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# రేణిగుంట రైల్వే పెన్షన్స్ కార్యాలయంలో స్టేట్ బ్యాంక్ మేనేజర్ సమావేశం




ప్రజాభూమి ప్రతినిధి
రేణిగుంట.
శనివారము రేణిగుంట రైల్వే పెన్షనర్స్ కార్యాలయము నందు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రేణిగుంట మరియు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శెట్టిపల్లి శాఖల మేనేజర్లు నాగార్జున మరియు సత్యనారాయణరైల్వే పెన్షనర్ల అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. పెన్షనర్స్ ను ఉద్దేశించి లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వడం గురించి డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ మరియు 80 సంవత్సరాలు పూర్తయిన వారు అక్టోబర్లో కూడా చేసుకోవాలని 80 సంవత్సరాలు లోబడిన వారందరూ నవంబరు ఒకటో తేదీ నుంచి నవంబర్ 30 తేదీ లోపల వారు లైవ్ సర్టిఫికెట్ సమర్పించమని తెలియజేశారు. ఎవరైనా 80 సంవత్సరములు దాటిన వారు నడవలేక మీ సేవ కేంద్రాలకు గాని బ్యాంకు కార్యాలయాలు గాని రాలేకపోయిన యెడల తెలియజేసిన యెడల వారి ఇంటికి వద్దకే వచ్చి లైఫ్ సర్టిఫికేట్ చేసుకొని పోతామని తెలియజేశారు. ప్రస్తుతం కొందరు దుండగులు ఫ్రాడ్ చేస్తూ ఖాతాదారుల అకౌంట్లో నుంచి నగదును చోరీ చేస్తున్నారు. వారితో చాలా జాగ్రత్తగా ఉండవలెనని చెప్పారు. ఏ టీ ఎం కార్డులు ఇతరులక్కిచ్చి డ్రా చేయమని చెప్పద్దండి. ఎవరితోనో పిన్నును షేర్ చేయొద్దని చెప్పారు. పెన్షనర్లు యొక్క ప్రశ్నలకు బ్యాంకు మేనేజర్ వివరణ ఇచ్చారు. పెన్షనర్లను ఉద్దేశించి మాట్లాడుతూ మీరు చాలా అప్రమత్తత గా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఏ ఆసన్ సాహెబ్, సెక్రటరీ జి జయంత్ కుమార్, ట్రెజరర్ ఏ అన్ను, వర్కింగ్ చైర్మన్ ఆర్ నగేష్,జి రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శులు పోసిన వెంకటేశ్వర్లు, బి రాజేంద్రన్ మొదలగు ఆఫీస్ బ్యానర్లు మరియు పెన్షనర్లు పాల్గొన్నారు.

# పురపాలక ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు

### నామినేషన్ ప్రక్రియలో లోపాలు లేకుండా చూడాలి.

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు,:
పురపాలక ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని, అందుకు అనుగుణంగా ప్రణాళికతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధి కారి, కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై శనివారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని జిల్లా ఎన్నికల అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్న రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. తదుపరి అధికారులతో సమావేశం అయ్యారు. పురపాలక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలంటే అధికారులు బాధ్యతతో అలసత్వం లేకుండా పనిచేయాలని కలెక్టర్ హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణకు చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 60 డివిజన్లో సంబంధించి 15 స్వర్ణ వార్డు కార్యాలయాలలో నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. చిత్తూరు మేయర్ స్థానానికి నామినేషన్ వేసే అభ్యర్థులు చిత్తూరు నగరపాలక కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి నామినేషన్ అందజేయాలి. కార్యాలయాన్ని పరిశీలించారు. ఎలాంటి లోపాలకు తావు లేకుండా చూసుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్, ఆర్వో పుల్లారెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# రెడ్డివారిపల్లి సర్పంచ్‌గా అవకాశం ఇవ్వండి: గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

### -: కొత్తకోట నాగరాజు ..!



ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి:
తనకు ఒక్క అవకాశం ఇస్తే రెడ్డివారి పల్లి పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని చంద్రగిరి మండలం రెడ్డివారిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల బరిలో ఉంటున్న కొత్తకోట నాగరాజ తెలిపారు. రాబోయే సర్పంచ్ ఎన్నికల లో తాను రెడ్డివారిపల్లి సర్పంచిగా పోటీ చేయనున్నట్లు నాగరాజ వెల్లడించారు. నిస్వార్థపరుడు, నిగర్వి, రాజకీయ అనుభవం, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్న కొత్తకోట నాగరాజ ప్రజల ఆశీస్సులతో ఎలాగైనా సర్పంచి పదవిని చేజిక్కించుకుంటానన్న ధీమాతో తన అభ్యర్థిత్వాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా కొత్తకోట నాగరాజ మాట్లాడుతూ పంచాయతీ ప్రజలు తనను ఆశీర్వదిస్తే నిస్వార్ధంగా పార్టీలకతీతంగా గ్రామ అభివృద్ధి, తాగునీటి సమస్య పరిష్కారం, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల ఏర్పాటు, పేదల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని సహాయ సహకారాలతో ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తానన్నారు. గ్రామస్తులందరి ఆశీర్వాదంతో గెలుపు సాధించి, రెడ్డివారిపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఆయన హామీ ఇచ్చారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తన గెలుపుకు పెద్ద మనసుతో సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. గ్రామ సర్పంచ్ గా తాను ఎన్నికైన వెంటనే పంచాయతీ రూపురేఖలు మారుస్తానని, పిల్లల భవిష్యత్తు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని నాగరాజ తెలిపారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు తన గెలుపుకు పెద్ద మనసుతో సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు.

# కాళరాత్రి దుర్గ అలంకరణలో శ్రీ ఉగ్ర ప్రత్యంగిరా దేవి..!




ప్రజాభూమి ప్రతినిధి,
చంద్రగిరి:
తొండవాడ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ ఉగ్ర ప్రత్యంగిరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి,పట్టు వస్త్రాలు కట్టి, బంగారు ఆభరణములు, సువాసనలు గోలిపే పుష్పాలతో శింగారించి, ధూప,దీప, నైవేద్య, కర్పూర హారతులు ఇచ్చి భక్తులకు దర్శన ఏర్పాట్లు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తిని వాహన మండపము నకు తీసుకువచ్చి కాళరాత్రి దుర్గ అలంకరణ నిర్వహించి, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికిఉభయదారులుగా తిరుపతికి చెందిన టి. వెంకటేష్ రెడ్డి, బెంగళూరుకు చెందిన ఎం.మొగిలేశ్వర్ రెడ్డి,స్వాతి రెడ్డి, హేమంత్ వ్యవహరించిరి.వీరికి ఆలయ పీఠాధిపతి పూజారి సూరిస్వామి, వేద పండితులు జి. సీతారామ శర్మ తీర్థప్రసాదాలు ఇచ్చి సత్కరించిరి. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు పూజారి శివశంకర్ ప్రసాద్, వడ్డీ కాసుల రామ్మూర్తి నాయుడు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రజాభూమి మచిలీపట్నం, ప్రతినిధి : కృష్ణా జిల్లాలో 2026--27 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుల నుంచి ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మచిలీపట్నంలోని రైస్ మిల్లర్ల సంఘం భవనంలో శనివారం జిల్లా డీఎస్ఓ తాటి శివ రామ ప్రసాద్, సిబ్బందితో క్షేత్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ విధానంపై శిక్షణ ఇచ్చి, పలు సూచనలు చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ప్రకారం సాధారణ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,441, గ్రేడ్--ఏ రకం ధాన్యానికి రూ. 2,461 చొప్పున చెల్లించనున్నట్లు అధికారులు తెలిపారు. ధాన్యం సేకరించిన అనంతరం రైతులకు చెల్లించాల్సిన మొత్తాలను ఆధార్ ఆధారిత చెల్లింపుల విధానంలో నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టి, తగిన తేమ శాతంతో



కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన వాట్సాప్ ద్వారా ముందస్తు సమయ కేటాయింపు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధాన్యం సేకరణ విధానం, కనీస మద్దతు ధర, నాణ్యతా ప్రమాణాలు, కొనుగోలు ప్రక్రియపై రైతులకు పూర్తి అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులు, కూలీలు, రవాణా వాహనాలను ముందుగానే సమకూర్చుకోవాలని, ఎక్కడా కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు స్వయంగా కూలీలను ఏర్పాటు చేసుకున్నా, రవాణా ఖర్చులు భరించినా ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హమైన మొత్తాలను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ కనీస మద్దతు ధర అందేలా చూడాలని స్పష్టం చేశారు. ధాన్యం రవాణా చేసే వాహనాలన్నింటికీ ముందుగానే జీపీఎస్ పరికరాలను ఏర్పాటు చేసి, రవాణా ప్రక్రియను పారదర్శకంగా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించి, సకాలంలో సేవలు అందించాలని ఆదేశించారు. ధాన్యం సేకరణను సమర్థవంతంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయి సిబ్బందితో నిరంతరం సమీక్షా సమావేశాలు నిర్వహించాలని, ముందస్తు ప్రణాళికతో సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మచిలీపట్నం నార్త్ తహశీల్దార్ నాగ భూషణం, మచిలీపట్నం సౌత్ తహశీల్దార్ రామ శివ , అసిస్టెంట్ సప్లయ్ ఆఫీసర్ ప్రధాన్ , గ్రామ వ్యవసాయ సహాయకులు , టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కస్టోడియన్ అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులు ధాన్యం సేకరణ ప్రక్రియకు సంబంధించిన ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సిరులతల్లి చెంత నాదనీరాజనం - ఇంద్రకీలాద్రిపై పరిఢవిల్లిన దివ్య సాంస్కృతిక వైభవం

### కొండపై అష్టైశ్వర్యాల ప్రదాత శ్రీ మహాలక్ష్మిగా జగన్మాత దర్శనం -- కొండదిగువన భక్తితరంగాలతో పరవశించిన కళాక్షేత్రం

### అమ్మవారి దివ్య సన్నిధిలో స్వరఝరి, హరికథా గానం, చిన్నారుల లయాన్విత శాస్త్రీయ నాట్యార్చన

### ఉదయం నుండి రాత్రి వరకు నిర్విరామంగా కళార్చన -- ఆధ్యాత్మిక తన్మయత్వంలో మునిగితేలిన లక్షలాది భక్తజనం

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

నమస్తేస్తు మహామాయే శ్రీపీఠే సురపూజితే ।
శంఖచక్ర గదాహస్తే మహాలక్ష్మి నమోస్తుతే ॥
సర్వజ్ఞే సర్వవరదే సర్వదుష్ట భయంకరి ।
సర్వదుఃఖ హరే దేవి మహాలక్ష్మి నమోస్తుతే ॥

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవోపేతంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా శనివారం శ్రీ కనకదుర్గా నగర్‌లోని కళావేదికపై సాంస్కృతిక, ఆధ్యాత్మిక శోభ పరిపూర్ణంగా వికసించింది. సకల లోకాలకు ఐశ్వర్యాన్ని, ఆయురారోగ్యాలను, సమస్త శుభాలను అనుగ్రహించే అష్టైశ్వర్యప్రదాయిని శ్రీ కనకదుర్గ అమ్మవారు ఇంద్రకీలాద్రి శిఖరాన పద్మాసనారాఢురాలై శ్రీ మహాలక్ష్మి దేవి దివ్యాలంకారంలో భక్తులకు కటాక్షాన్ని ప్రసాదిస్తున్నారు. కొండపై లక్ష్మీదేవి కటాక్ష వీక్షణాల కోసం భక్తజనం బారులు తీరగా, కొండదిగువన దుర్గా నామస్మరణతో, భక్తి ప్రవచనాలతో ప్రాంగణమంతా ఆధ్యాత్మిక తేజస్సుతో వెలిగిపోయింది. భగవదారాధనకు కళలే పరమోత్కృష్ట సాధనమనే నానుడికి అద్దం పడుతూ, గాన-సాహిత్య-నృత్యాల కలబోతగా సాగిన ఈ దివ్య కళార్చనలు అమ్మవారి దర్శనార్థం తరలివచ్చిన లక్షలాది భక్తజనాన్ని ఆధ్యాత్మిక ఆనందడోలికల్లో ఓలలాడించాయి. ఉదయం నుండి రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగిన కళా ప్రదర్శనలు క్షేత్రంలో దివ్యమైన ఆధ్యాత్మిక తరంగాలను సృష్టించాయి. ఉదయం జి. శేషకుమారి బృందం సమర్పించిన గ్రామీణ తాళం భజనతో కళావేదిక భక్తిచైతన్యంతో ప్రారంభమైంది. మహాలక్ష్మి వైభవాన్ని, అమ్మవారి లీలలను కీర్తిస్తూ సిహెచ్. శాంతి, వి. లలిత నాగమణి, వి. లక్ష్మి వి. సత్యవల్లి ఆలపించిన భక్తిరంజని గీతాలు,



దేవీ అష్టకాలు శ్రోతలను నాదబ్రహ్మంలో తేలియాడేలా చేశాయి. ప్రముఖ హరికథా విద్వాంసులు సిహెచ్. నాగబాబు సమర్పించిన హరికథా కాలక్షేపం భక్తులను విశేషంగా అలరించింది. లక్ష్మీ వైభవాన్ని, పురాణ గాథలను శ్రావ్యమైన గానం, అర్థవంతమైన అభినయంతో రంగరించి వివరించిన తీరు భక్తుల ప్రశంసలు అందుకుంది. శ్రీ మహాలక్ష్మి దేవి అనుగ్రహం కొరకు చిన్నారులు, యువ కళాకారులు లయాన్విత అడుగులు, సాత్విక అభినయ ముద్రలతో కూచిపూడి, భరతనాట్య రీతులలో అద్భుత నాట్య నివేదన సమర్పించారు. మరిశర్ల స్నిగ్ధ, టి. ఉమాదేవి, ఎం.ఎల్. వసుంధర, ఎం. యోషిత, సురేష్ గోపి, బి. ఉదయశ్రీ, పి. నాగభవాని సాయి, బి. భాగ్య చంద్ర ఎన్. లావణ్య, ఎన్. హరిప్రియ, బి. శ్రీజ, ఎన్. రిషిత సాన్వి, ఎం. చైత్ర, టి. రవికుమార్, కె. కృష్ణవేణి, పి. ప్రసాద్, ఎ. సంతోష్ ఈ కళాకారులు ప్రదర్శించిన మహాలక్ష్మి అష్టక నృత్యాలు, దేవీ స్తుతులు, శివ-శక్తి నృత్య రూపకాలు, అన్నమాచార్య కీర్తనలకు అభినయాలు ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు ఈ ప్రదర్శనలను తిలకిస్తూ శ్రమను మరచి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. కళారూపాల ద్వారా అమ్మవారిని ఆరాధించిన కళాకారులందరినీ ఆలయ అధికారులు ప్రత్యేకంగా ప్రశంసించి, దేవస్థానం తరఫున శ్రీ అమ్మవారి శేషవస్త్రాలు,ప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరించారు.

# నామినేషన్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు..!

### జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్

### ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట చర్యలు



ప్రజాభూమి ప్రతినిధి,కడప: వైఎస్సార్ కడప జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు జిల్లాలోని అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 ఆఅమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా డివిజన్ స్థాయి రెవెన్యూ, పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు, వారి అనుచరులు పెద్ద సంఖ్యలో గుంపులుగా చేరకుండా నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల నిబంధనలు, నామినేషన్ కేంద్రాల వద్ద అమలు చేయాల్సిన ఆంక్షలపై ముందుగానే అవగాహన కల్పించాలని తెలిపారు. రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు

# శ్రీశ్రీశ్రీ చాముండేశ్వరి తల్లిని అలాగే వేడంలో వెలసిన కాళికాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు



ప్రజా భూమి ప్రతినిధి
శ్రీ కాళహస్తి టౌన్

దేవీ నవరాత్రుల శుభ సందర్భంగా శ్రీ భవాని దీక్షా మాల ధరించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె కాటంరెడ్డి పవిత్ర రెడ్డి బియ్యపు ఈరోజు కనకచలంపై వెలసిన శ్రీ దుర్గమ్మ తల్లినీ,భాస్కర్ పేట లో వెలసిన శ్రీశ్రీశ్రీ చాముండేశ్వరి తల్లిని అలాగే వేడంలో వెలసిన కాళికాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు కనకాచలం పై వెలసిన శ్రీ కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఈ 9 రోజులు భక్తులకు అన్నప్రసాదాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పులి రామచంద్ర, యుగంధర్,సుధాకర్,పంతులు, కామి వెంకటేశ్వర్లు,దేవస్థానం మాజీ బోర్డు మెంబర్ బుల్లెట్ జయశ్యామ్ రాయల్,మున్నా రాయల్,సుధ, రమేష్,గుణ, హేమసుందర్, భారతమ్మ పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి తొట్టంబేడు మండలం నుంచి జనసేనలోకి భారీ చేరికలు



ప్రజాభూమి ప్రతినిధి తొట్టంబేడు

జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై తొట్టంబేడు మండలానికి చెందిన పలువురు పెద్దలు, యువకులు జనసేన పార్టీలో చేరారు. శ్రీకాళహస్తి పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు తోట గణేష్ ఆధ్వర్యంలో, జనసేన నాయకులు కుప్పాల వెంకటేష్ (దుమ్ము రాయల్) సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా చంద్రయ్య, రామయ్య నారయ్య, మునిరత్నం, వెంకటయ్య, వెంకటేష్, కె. వెంకయ్య, ఏకాంబరం, సాయి, మస్తాన్, శ్రీను, ముని, జై బాబు తదితరులు జనసేన పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికీ జనసేన నాయకులు, వీర మహిళ రాజ్యలక్ష్మి హృదయపూర్వక స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు రవి కుమార్ రెడ్డి, జనసేన నాయకులు గరిక సురేష్, లోకేష్, దినేష్, కృష్ణయ్య, నరసయ్య, ముని, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జీయూకేటీ ఆర్కెవ్యాలీలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ముగింపు

### - సైబర్ నేరాలు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలపై అవగాహన



ప్రజాభూమి, వేంపల్లె

ఆర్జీయూకేటీ ఆర్కె వ్యాలీలో నాన్ టీచింగ్ సిబ్బందికి నిర్వహించిన నాలుగు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఆర్జీయూకేటీ, స్కిల్ ఏపీ--ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 14 నుంచి 17వ తేదీ వరకు కంప్యూటర్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేర్చుకోండి.. సాధన చేయండి.. ఎదగండి అనే థీమ్‌తో నిర్వహించిన శిక్షణలో కంప్యూటర్ పరిజ్ఞానం, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, సురక్షిత డిజిటల్ లావాదేవీలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. శిక్షకులు ఎం. నరసింహులు, ఎస్. దివాకర్ ప్రాయోగిక శిక్షణ అందించారు. ముగింపు కార్యక్రమంలో డైరెక్టర్, పరిపాలనా అధికారి మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను రోజువారీ విధుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ శిక్షణ కంప్యూటర్ నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు సైబర్ భద్రతపై అవగాహన కల్పించేందుకు ఉపయోగపడిందని పాల్గొన్న సిబ్బంది పేర్కొన్నారు.

# కూచిపూడి నృత్యం తెలుగు జాతికి గర్వకారణం

### -అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



ప్రజా భూమి ప్రతినిధి అవనిగడ్డ

కూచిపూడి నృత్యం తెలుగు జాతికి గర్వకారణం అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చల్లపల్లిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ మండపంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. మెహెర్ నృత్య నికేతన్ 25 మంది బాలికలు తమ గురువు దాలిపర్తి మెహెర్ దుర్గా నరసింహారావు పర్యవేక్షణలో అద్భుతమైన నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. జగడపు తనవుల జాతర అంటూ అన్నమాచార్య కీర్తనకు కోలాట రూపంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీవెంకటేశ్వరస్వామి సన్నిధిలో నర్తకీమణుల కోలాటం చివరగా స్వామివారు వారితో కలిసి నాట్యంచేసిన సన్నివేశం భక్తులను ఆకట్టుకుంది. దశావతారాలు, నందబాలం రామదాసు కీర్తన, కొలువైతివా కూచిపూడి సంప్రదాయ అంశంతోపాటు దాదాపు ఇరవై అంశాలను బాలబాలికలు అత్యద్భుతంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అభినందించారు. ఈ సందర్భంగా కమిటీ పెద్దలు కొల్లిపర మధు, వరదా రాజశేఖర్, వరదా హరగోపాల్, దింటకుర్తి జ్యోతి, తమ్మన సతీష్ కుమార్ నాట్యాచార్యులు మెహర్ దుర్గా నరసింహారావును ఘనంగా సన్మానించి చిన్నారులను అభినందించి బహుమతులు అందచేశారు.

# లంక మిట్టలో పేద పిల్లలకు నూతన వస్త్రాల పంపిణీ.



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తిలోని విక్రమ్ కాలేజ్ 1998-2000 బ్యాచ్ నందు చదువుకున్న పూర్వ విద్యార్థులు శివం టు శివం రోడ్డు సమీపంలో లంక మిట్టలో ఉన్న 40 మంది విద్యార్థులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అంతేకాకుండా ఈ పూర్వ విద్యార్థులు ప్రతి సంవత్సరం శివరాత్రి రథోత్సవానికి మరియు కొండ చుట్టు అన్నదాన కార్యక్రమాలు చేస్తూ ఉంటారు. ఈసారి దసరా నవరాత్రుల సందర్భంగా లంకమెట్టలో పేద విద్యార్థులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అదేవిధంగా సరస్వతి శిశు మందిర్ స్కూల్ నందు చదువుకున్న వీరు అక్కడ కూడా పూర్వ విద్యార్థులు ఇద్దరు సహకారంతో ఈరోజు ఈ వస్త్ర పంపిణీ కార్యక్రమం లంకమెట్టలో నిర్వహించారు. అంతేకాకుండా సమాజ సేవకు ఉపయోగపడే కార్యక్రమాలను ఇంకా ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా వీరు తెలియజేశారు.

# శ్రీకాళహస్తి మత్స్యకార సంక్షేమ సమితి పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన గంగపుత్ర గాంధీకి డా. చంద్రప్ప అభినందనలు



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీ కావమ్మ గుడి వీధిలో ఉన్న శ్రీ కావమ్మ మందిరం వద్ద మత్స్యకార సంక్షేమ సమితి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గంగపుత్ర గాంధీని డా. చంద్రప్ప మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించి, హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మత్స్యకార సంక్షేమ సమితి నూతన కార్యవర్గ ఎంపిక, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలు, మత్స్యకారుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. 28, 29 తేదీల్లో నిర్వహించనున్న మత్స్యకార సంక్షేమ సమితి సమావేశానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు చర్చించనున్నట్లు గాంధీ తెలిపారు. ఈ సమావేశానికి బెస్త సంఘ పెద్దలు, ప్రముఖులు,సంఘ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై తమ విలువైన సూచనలు, సలహాలు అందించాలని ఆయన ఈ సందర్భంగా ఆహ్వానించారు.

# వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న బీజేపీ , జనసేన యువత



ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు

తొట్టంబేడు మండలం, చియ్యవరం గ్రామానికి చెందిన జనసేన యువత ఈరోజు పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సమక్షంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు మరియు మండల నాయకులు ఆధ్వర్యంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేరిన వారిలో నాగభూషణం, ఏకాంబరం,ముని చంద్ర,సాయి, జయబాల్ ,నరేంద్ర,మురళి, ముని కృష్ణయ్య,మునిరత్నం, శంకర్, పెంచలయ్య తదితరులు ఉన్నారు.

# కలవగుంట త్రిషికారెడ్డి 3 వ జన్మదిన వేడుకలు

### అంబిలి స్వామి ఆశ్రమంలో మహదేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం



ప్రజా భూమి ప్రతినిధి
శ్రీకాళహస్తి టౌన్

ప్రముఖ సంఘ సేవకులు, మహదేవ ట్రస్ట్ వ్యవస్థాపకులు కలవగుంట భరత్ రెడ్డి కుమార్తె కలవగుంట త్రిషికారెడ్డి మూడవ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శనివారం శ్రీకాళహస్తిలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ఆలయానికి అతి సమీపంలో ఉన్న ప్రసిద్ధ అంబిలి స్వామి ఆశ్రమంలో మహదేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో నివసిస్తున్న స్వాములు, వృద్ధులు, భక్తులు మరియు స్థానిక పేదలకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. అరటి ఆకుల్లో భోజనాన్ని వడ్డించి అందరికీ కడుపునిండా భోజనం పెట్టారు. దాదాపు 5 వందలు మందికి పైగా ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భోజన ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ.. "పుట్టినరోజు వేడుకలను ఆడంబరంగా కాకుండా ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం ద్వారా జరుపుకోవడం మా కుటుంబ ఆనవాయితీ. చిన్నారి త్రిషికారెడ్డి మూడవ ఏట అడుగుపెడుతున్న శుభ సందర్భంగా, ఆ చిన్నారి పేరిట ఈ సేవా కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉంది. అంబిలి స్వామి ఆశీస్సులు,శ్రీకాళహస్తీశ్వరుని కరుణతో చిన్నారి త్రిషికారెడ్డి ఆయురారోగ్యాలతో,సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబిలి స్వామి ఆశ్రమ నిర్వాహకులు,మహదేవ ట్రస్ట్ సభ్యులు, సీనియర్ పాత్రికేయులు చంద్రశేఖర్, బాలు,మోతీష్, ప్రభాకర్, కుటుంబ సభ్యులు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# బంగారమ్మ గుడి వెనుక అప్పలాయగుంట చెరువులో అక్రమ గ్రావెల్ దందా

### మూడు రోజులుగా యథేచ్ఛగా తవ్వకాలు

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

పట్టణంలోని బంగారమ్మ గుడి వెనుక వైపున ఉన్న అప్పలాయగుంట చెరువులో అక్రమ గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. గతమూడు రోజులుగా అనుమతులు లేకుండా జెసిబిలు,ట్రాక్టర్లతో గ్రావెల్ ను అక్రమంగా తరలిస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, పగలు, సాయంత్రం వేళల్లో జెసిబిల సహాయంతో చెరువులో తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెరువులు, నీటి వనరుల్లో ఎలాంటి మైనింగ్ చేయకూడదు. అయినప్పటికీ అధికారులకు తెలియకుండా ఈ తవ్వకాలు జరుగుతుండటంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు గండి పడటమే కాకుండా,చెరువు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఇప్పటికే చెరువులో లోతైన గుంతలు ఏర్పడ్డాయి. కావున రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు వెంటనే స్పందించి, అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, చెరువును కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



# దమ్ముంటే పోలీసుల జోక్యం లేకుండా ఎన్నికలు జరిపించండి

### - మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి గడికోట శ్రీకాంత్ రెడ్డి సవాల్

ప్రజాభూమి ప్రతినిధి,రాయచోటి:
రాయచోటి నియోజకవర్గంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రెస్టీజ్ పేరుతో ఎన్నికల ముసుగులో అరాచకాలు చేస్తున్నాడని వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాయచోటిలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వ్యాపారుల దుకాణాలు, ఫర్నిచర్ ధ్వంసం చేయడం, వైఎస్సార్సీపీ కార్యాలయం, వాహనాలపై దాడులకు సమాధానం చెప్పకుండా సంబంధం లేని అంశాలను తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని మండిపడ్డారు. రాయచోటిలో వైఎస్సార్సీపీ కార్యాలయం, వాహనాలపై దాడులు, వ్యాపారుల ఆస్తుల విధ్వంసానికి సంబంధించి వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసు వ్యవస్థ అధికార పార్టీకి అనుకూలంగా కాకుండా చట్టం ప్రకారం నిష్పక్షపాతంగా పనిచేయాలన్నారు. “నామినేషన్ల నుంచి పోలింగ్ వరకు ప్రతి అభ్యర్థికి సమాన అవకాశం కల్పించాలి. దాడులు, బెదిరింపులు పక్కనపెట్టి ప్రజల ముందుకు రండి. మీ పాలనపై ప్రజలే తీర్పు చెప్పేలా స్వేచ్ఛాయుత ఎన్నికలకు సిద్ధపడాలి. నేను ప్రచారానికి రాను, మీరు ప్రచారానికి రాకండి.. పోలీసుల పర్యవేక్షణలో ఎన్నికలు స్వేచ్ఛగా జరగనివ్వండి. వైఎస్సార్సీపీ తరఫున 44 మంది కౌన్సిలర్లతో పాటు చైర్మన్ అభ్యర్థి నామినేషన్లు వేయించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. ప్రజలు గత పాలనను, ప్రస్తుత పాలనను బేరీజు వేసుకుని స్వేచ్ఛగా ఓటు వేస్తే ఎవరి బలం ఎంతో తేలిపోతుంది. ఈ సవాల్‌ను స్వీకరించే ధైర్యం మంత్రికి ఉందా?” అని సవాల్ విసిరారు. వైఎస్సార్సీపీ అభ్యర్థిగా నిలబెట్టాలని నిర్ణయించిన జిన్నా షరీఫ్ ఒక వ్యాపారవేత్త. పార్టీపై అభిమానంతో సేవా కార్యక్రమాలు చేసిన వ్యక్తి. ఆయన వ్యాపారాలను అడ్డుకుంటూ, దుకాణాలపై దాడులు చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నారు. పోలీసులు రక్షణ కల్పిస్తారని నమ్మకం లేక ప్రైవేట్ సెక్యూరిటీని ఏర్పాటు చేసుకుంటే దానిని హత్య కుట్రగా చిత్రీకరించి వైఎస్సార్సీపీ నేతలపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటు. నిజంగా కుట్ర జరిగిందని భావిస్తే ఆధారాలతో విచారణ కోరండి. ఆధారాలు లేకుండా వైఎస్సార్సీపీ నాయకుల పేర్లను ఇందులోకి లాగి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం హేయం. ఎన్నికల సమయంలో రాజకీయ ఆరోపణలు చేయడం కాదు, రాయచోటి ప్రజలకు మీరు ఏం చేశారో చెప్పండి. రాయచోటికి జిల్లా కేంద్రాన్ని తిరిగి తీసుకురావాలని ప్రజలు కోరుతుంటే దానిపై ఎందుకు సమాధానం చెప్పడం లేదు? మంత్రి హోదాలో మీకు నిజంగా పలుకుబడి ఉంటే జిల్లా కేంద్రాన్ని తిరిగి తీసుకురావడానికి కృషి చేయండి. స్టేడియాలు, రింగ్‌రోడ్లు, జిల్లా అభివృద్ధి వంటి అంశాలపై బహిరంగ చర్చకు మేం సిద్ధంగా ఉన్నాం. అభివృద్ధిపై చర్చించకుండా దాడులు, బెదిరింపులు, వ్యక్తిగత ఆరోపణలతో ప్రజల దృష్టిని మళ్లించడం మానుకోవాలి. ప్రజలకు ఉపయోగపడే పనులు చేసి మీ పాలనపై నమ్మకం కల్పించాలని శ్రీకాంత్ రెడ్డి హితవు పలికారు.

# శ్రీ కాళరాత్రి దేవి అలంకారంలో శ్రీ దుర్గమ్మ తల్లి

### - భక్తిశ్రద్ధలతో అభిషేకాలు, విశేష పూజలు

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక పట్టణంలోని సాయినగర్‌లో వెలసిన శ్రీ దుర్గమ్మ తల్లి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు శ్రీ దుర్గమ్మ తల్లి శ్రీ కాళరాత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ దుర్గమ్మ తల్లిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చినట్లు ఆలయ వ్యవస్థాపకుడు ఎం. రవికుమార్ రెడ్డి తెలిపారు. ఆలయ అర్చకులు శాకల్య విష్ణుశర్మ నేతృత్వంలో భక్తిశ్రద్ధలతో శ్రీ దుర్గమ్మ తల్లికి పంచామృత అభిషేకం, మంత్రపుష్పం, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రతిరోజూ ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండగా, సాయంత్రం పూలతో శ్రీ దుర్గమ్మ తల్లిని అలంకరించి పూజలు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో, పూలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

# కడప డి ఎం హెచ్ ఓ ఆఫీస్ అకస్మికతనికి డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ వెంకటరమణ

ప్రజా భూమి, కడప సిటీ:



శనివారం డైరెక్టర్‌ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ వెంకట రమణ కడపజిల్లా లోని డిఎం హెచ్ ఓ ఆఫీసును ఆకస్మిక తనిఖీ చేయటం జరిగింది ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ తో అత్యవసర సమావేశంఏర్పాటుచేశారు.జిల్లా వైద్యాధికారి డాక్టర్ యు గంధర్ జిల్లాలో జరుగుచున జరుగుజాతీయ కార్యక్రమాల గురించీ వివరించారు. డాక్టర్ వెంకట రమణ జిల్లాలో జరుగుచున్న ఆరోగ్య కార్య క్రమాల పురోగతి గురించీ సమీక్ష చేశారు.ప్రాథమిక ఆ రోగ్య కేంద్రాల వారీగా, పట్ట ణ ఆరోగ్య కేంద్రాలా వారీగా నివేదికలు పరిశీలివచ్చారు, జిల్లాలో జరుగుచున్న వ్యాది నిరోధక టీకాలు, హెచ్ పి వి టీకాలు,పాఠశాల ఆరోగ్య కార్యక్రమాలు, ఉచిత కంటి పరీక్షలు,జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పనితీరు గురిం చీ రివ్యూ చేసి కార్యక్రమాల పురోగతి పై సంతృప్తి వ్యక్తం చేశారు.తధనంతరం చింత కొమ్మ దిన్నె ప్రాథమిక ఆరో గ్య కేంద్రం తనీఖి చేసి ఆరో గ్య కార్యక్రమాల గురించీ ప రిశీలించారు.ఈ కార్యక్రమ ములో జిల్లా ప్రోగ్రామ్ అధిక రులు డాక్టర్ ప్రవీణ్ కుమార్ డాక్టర్ మహమ్మద్ తాహా, డాక్టర్ మాధవి లత,డాక్టర్ వెంకట చంద్రా రెడ్డి, డెమో భారతి, రమేష్ రెడ్డి డి ఎస్. ఓ. ప్రసన్నలత,డిప్యూటీ డెమో,తదితర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న తులసి రెడ్డి

### - భార్యాభర్తల బంధం అత్యంత పవిత్రమైనది

ప్రజాభూమి, పులివెందుల



స్థానిక పట్టణంలో శనివారం జరిగిన నిశ్చితార్థ వేడుకలో రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వేముల మండలం పెద్ద జూటూరు గ్రామానికి చెందిన తేజస్విని, అనంతపురం జిల్లా ఎల్లనూరు మండలం పాతపల్లి గ్రామానికి చెందిన మంజునాథ రెడ్డిల నిశ్చితార్థ వేడుక కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ, మానవ సంబంధాల్లో భార్యాభర్తల బంధం అత్యంత పవిత్రమైనదని పేర్కొన్నారు. వివాహం భార్యాభర్తల బంధానికి చట్టబద్ధతతోపాటు సామాజిక భద్రతను కల్పిస్తుందని అన్నారు. నూతన వధూవరులు పరస్పర అవగాహన, అనురాగంతో ఆదర్శ దంపతులుగా జీవిస్తూ సుఖసంతోషాలతో జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

# రాజవొమ్మంగి జడ్పీటీసీ బరిలో సీపీఎం నుంచి లోతా రామారావు?

### ప్రజా ఉద్యమాల నేపథ్యం ఉన్న నేత పేరు తెరపైకి.. అభ్యర్థిత్వంపై ఉత్కంఠ

రాజవొమ్మంగి, ప్రజా భూమి:



రాజవొమ్మంగి మండల జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై చర్చ మొదలైంది. ఈ క్రమంలో సీపీఎం పార్టీ తరఫున లోతా రామారావు బరిలోకి దిగే అవకాశం ఉందన్న సమాచారం స్థానికంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రజా సమ స్యలపై పోరాటాలు నిర్వహించే నాయకుడిగా పేరున్న లోతా రామారావు అభ్యర్థిత్వంపై చర్చ జరుగుతున్నప్పటికీ, ఆయన పోటీపై ఇంకా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. సీపీఎం పార్టీ నిర్ణయం వెలువడితేనే ఈ అంశంపై పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి వివిధ పార్టీల అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో, సీపీఎం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# అడ్డతీగలలో పీఎం సూర్య ఘర్ పథకంపై సేవా సేతు శిబిరం

### సౌర విద్యుత్ వినియోగంపై ప్రజలకు అవగాహన




ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల ప్రజల్లో సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్: ముఫ్త్ బిజ్లీ యోజన పథకం ప్రయోజనాలను అందరికీ చేరువ చేయాలనే లక్ష్యంతో శనివారం అడ్డతీగల విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో సేవా సేతు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో గృహ విద్యుత్ వినియోగదారులకు ఇంటి పైకప్పులపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటు, కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ, అర్హత ప్రమాణాలు, దరఖాస్తు విధానం, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై అధికారులు వివరించారు. అర్హులైన వినియోగదారులకు సోలార్ నమోదు సౌకర్యాన్ని కూడా కల్పించారు.కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, సోలార్ వెండర్లు సౌర విద్యుత్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ బి. వేణుగోపాలకృష్ణ, ఏఈ పి. సుదర్శన్‌తో పాటు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# నాయకులు,కార్యకర్తల ధైర్యానికి సలాం కొట్టిన ఎంపీ అవినాష్ రెడ్డి - ప్రాణాలకు తెగించి పోరాడారు

### నామినేషన్ అడ్డుకోవడం దుర్మార్గం - అధికార పక్ష మోచేతి నీళ్లు తాగుతున్న పోలీసులు

### టియర్ గ్యాస్, ఏకే-47 కాల్పుల్లో కార్యకర్తలకు గాయాలు - మాజీ చైర్మన్ హాఫీజ్ బొటనవేలు తెగిపోయింది

ప్రజాభూమి, పులివెందుల



స్థానిక ఎన్నికల నామినేషన్ ప్రక్రియను అడ్డుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో దుర్మార్గమైన చర్య అని, అధికార పక్ష నేతల మోచేతి నీళ్లు తాగుతూ పోలీసు బలగాలు పబ్బం గడుపుకుంటున్నాయని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. శనివారం పులివెందుల లోని వైఎస్ జగన్ ఆడిటోరియంలో నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఇంతటి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పటికీ ప్రాణాలకు తెగించి పోరాడిన వైకాపా నాయకులు, కార్యకర్తల మనోధైర్యానికి శిరస్సు వంచి వందనాలు తెలుపుతున్నానని అన్నారు.సాధారణంగా అధికార పక్షానికి వంత పాడే పోలీసు వ్యవస్థను చూశాను కానీ, మరీ దుర్మార్గంగా అధికార పక్ష నేతల మోచేతి నీళ్లు తాగే పోలీసు వ్యవస్థను నేడు పులివెందులలో చూస్తున్నానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 1:30 గంటలకు వైకాపా శ్రేణుల నామినేషన్లకు అనుమతి ఇస్తామని చెప్పిన పోలీసులు, అధికార పక్ష నేతల ఆలోచనలను అమలు చేస్తూ వైకాపా నేతలను నామినేషన్ ప్రక్రియకు అనుమతించకపోగా అడ్డుకునే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. రెండు గంటల పాటు నెలకొన్న ఉద్రిక్తతలో పోలీసులు ఏకే-47 తో కాల్పులు, టియర్ గ్యాస్ ప్రయోగించడం వల్ల కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. మాజీ వైస్ చైర్మన్ హాఫీజ్ బొటన వేలు తెగిపోవడం, మరొక కార్యకర్త కాలిలోకి బుల్లెట్ దూసుకుపోవడం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ పోలీసుల బలప్రయోగాలు ఆగలేదని, మూడు గంటల లోపు రావాల్సిన జిల్లా ఎస్పీ 3:30 గంటలకు వచ్చి ఆదివారం నామినేషన్లకు అనుమతి ఇస్తామనడం ఏ మేరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి పరిస్థితులకు తావులేదని, వీటన్నింటినీ ఎన్నికల కమిషన్ పరిగణలోకి తీసుకుని పరిస్థితులను చక్కదిద్దాలని, లేని పక్షంలో ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోతుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ మనోహర్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి తదితర వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పులివెందులలో టీడీపీ ఆగడాలు - వైకాపా నేత చెరుకు రసం దుకాణానికి నిప్పు

### రెండుచెరుకు రసం యంత్రాలు, రెండు బైకులు దగ్ధం - రూ.5 లక్షల ఆస్తి నష్టం

### బాధితుడికి భరోసా ఇచ్చిన ఎంపీ అవినాష్ రెడ్డి - నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాభూమి, పులివెందుల



**మితిమీరిన టీడీపీ నేతల ఆగడాలు - బాధితుడిని పరామర్శించిన ఎంపీ**



పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డులో దారుణం చోటుచేసుకుం ది. వైకాపా నాయకుడికి చెందిన రాఘవేంద్ర చెరుకు రసం దుకాణానికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఈ ఘటనలో దుకాణంలో ఉన్న రెండు చెరుకు రసం యంత్రాలు, సమీపంలో పార్క్ చేసి ఉన్న రెండు ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. బాధితుడు సుమన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, రాఘవేంద్ర చికెన్ సెంటర్ పక్కన ఉన్న తన చెరుకు రసం దుకాణంలోకి అర్ధరాత్రి కొందరు వ్యక్తులు ప్రవేశించి పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. ఈ ఘటనలో దాదాపు రూ. 5 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని ఆయన తెలిపారు. ఈ దుశ్చర్యకు పాల్పడింది తెలుగుదేశం పార్టీ నాయకులేనని బాధితుడు ఆరోపించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ మురళీ నాయక్, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈ ఘటనపై సమాచారం అందుకున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జులు వైఎస్ మనోహర్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి బాధితుడిని పరామర్శించారు. అనంతరం ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి చెందిన అక్కులగారి విజయ్ కుమార్ రెడ్డి, మహబూబ్ బాషా, షామీర్ అనుచరులు అర్ధరాత్రి పెట్రోల్ పోసి నిప్పు పెట్టారని ఆరోపించారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని టీడీపీ నాయకులు ఇలాంటి ఆగడాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ మొత్తం వ్యవహారం సీసీటీవీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డయిందని, ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందడం కోసమే వైఎస్సార్సీపీ కార్యకర్తలను, అభిమానులను భయభ్రాంతులకు గురి చేసేందుకు ఇలాంటి పిరికిపంద చర్యలకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పుంగనూరు, రాయచోటిలో జరిగిన సంఘటనలతో పాటు, ఎంపీ మిథున్ రెడ్డిపై జరిగిన దాడిని ప్రస్తావిస్తూ అధికార పార్టీ నేతలు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని అన్నారు. ఈ దుశ్చర్యపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామని, నిందితులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా ఎన్నికల సంఘం, పోలీసు యంత్రాంగం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. అధైర్యపడవద్దని, పార్టీ అండగా ఉంటుందని బాధితుడికి భరోసా ఇచ్చారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

### హెల్మెట్ తప్పనిసరి.. రోడ్లపై పశువులను వదిలినా చర్యలు తప్పవు

రాజవొమ్మంగి, ప్రజాభూమి:



రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ షరీఫ్ సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై మోటారు వాహన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారుల భద్రతతోపాటు రహదారులపై పశువుల సంచారంతో తలెత్తుతున్న ప్రమాదాలను నివారించేందుకు ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణించాలని ఎస్ఐ స్పష్టం చేశారు. సరైన వాహన పత్రాలు లేని వారు, నంబరు పలకలు లేకుండా వాహనాలు నడిపేవారు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ప్రయాణించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.
రోడ్లపై పశువులను వదిలితే చర్యలు-గ్రామాల్లో కొందరు పశువులను రహదారులపై విచ్చలవిడిగా వదిలేస్తుండటంతో రాత్రివేళల్లో వాహనదారులకు ప్రమాదాలు ఎదురవుతున్నాయని ఎస్ఐ పేర్కొన్నారు. చీకట్లో పశువులు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందన్నారు. ఇకపై రహదారులపై పశువులను వదిలే యజమానుల పశువులను స్వాధీనం చేసుకుని గోశాలకు తరలించడంతోపాటు, సంబంధిత యజమానులపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు నిబంధనలు పాటించడం, పశువుల యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని ఎస్ఐ షరీఫ్ తెలిపారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఆయన కోరారు.

# రాజవొమ్మంగి జీసీసీకి కొత్త వాహనం

### ఎండీ ఆదేశాలతో మంజూరు.. విజయలక్ష్మి చేతుల మీదుగా ప్రారంభం

రాజవొమ్మంగి,
రాజవొమ్మంగి,



రాజవొమ్మంగి గిరిజన సహకార సంస్థకు (జీసీసీ) కొత్త వాహనం సమకూరింది. ఆశ్రమ పాఠశాలలకు బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల రవాణాలో ఎదురవుతున్న ఇబ్బందులకు పరిష్కారంగా ఈ వాహనాన్ని కేటాయించారు. జీసీసీ ఎండీ ఆదేశాల మేరకు మం జూరైన వాహనాన్ని ఈ నెల 15న రంపచోడవరం డివిజన్ మేనేజర్ విజయలక్ష్మి ప్రారంభించినట్లు తెలిపారు.పాత వాహనం పరిస్థితి దెబ్బతినడంతో సరుకుల తరలింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త వాహనం అవసరాన్ని గుర్తించిన ఉన్నతాధికారులు మంజూరుకు చర్యలు చేపట్టారు. ఎండీ ఆదేశాలను అమలు చేస్తూ డివిజన్ మేనేజర్ విజయలక్ష్మి వాహనం అందుబాటులోకి తీసుకురావడంలో ప్రత్యేక చొరవ చూపారు. కొత్త వాహనం అందుబాటులోకి రావడంతో ఆశ్రమ పాఠశాలలకు అవసరమైన సరుకులను సకాలంలో చేరవేసేందుకు వీలుకానుంది. ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లో సరుకుల సరఫరా మరింత సులభతరం కానుంది. రవాణా సమస్యల కారణంగా ఎదురయ్యే జాప్యాన్ని తగ్గించేందుకు ఈ వాహనం దోహదపడనుంది. గిరిజన విద్యార్థులకు అవసరమైన నిత్యావసర సరుకుల సరఫరాలో రవాణా వ్యవస్థ కీలకంగా ఉండటంతో, కొత్త వాహనం అందుబాటులోకి రావడం జీసీసీ కార్యకలాపాలకు ఉపయోగకరంగా మారనుంది.

# ఎస్ఐ ని మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ నాయకులు

ప్రజా భూమి ప్రతినిధి కూనవరం...



మండల నూతన ఎస్ఐ గా బాధ్యతలు చేపట్టిన వెంకట్రావు ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు ఎడవల్లి భాస్కరరావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు పూల బొకే ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షులు ఎడవల్లి భాస్కరరావు మాట్లాడుతూ, మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు తమ పార్టీ తరఫున పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. పోలీసు శాఖకు ప్రజల నుండి పూర్తి మద్దతు అందేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ముఖ్య నాయకులు, చెలికాని ఉమహేశ్వరరావు పోడియం అప్పారావు శ్రీమంతుల సతీష్, బాలు, రాంబాబు, పారి సోమయ్య క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిలు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం జిల్లా జడ్పీ పీఠం ఎవరికి?

## స్థానిక ఎన్నికల్లో మూడు పార్టీల మధ్య హోరాహోరీ పోరు.. కూటమిలో ఆశావహులెందరో!




ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల

పోలవరం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతు న్నాయి. జడ్పీ పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా అధికార కూటమి, వైఎస్సార్‌సీపీ తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. మరోవైపు సీపీఎం కూడా స్థానిక ఎన్నికల్లో తన బలాన్ని నిరూపించుకునేందుకు సిద్ధమవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

**గత విజయాలే వైఎస్సార్‌సీపీకి ధీమానా?**

గత రెండు పర్యాయాల స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏజెన్సీ ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుందని ఆ పార్టీ నాయకులు గుర్తు చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి ఎదురైనా, తమ పార్టీకి ప్రజాదరణ తగ్గలేదని వైఎస్సార్‌సీపీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే స్థానిక ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను బరిలోకి దింపాలని ఆ పార్టీ భావిస్తున్నట్లు సమాచారం.

**కూటమిలో జడ్పీ పీఠం కోసం పోటీ!**

నూతన పోలవరం జిల్లా ఏర్పాటుతో జడ్పీ చైర్మన్ పదవిపై రాజకీయ పార్టీల్లో ఆసక్తి పెరిగింది. తెలుగుదేశం, జనసేన, బీజేపీలకు చెందిన పలువు రు నాయకులు ఈ పదవిని ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కూటమిలో భాగస్వామ్య పార్టీలకు సీట్ల కేటాయింపు, జడ్పీ చైర్మన్ పదవిని ఏ పార్టీకి కేటాయిస్తారనే అంశాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో సీట్ల సర్దుబాటు కూటమి నాయకత్వానికి సవాలుగా మారే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ గట్టి పోటీ ఇవ్వగల అభ్యర్థులను ఎంపిక చేసే దిశగా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

**కూటమి అభ్యర్థులకు సవాలేనా?**

ప్రభుత్వంలో లేకపోయినా తమకు ప్రజాదరణ ఉందని వైఎస్సార్‌సీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే కూటమి పార్టీలు సమన్వయంతో అభ్యర్థులను ఎంపిక చేసి, ఎన్నికల బరిలో ఎంతవరకు పైచేయి సాధిస్తాయన్నది ఆసక్తి కరంగా మారింది.మొత్తంగా పోలవరం జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీ పీఠం ఎవరిని వరిస్తుంది? కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకం ఎలా ఉంటుంది? వైఎస్సార్‌సీపీ గత ఎన్నికల ఫలితాల ప్రభావాన్ని తిరిగి చూపగల దా? అన్న ప్రశ్నలకు ఎన్నికల ఫలితాలే సమాధానం చెప్పనున్నాయి.

## దోమతెరల పంపిణీ.. వ్యాధుల నివారణపై అవగాహన




ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల

జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా అడ్డతీగల మండలంలోని గ వ ర య్యపేట , డబ్బపాలెం గ్రామాల్లో శనివారం దోమతెరలను పంపిణీ చేశారు. ఎల్లవరం, దుప్పులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.వైద్యాధికారులు డాక్టర్ హేమ వెంకట రవికుమార్, డాక్టర్ శివారెడ్డి, పీహెచ్ఎన్ సత్యవతి, సీహెచ్ఓ పోశమ్మ పర్యవేక్షణలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి కె. లక్ష్మణరావు, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ పి. శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో దోమతెరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మలేరియా, డెంగ్యూ తదితర దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాధుల లక్షణాలు కనిపించినప్పుడు రక్త పరీక్షలు చేయించుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, దోమల వృద్ధిని అరికట్టేందుకు అవసరమైన నివారణ చర్యలు చేపట్టడం వంటి అంశాలను వివరించారు. దోమతెరల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేస్తూ, పంపిణీ చేసిన దోమతెరలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అపర్ణ, ఎంపీహెచ్ఏలు సత్యనారాయణ, అప్పల స్వామి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ జిల్లా ఎన్నికల కమిటీ ఏర్పాటు

**స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికకు సమన్వయం**





ANDHRA PRADESH CONGRESS COMMITTEE
ANDHRA RATNA BHAVAN, VIJAYAWADA - 520 002.

Date: 16-10-2026

Sub: Constitution of District Election Committee (DEC) - Alluri Sitarama Raju District - Regarding.

As per the resolutions adopted by the Political Affairs Committee (PAC) and under the directions of the APCC President, Smt. Y.S. Sharmila Reddy ji, the following leaders are hereby appointed as members of the District Election Committee (DEC) for **Alluri Sitarama Raju** District to coordinate the selection of party candidates for the ensuing local body elections under the "Select and Elect" process.

| S.No | District | Name | Designation | Party Designation |
|---|---|---|---|---|
| 1 | Alluri Sitaramaraju | Shri Sataka Bullibabu | DEC Chairman | DCC President |
| 2 | Alluri Sitaramaraju | Dr Chinta Mohan | DEC Member | PAC Member |
| 3 | Alluri Sitaramaraju | Smt. KR Lakshmi | DEC Member | District Incharge |
| 4 | Alluri Sitaramaraju | Shri Setti Gangadhara Swamy | DEC Member | Assembly Coordinator |
| 5 | Alluri Sitaramaraju | Smt. Pallala Ramalakshmi | DEC Member | Assembly Coordinator |
| 6 | Alluri Sitaramaraju | Smt. P Santha Kumari | DEC Member | PCC General Secretary |
| 7 | Alluri Sitaramaraju | Shri Reemla Nava Bharat | DEC Member | ST Dept. Chairman |
| 8 | Alluri Sitaramaraju | Shri Kankipati Veeranna Padal | DEC Member | Ex-PCC Spokesperson |
| 9 | Alluri Sitaramaraju | Smt. Nogeli Chandrakala | DEC Member | District Coordination Committee |
| 10 | Alluri Sitaramaraju | Shri Buridi David | DEC Member | RGPRS Coordinator |
| 11 | Alluri Sitaramaraju | Shri Andimeni Neela Krishna | DEC Member | VR Puram President |
| 12 | Alluri Sitaramaraju | Shri Nakka Venkanna | DEC Member | Yetapaka Mandal President |

The Committee shall carry out its responsibilities in accordance with the PAC resolutions and APCC guidelines and ensure a systematic, transparent and consensus-based candidate selection process.

All appointed members are requested to commence their work immediately.

Kolanukonda Shivaji
Vice President (I/c. Administration)
Andhra Pradesh Congress Committee (APCC)

Copy to :

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం:

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అల్లూరి సీతారామరాజు జిల్లా, పోలవరం (కొత్త జిల్లా) కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎన్నికల కమిటీని ఏర్పాటు చేసినట్లు వీఆర్ పురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అండిమేని లీలా కృష్ణ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఏపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) తీర్మానాల మేరకు, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆదేశాల ప్రకారం ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల కమిటీ చైర్మన్‌గా డీసీసీ అధ్యక్షుడు సతక బుల్లిబాబును నియమించారు. కమిటీ సభ్యులుగా డాక్టర్ చింతా మోహన్, కేఆర్ లక్ష్మి, సెట్టి గంగాధర స్వామి, పల్లాల రమాలక్ష్మి, పి. సంతకుమారి, రీమ్లా నవ్యభారత్, కంకిపాటి వీరన్న పడాల్, నోగెలి చంద్రకళ, బురిడి డేవిడ్, అండిమేని లీలా కృష్ణ నాగేంద్రప్రసాద్, నక్కా వెంకన్న యాదవ్, మహమ్మద్ హబీబ్‌లను నియమించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను సమన్వయం చేయడం, పారదర్శకంగా అభ్యర్థుల ఎంపిక చేపట్టడం, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం కమిటీ ప్రధాన లక్ష్యాలుగా పేర్కొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, పార్టీ విజయానికి కృషి చేయాలని కమిటీ సభ్యులకు బాధ్యతలు అప్పగించినట్లు వీఆర్ పురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.

## అడ్డతీగల జడ్పీటీసీ బరిలో వంతల రాజేశ్వరి?

**జడ్పీ చైర్మన్ పదవి మహిళకు కేటాయింపుతో పెరిగిన రాజకీయ ఆసక్తి**



ప్రజా భూమి ప్రతినిధి అడ్డతీగల

పోలవరం జిల్లా జడ్పీ చైర్మన్ పదవి మహిళకు కేటాయించడంతో జిల్లాలో రాజకీయ సమీకరణాలపై ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి కూటమి అభ్యర్థిగా జడ్పీటీసీ ఎన్నికల బరిలోకి దిగే అవకాశాలున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆమె తన సొంత మండలమైన అడ్డతీగల నుంచే పోటీ చేసే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం.రాజేశ్వరి అడ్డతీగల నుంచి జడ్పీటీసీగా పోటీ చేస్తే, ఆమె గెలుపొందిన పక్షంలో జిల్లా జడ్పీ చైర్మన్ పదవికి ఎంపికయ్యే అవకాశాలపై చర్చ సాగుతోంది. దీంతో అడ్డతీగల మండల రాజకీయాల్లో జడ్పీటీసీ ఎన్నికల అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఆమె పోటీపై కూటమి నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. అభ్యర్థుల ఎంపిక, పార్టీ నిర్ణయాలపై స్పష్టత వచ్చిన తర్వాతే ఎన్నికల బరిలో ఎవరు నిలుస్తారనేది తేలనుంది.

## దసరా ఉత్సవాల్లో మహాలక్ష్మి అలంకారంలో దుర్గమ్మ







ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం:

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు శనివారం అమ్మవారు శ్రీ మహా లక్ష్మి దేవి అలంకారం లో భక్తులకు దర్శన మిచ్చారు. ఈ సందర్భంగా వి.ఆర్.పురం మండలంలోని వడ్డీగూడెం, వి.ఆర్.పురం గ్రామాల్లో దుర్గమ్మ ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. దుర్గమ్మ ఆలయా ల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో ఆలయ నిర్వాహకులు, భక్తుల ఆధ్వర్యంలో అమ్మ వారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆల యాలకు చేరుకున్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో కుంకుమ పూజల్లో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ, పూలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహాలక్ష్మి దేవి అలంకారంలో కొలువుదీరిన దుర్గమ్మను దర్శించుకునేందుకు పరిసర గ్రామాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. అమ్మవారి దర్శనం అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. దసరా నవరా త్రుల్లో అమ్మవారి అనుగ్రహంతో కుటుంబాల్లో సుఖ సంతో షాలు, సిరిసంపదలు కలగాలని భక్తులు ఆకాంక్షించారు. నవరా త్రి ఉత్సవాలను పురస్కరించు కుని ఆలయాల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపా రు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

## అడ్డతీగల మండల ఎన్నికలకు రిటర్నింగ్ అధికారిగా డి. నాగ వెంకట రమణ



ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల

అడ్డతీగల మండల ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు రిటర్నింగ్ అధికారిగా ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి డి. నాగ వెంకట రమణను నియమించినట్లు ఎంపీడీవో తెలిపారు.జిల్లా కలెక్టర్ పోలవరం ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

## భక్తి పారవశ్యంలో చిన్నగార్లపాడు కనకదుర్గమ్మకు వైభవంగా పడిపూజ

**గురుభవాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు**



ప్రజా భూమి ప్రతినిధి గంగవరం:

పోలవరం జిల్లా గంగవరం మండలం చిన్నగార్లపాడు గ్రామంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి మూలా నక్షత్రం సందర్భంగా శుక్రవారం భక్తి పారవశ్యం వెల్లివిరిసింది గురుభవాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవా రికి వైభవంగా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు అమ్మవారి నామస్మరణలు భక్తుల పూజలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది ఈ సందర్భంగా భవానీ దీక్షలు చేపట్టిన భవానీలు అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు గ్రామ పెద్దలు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కనకదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించి అమ్మవారి ఆశీస్సులు పొందారు భక్తుల సమక్షంలో పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో వైభవంగా సాగింది





## అనిగేరులో వైభవంగా శ్రీ వనదుర్గాదేవి అమ్మవారి ద్వితీయ మహోత్సవాలు

**భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ.. అగ్నిగుండం తొక్కిన భవానీ మాలధారులు**

ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల

అడ్డతీగల మండలం అనిగేరు గ్రామంలో శ్రీ వనదుర్గాదేవి అమ్మవారి ద్వితీయ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. అనిగేరు గ్రామ స్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు హాజరై పూజా కార్య క్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచే భక్తులు ఉపవాస దీక్షలు, నియమనిష్టలతో బోనాలను సిద్ధం చేసు కున్నారు. డప్పు వాయిద్యాలు, మంగళవాయిద్యాలు, అమ్మవారి నామస్మరణల మధ్య బోనాల శోభాయాత్ర అడ్డతీగల పురవీధుల గుండా సాగింది. అనంతరం బోనాలను అనిగేరు గ్రామానికి తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు.మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి 7 గంటలకు ఆలయ ప్రాంగణంలో అగ్నిగుండం కార్యక్రమాన్ని నిర్వహించారు. భవానీ మాలధారులు, గ్రామస్తులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉపవాస దీక్షలతో అమ్మవారిని స్మరిస్తూ అగ్నిగుండం తొక్కారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## గిరిజనుల భూమికి న్యాయం చేయాలి



ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల

అడ్డతీగల మండలం గోండోలు గ్రామంలో భూమి వివాదంపై నిజ నిర్ధారణ కమిటీ శనివారం పర్య టించింది. విందుగుపల్లి గంగరాజు, విమలమ్మలకు చెందిన భూమిని స్థానికేతర గిరిజనేతరులు తమదంటూ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోప ణల నేపథ్యంలో కమిటీ సభ్యులు గ్రామాన్ని సందర్శించి, వివాదాస్పద భూమిని పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడిన కమిటీ సభ్యులు భూమికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల కథనం ప్రకారం, సదరు భూమి గంగరాజు, విమలమ్మలకు చెందినదని, దీనిపై స్థానికేతర గిరిజనేతరులకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. గతంలో నిర్వహించిన గ్రామసభలో కూడా గ్రామ స్తులంతా ఇదే విషయాన్ని వెల్లడిస్తూ, సంతకాలతో కూడిన తీర్మాన ప్రతులను గ్రామసభ నిర్వహించిన వీఆర్వోకు అందజేసినట్లు పేర్కొన్నారు.అనంతరం అడ్డతీగల మండల రెవెన్యూ కార్యాల యంలో వీఆర్వోను కలిసి వివరాలు తెలుసుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామస్తులు ఇచ్చిన వాంగ్మూలాలు వాస్తవమని, భూమి సరిహద్దు రైతులను విచారించగా వారు కూడా ఆ భూమి గంగరాజు, విమలమ్మలకు చెందినదేనని తెలి పా రని వీఆర్వో తన నివేదికలో తహసీల్దార్‌కు సమర్పించినట్లు వెల్లడించారు.తహసీల్దార్ కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్‌ను కలిసి మాట్లాడినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



గ్రామసభకు సంబంధించిన నివేదికలను త్వరలో పోలవరం జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని రెవెన్యూ అధికారులు తమకు తెలిపినట్లు పేర్కొన్నారు.గంగరాజు, విమలమ్మలకు న్యాయం జరిగేలా, వివాదాస్పద భూమిని వారికి అప్పగిం చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ త్వరలో జిల్లా కలెక్టర్‌ను కలిసి నివేదిక అందజేస్తామని నిజ నిర్ధార ణ కమిటీ సభ్యులు వెల్లడించారు.ఈ పర్యటనలో హ్యూమన్ రైట్స్ వాచ్ డైరెక్టర్ బాలు, అఖిల భారత మాల మహాసభ కన్వీనర్ మాదే రామచంద్రరావు, లాస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, ప్రముఖ న్యా యవాది మర్రి బాబ్జి, అడ్వకేట్ పట్టెం మోహన్‌తో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## సోలార్ ప్యానెల్ అమర్చుకోండి .. విద్యుత్ బిల్లులు తగ్గించుకోండి

**పోలవరం జిల్లా కలెక్టర్**



ప్రజాభూమి ప్రతినిధి, రంపచోడవరం

పోలవరం జిల్లాలో ప్రజలు సూర్య ఘర్ ద్వారా ప్రతి ఇంటిలో సోలార్ ఫ్యానల్ సెట్స్ ఏర్పాటు చేయడమే సేవా సేతు అభియాన్ లక్ష్యమని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్, జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ కె. చక్రవర్తి,జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్,ఓ ఎస్ డి జావలి,సబ్ కలెక్టర్లు పృథ్వి రాజ్ కుమార్,నరేంద్ర పడల్, డీఎస్పీ అస్రఫ్ ఆలీ కలిసి సేవా సేతు అభియాన్, పీఎం సూర్య ఘర్ - ముఫ్త్ బిజ్లీ యోజన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ, పీఎం సూర్య ఘర్ - ముఫ్త్ బిజ్లీ యోజన ద్వారా ఇళ్లపై సౌర విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటును ప్రోత్సహిస్తూ, అర్హులైన కుటుంబాలకు ఈ పథకం ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

సౌర విద్యుత్ వినియోగం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవడంతో పాటు, పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా ప్రజలను ప్రోత్సహించాలని అయన పేర్కొన్నారు.సేవా సేతు అభియాన్ ద్వారా మరింత చేరువ చేయాలని, అర్హులైన లబ్ధిదారులు వివిధ సూర్య ఘర్ సోలార్ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రతి ఇంటిలో సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకున్న ఎడల నిరంతరం కరెంటు ఉంటుందని ఆయన తెలిపారు అదేవిధంగా ప్రతి ఇంటిలో సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఈపీడీసీఎల్ ఈ ఈ అచ్చుతారావు, డిపిఒ జీ. భాస్కరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్ ,వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
జనరల్ 12
ఆదివారం 18 అక్టోబరు 2026

# నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

-ప్రధాన కూడళ్లలో పోలీసుల ప్రత్యేక నిఘా -డ్రోన్లతో నిరంతర పర్యవేక్షణ

ప్రజాభూమి, హిందూపురం టౌన్

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా హిందూపురం పట్టణంలో పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు హిందూపురం డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కార్యాలయంతో పాటు రహమత్ పురం సర్కిల్, ధర్మపురం సర్కిల్ తదితర ప్రధాన కూడళ్లలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. నామినేషన్ల దాఖలు సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు, వారి అనుచరుల రాకపోకలను దృష్టిలో ఉంచుకొని పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు




వచ్చే అభ్యర్థులను పోలీసు అధికారులు, సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం కేంద్రాల్లోకి అనుమతిస్తున్నారు. కేంద్రాల పరిసరాల్లో అనవసరంగా గుమిగూడకుండా చర్యలు చేపడుతూ, అభ్యర్థులతో పాటు వారి వెంట వచ్చే వ్యక్తుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మున్సిపల్ నామినేషన్ కేంద్రాల వద్ద డ్రోన్ కెమెరాల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సున్నితమైన ప్రాంతాలపై దృష్టి సారిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు అధికారులు భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ ప్రత్యేక బందోబస్తులో పట్టణ సీఐలు ప్రసాద్ బాబు, అబ్దుల్ కరీం, రూరల్ సీఐలు జనార్దన్, ఆంజనేయులు తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా విధులు నిర్వహించాలని పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. అన్ని మున్సిపాలిటీల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగేందుకు జిల్లా పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు కొనసాగిస్తోంది.

# 22 లోపు స్మార్ట్ కిచెన్ల విస్తరణ పనులు పూర్తి చేయాలి..!

ఒక లక్ష మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేలా సిద్ధం అవ్వాలి - జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశం

ప్రజాభూమి, కడప కలెక్టరేట్

జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించేందుకు చేపట్టిన స్మార్ట్ కిచెన్ల విస్తరణకు సంబంధించి పెండింగ్‌బి పనులన్నింటినీ ఈ నెల 22వ తేదీలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సం బంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో సంబంధిత శాఖల అధికారులతో పాటు ఆయా మండలాల ఎంఈవోలతో వీసీ ద్వారా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో స్మార్ట్ కిచెన్ల నిర్వహణ, పాఠశాలల అనుసంధానం, ఆహార సరఫరా మార్గాలు, మౌలిక సదుపాయాలు, ఇతర పెండింగ్ పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ప్రతి విద్యార్థికి నిర్ణీత సమయానికి వేడివేడి ఆహారం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ నెల 22వ తేదీ లోపు జిల్లా వ్యాప్తంగా 38 స్మార్ట్ కిచెన్ల ద్వారా లక్ష మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేలా చర్యలు వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో ఇంకా స్మార్ట్ కిచెన్ల పరిధిలోకి తీసుకురావాల్సిన 369 పాఠశాలలకు



అనుసంధాన ప్రక్రియ, రవాణా మార్గాల గుర్తింపును వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆహార సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్న పాఠశాలలకు సంబంధించి రవాణా సమయాలను పునఃపరిశీలించి, సరఫరా సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. స్మార్ట్ కిచెన్లలో వాహనాల స్టాండింగ్ షెడ్లు, వాహనాల నిలుపుదల వేదికలు, రక్షణ కంచెల నిర్మాణం వంటి పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా, విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కేంద్రాలు, శుద్ధి చేసిన తాగునీటి వ్యవస్థలు, బోరుబావులు, నీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వంటశాలల్లో ఏర్పాటు చేసిన బయో వ్యర్థాల శుద్ధి పరికరాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలన్నారు. వంటశాలలకు అవసరమైన కూరగాయలు, ఇతర వంట సరుకులను ముందస్తు ప్రణాళికతో సేకరించేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సమీప కొనుగోలు కేంద్రాలను గుర్తించాలని సూచించారు. విద్యార్థుల నమోదు సంఖ్య తక్కువగా ఉన్న 13 ప్రాధాన్య ప్రాంతాల్లో వంటశాలల అవసరాలకు అనుగుణంగా కూరగాయల తోటలను ఏర్పాటు చేయాలన్నారు. మండలాల వారీగా ఖాళీలను పరిశీలించి అర్హులైన పాఠశాల వంట సహాయకులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విబిజీ రామ్ జీ, ఉద్యాన శాఖ, ఏపీఎంఐపి శాఖల సమన్వయంతో.. ఆయా పాఠశాలల పరిధిలో న్యూట్రీ కిచెన్ గార్డెన్స్ ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేపట్టాలన్నారు. జిల్లాలోని మొత్తం 38 స్మార్ట్ కిచెన్లలో ఆహార నాణ్యత, వంటశాలల పరిశుభ్రత, పరిసరాల శుభ్రత విషయంలో రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి, నిర్దేశించిన గడువులోగా అన్ని పనులు పూర్తి చేసి విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డీఈవో శంశుద్దీన్, ఎస్ఎస్ఏ ఏపిసి అనురాధ, స్మార్ట్ కిచెన్ల నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, డిఆర్డీఏ పీడి రాజ్యలక్ష్మి, పంచాయతీరాజ్ ఎస్ఈ మద్దన్న, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాసులు, ఏపీ సీఎన్ఎఫ్ డిపిఎం ప్రవీణ్ కుమార్, సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులు, పౌర సరఫరాలు, రవాణా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మందకొడిగా నామినేషన్ల పర్వం - రెండో రోజు 66 నామినేషన్లు

-నేటితో ముగియనున్న గడువు -నామినేషన్ల సరళిని పరిశీలించిన సబ్ కలెక్టర్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పురపాలక సంఘ ఎన్నికల్లో నామినేషన్ల పర్వం రెండో రోజు శనివారం మందకొడిగా సాగింది. మొత్తం 52 వార్డులతో పాటు చైర్మన్ స్థానానికి జరగనున్న ఎన్నికల్లో భాగంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల స్వీకరణకు ఆదివారం చివరి రోజు కావడంతో పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పెనుకొండ సబ్ కలెక్టర్ ఆనంద్ కుమార్ పరిశీలించి, ఎన్నికల అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. చైర్మన్ పదవికి అధికార తెలుగుదేశం పార్టీ తరఫున పురిడి మంజునాథ్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. ఎంజీఎం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లో ఆయన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకుడు బండారు బాలాజీతో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పలువురు నాయకులు ఉన్నారు. చైర్మన్ అభ్యర్థిగా మంజునాథ్ నామినేషన్ వేయడంతో అధికార పార్టీ తరఫున ఎన్నికల ప్రక్రియలో సందడి మొదలైంది. ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర పార్టీల నుంచి చైర్మన్ పదవికి ఎవరు నామినేషన్లు దాఖలు





చేస్తారన్న అంశంపై ఆసక్తి నెలకొంది. వార్డు కౌన్సిలర్ స్థానాలకు తెలుగుదేశం పార్టీ నుంచి 32, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 21, జనసేన పార్టీ నుంచి ఐదు, భారతీయ జనతా పార్టీ నుంచి నాలుగు, కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకటి, బహుజన్ సమాజ్ పార్టీ నుంచి ఒకటి, స్వతంత్ర అభ్యర్థులుగా ముగ్గురు నామినేషన్లు దాఖలు చేసినట్లు మున్సిపల్ ఎన్నికల అధికారి మల్లికార్జున వివరించారు. వార్డుల వారీగా నామినేషన్ల దాఖలు వివరాలు, ఎన్నికల ఏర్పాట్లపై అధికారులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. పెనుకొండ సబ్ కలెక్టర్ ఆనంద్ కుమార్ శనివారం నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ జరుగుతున్న తీరును పరిశీలించి, ఎన్నికల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ప్రతి వార్డుకు ఎన్ని నామినేషన్లు దాఖలయ్యాయి, వివిధ రాజకీయ పార్టీల నుంచి ఎంతమంది అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు, నామినేషన్ల స్వీకరణకు చేపట్టిన ఏర్పాట్లు ఎలా ఉన్నాయనే అంశాలపై ఆరా తీశారు. చివరి రోజు అభ్యర్థుల రాక పెరిగే అవకాశం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని, నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఎన్నికల ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఈ పరిశీలనలో మున్సిపల్ ఎన్నికల అధికారి మల్లికార్జున, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు. హిందూపురం పురపాలక సంఘంలో వార్డుల సంఖ్య 38 నుంచి 52కు పెరగడంతో ఈసారి ఎన్నికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రతి వార్డులోనూ పోటీ చేసేందుకు ఆశావహులు సిద్ధమవుతున్నారు. అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమీకరణాలు, స్థానిక రాజకీయ బలం, ప్రజల్లో నాయకులకు ఉన్న ఆదరణ కీలకంగా మారాయి. కొన్ని వార్డుల్లో ఆశావహులు ఎక్కువగా ఉండటంతో అభ్యర్థుల ఎంపికపై రాజకీయ పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. నామినేషన్ల స్వీకరణకు ఆదివారం చివరి రోజు కావడంతో ఇప్పటివరకు నామినేషన్లు దాఖలు చేయని ఆశావహులు తమ పత్రాలను సమర్పించేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో శనివారం మందకొడిగా సాగిన నామినేషన్ల ప్రక్రియ చివరి రోజు ఊపందుకునే అవకాశం ఉంది. చైర్మన్ పదవికి ఇతర పార్టీల నుంచి ఎవరు బరిలోకి దిగుతారు, ఏయే వార్డుల్లో బహుముఖ పోటీ నెలకొంటుందన్న అంశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. నేటితో నామినేషన్ల గడువు ముగియనుండటంతో ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులపై మరింత స్పష్టత రానుంది.

# హిందూపురం వైకాపా చైర్మన్ అభ్యర్థిగా కురుబ శివ -రెండుసార్లు కౌన్సిలర్‌గా పనిచేసిన అనుభవం

-పురపాలక సంఘంపై పూర్తి పట్టు -పట్టణాభివృద్ధిపై అవగాహన

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పురపాలక సంఘం చైర్మన్ అభ్యర్థిగా కురుబ శివను పార్టీ అధిష్టానం ఎంపిక చేసినట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక వేణురెడ్డి ప్రకటించారు. శనివారం హిందూపురంలోని పార్టీ కార్యాలయం వద్ద ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ఇప్పటికే రెండుసార్లు కౌన్సిలర్‌గా పనిచేసిన అనుభవం, పురపాలక సంఘం నిర్వహణపై అవగాహన, పట్టణ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై పట్టు ఉండటం కురుబ శివకు అనుకూల అంశాలుగా నిలిచాయి. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో చైర్మన్ అభ్యర్థి ఎంపికపై నెలకొన్న ఉత్కంఠకు ఈ ప్రకటనతో తెరపడినట్లయింది. కురుబ శివ గతంలో రెండుసార్లు కౌన్సిలర్‌గా పనిచేయడంతో పురపాలక సంఘం పరిధిలోని సమస్యలు, ప్రజల అవసరాలు, పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆయనకు అనుభవం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. స్థానిక సంస్థల నిర్వహణపై అవగాహన కలిగిన నాయకుడిగా ఆయనకు ఉన్న అనుభవం చైర్మన్ అభ్యర్థిత్వానికి ప్రాధాన్యతను సంతరించుకుంది. పట్టణంలోని మౌలిక సదుపాయాలు, ప్రజలకు అవసరమైన పౌర సేవలు, వార్డులవారీగా నెలకొన్న సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో అనుభవం ఉపయోగపడుతుందని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. హిందూపురం పురపాలక సంఘంలో మొత్తం 52 వార్డులు ఉండటంతో చైర్మన్ పదవితో పాటు కౌన్సిలర్ స్థానాల్లోనూ విజయం సాధించడం రాజకీయ పార్టీలకు కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో చైర్మన్ అభ్యర్థిగా కురుబ శివ పేరును ఖరారు చేయడం ద్వారా ఎన్నికల



బరిలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం సిద్ధమైంది. చైర్మన్ అభ్యర్థి ఎంపికతో పాటు వార్డులవారీగా పార్టీ బలాబలాలు, అభ్యర్థుల గెలుపు అవకాశాలు, స్థానిక సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలు ఎన్నికల్లో కీలకం కానున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. కురుబ శివకు ఉన్న గత అనుభవం, పట్టణ సమస్యలపై అవగాహనను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయనున్నాయి. చైర్మన్ అభ్యర్థిగా ఆయన ఎంపిక నేపథ్యంలో హిందూపురం మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏ మేరకు ప్రభావం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది. ఈ కార్యక్రమంలో దీపిక వేణు రెడ్డితో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు బలరామిరెడ్డి, జబీవుల్లాతోపాటు పార్టీ నాయకులు నాగేంద్ర బాబు, మద్దెన జయప్ప, కట్ల భాష తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ మీనాక్షి దేవిగా, శ్రీ పార్వతీ దేవిగా దర్శనమిచ్చిన శ్రీ వాసవి మాత

- విశేష పూజలు.. - అంధ గాయకుల ఆర్కెస్ట్రా ప్రదర్శన

ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు శ్రీ వాసవి మాత సాయంత్రం శ్రీ మీనాక్షి దేవిగా, రాత్రి శ్రీ పార్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, పాలకవర్గ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద మంత్రోచ్చారణల నడుమ వాసవి మాతకు స్నపన తిరుమంజనం, నివేదన, మంత్రపుష్పం,





మహామంగళహారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని శ్రీ మీనాక్షి దేవి, శ్రీ పార్వతీ దేవి అలంకారాల్లో కొలువు దీర్చి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీ వాసవి కళ్యాణ మండపం ఆవరణలో హైదరాబాద్‌కు చెందిన జ్ఞాననేత్ర స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అంధ గాయకుల ఆర్కెస్ట్రా ప్రదర్శన ఆకట్టుకుంది. కళాకారుల గాన ప్రదర్శన సమాజానికి స్ఫూర్తినిచ్చింది. ఈ సందర్భంగా కడప జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వల్లంకొండు వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగారెడ్డి సతీష్ కుమార్ రెడ్డి శ్రీ వాసవి మాతను దర్శించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వారిని దుశ్శాలువలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీ వాసవి కళ్యాణ మండపం, అవోపా, మండల ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా మండలి, అవోపా మహిళా విభాగ్ కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# పులివెందుల నడిబొడ్డున ప్రజాస్వామ్యం ఖూనీ - నామినేషన్లు అడ్డుకున్నది పోలీసులే

వైఎస్ మనోహర్ రెడ్డితో చర్చించిన తర్వాత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆగ్రహం

ప్రజాభూమి, పులివెందుల

రాష్ట్ర చరిత్రలో పులివెందులలో జరిగిన సంఘటనతో ప్రజాస్వామ్యం నడిబజారులో ఖూనీ అయిందని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పులివెందులలో జరిగిన



ఉద్రిక్త పరిస్థితులపై శనివారం సాయంత్రం పులివెందులలో వైఎస్ఆర్సీపీ అగ్రనేత వైఎస్ మనోహర్ రెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి చర్చించారు. జరిగిన సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ, పులివెందులలో జరిగింది టీడీపీకి, వైసీపీకి మధ్య పోరాటం కానే కాదని, పోలీసులకు, వైసీపీకి మధ్య జరిగిన పోరాటమని స్పష్టం చేశారు. వైసీపీ అభ్యర్థులకు నామినేషన్ వేసేందుకు సమయం కేటాయించి, అదే సమయానికి నామినేషన్లు వేయకుండా పోలీసులే అడ్డుకోవడం దారుణమన్నారు. ఇలాంటి దుర్ఘటన రాజకీయ చరిత్రలో ఇదే ప్రథమమన్నారు. నిజంగా ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉంటే బాధ్యులైన పోలీసులను విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. రేపే రాష్ట్రంలో నామినేషన్లకు చివరి రోజు కావడంతో పారా మిలిటరీ బందోబస్తు మధ్య నామినేషన్లు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నలుగురుపై బైండోవర్ కేసు నమోదు చేసిన ఎస్ఐ సురేంద్రబాబు

ప్రజాభూమి, పుట్లూరు.

రానున్న ఎంపీటీసీ,జడ్పిటిసి మరియు గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా పుట్లూరు మండలంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఉండేందుకు ముందు చర్యలో భాగంగా పుట్లూరు మండలం గాండ్లపాడు గ్రామం మరియు పుట్లూరు గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులను బైండ్ ఓవర్ చేయించడశీ జరిగిందని శ్రీ సురేంద్రబాబు తెలిపారు. పుట్లూరు మండలంలో ఎవరైనా శాంతిభద్రతలకు విగాథం కలిగించిన ఎడల వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసి, నాన్ బేలబుల్ సెక్షన్లు విధించి, చట్టరీత్యా కఠినమైన చర్యలు తీసుకోబడును.. కావున ఎలాంటి గొడవలు పడకుండా ప్రశాంతంగా ఉండాలని సురేంద్రబాబు తెలిపారు.

# ప్రజా భూమి - ఎఫెక్ట్

రోడ్డు రిపేరు చేస్తున్నది ఎవరు...?

ప్రజా భూమి. యల్లనూరు

మండల పరిధిలోని ఇసుక రీచ్, మరియు చిత్రావతి నది నుంచి పరిమితికి మించి ఇసుకను రవాణా చేస్తున్న టిప్పర్లు తిరుమలాపురం ప్రధాన రోడ్డు మార్గం మలుపు వద్ద అతి పెద్ద లోయ ఏర్పడిందనే కథనం అక్టోబర్ 14 బుధవారం వెలువడడంతో ఎట్టకేలకు అధికారులు, రీచ్ యాజమాన్యలు డోజర్ సాయంతో లోయను పూడ్చడం జరిగింది ఏదేమైనా ప్రస్తుతానికి ఇసుక రీచ్ యాజ మాన్యుల స్వలాభాల కోసమా లేక.. అధికారుల స్వలాభాల కోసమా అంటూ ప్రజలు చర్చించుకుంటున్నట్లు సమాచారం. మరో ప్రధాన సమస్యగా రైతులు వ్యవసాయ పొలాలకు రోడ్డు ప్రక్కన పైపు లైన్లు ఉండడంతో టిప్పర్ల అధిక బరువుకు, ఓవర్ లోడ్ వల్ల పైపులు దెబ్బతిని నీరు లీకేజీతో రోడ్లు పాడై పోతున్నట్లు లీకేజీ మరమ్మత్తులు ఎంత రిపేరు చేసుకున్న షరా మామూలే అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at Y.S.R. and published at D.No.30-251, WARD NO.4, BUDDAYAPALLE VILLAGE, CHINNACHOWK editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1220.cell:9502116677.

## మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు



ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

వట్టిగుడిపాడు సెంటర్ రామాలయం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 11వ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శనివారం మహాలక్ష్మి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి బతుకమ్మ పండుగ సందర్భంగా భవానీలు, అయ్యప్పలు, మహిళా భక్తులు బతుకమ్మ పాటలకు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విజయదశమి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## 19న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 19వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుందని ఆగిరిపల్లి ఎంపీడీవో అబ్దుల్ సలాం తెలిపారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో ఆగిరిపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని వెల్లడించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఈవూరి విలియం బాబు ఆధ్వర్యంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే, గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడో దశలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ఏలేశ్వరం మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు!

- స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- 28 వార్డులకు 34 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

ప్రత్తిపాడు (ఏలేశ్వరం)

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని ఏలేశ్వరం మున్సిపాలిటీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. మున్సిపల్ శాఖ అధికారులతో కలిసి రిసెప్షన్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ రూమ్‌లను తనిఖీ చేశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సదుపాయాలు, భద్రతా



ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏలేశ్వరం మున్సిపాలిటీలో మొత్తం 28 వార్డులకు 34 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆయా కేంద్రాల్లో చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించినట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం ఏలేశ్వరం పరిధిలోని అప్పన్నపాలెం వంతెనను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. వంతెన కిందకు దిగిపోయిన కారణంగా పోలింగ్ సిబ్బంది రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

# నామినేషన్ల ప్రక్రియను పరిశీలించనున్న సాధారణ, వ్యయ పరిశీలకులు

- నామినేషన్ కేంద్రాలను సందర్శించనున్న పరిశీలకులు
- ఎన్నికల ప్రక్రియను నిశితంగా పరిశీలించేందుకు ఏర్పాట్లు

ప్రజాభూమి ప్రతినిధి-మచిలీపట్నం

కృష్ణా జిల్లాలో 2వ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు-2026లో భాగంగా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించేందుకు భారత పరిపాలనా సేవ అధికారి కె.వి.ఎన్. చక్రధర్ బాబు సాధారణ పరిశీలకులుగా, భారత అటవీ సేవ అధికారి కె.వి. శ్రీకాంత్ వ్యయ పరిశీలకులుగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వారిని నేడు సంప్రదించి, జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పరిస్థితులు, నామినేషన్ల ప్రక్రియ తదితర అంశాలపై మాట్లాడారు.

నియమితులైన పరిశీలకులు రేపు ఉదయం 10 గంటలలోపు విధుల్లో చేరి, అనంతరం జిల్లాలోని పట్టణ స్థానిక సంస్థల పరిధిలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను సందర్శించనున్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ, ఎన్నికల నియమావళి, సంబంధిత మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రక్రియ సజావుగా సాగుతున్న తీరును పర్యవేక్షించనున్నారు. సాధారణ పరిశీలకులు ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించబడుతున్న తీరును పర్యవేక్షించగా, వ్యయ పరిశీలకులు ఎన్నికల ఖర్చులకు సంబంధించిన నిబంధనల అమలు, అభ్యర్థుల ఎన్నికల వ్యయాల పర్యవేక్షణ తదితర అంశాలను పరిశీలించనున్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడటం, ఎన్నికల నియమ నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడటం, సంబంధిత అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించడం వంటి అంశాలపై పరిశీలకులు దృష్టి సారించనున్నారు.

# ఏపీకి వర్షసూచన.. రాబోయే 3 గంటల్లో పిడుగులతో కూడిన వర్షాలు

ప్రజా భూమి ప్రతినిధి-అమరావతి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రానున్న 3 గంటల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అల్లూరి సీతారామరాజు, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు



మోస్తారుగా కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. దానితోపాటు గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఈ మేరకు ఆయా ప్రాంతాలకు ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది. రంపచోడవరం, నర్సీపట్నం, కృష్ణదేవిపేట, రౌతులపూడి, మాడుగుల, ఓర్వకల్లు, వెల్దుర్తి, డోన్, గూటి, పొదిలి, బద్వేలు, సత్యవేడు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, నాయుడుపేట, గొట్టిప్రోలు పరిసర ప్రాంతాలలో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు నిపుణులు అంచనా వేశారు. ఈ మేరకు ప్రజలు, సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు సూచించారు.

# వైభవోపేతంగా ఆదిదంపతుల నగరోత్సవం

- అమృతవర్షిణి శ్రీ మహాలక్ష్మి కొలువుదీరిన వేళ.. అంబరాన్నంటిన పురవీధుల ఆధ్యాత్మిక సంబరం
- శాక్సోఫోన్ రవళులు, కేరళ పంచవాద్యాల దరువులు, కూచిపూడి అభినయ విన్యాసాల నడుమ సాగిన ఊరేగింపు
- దుర్గా ఘాట్, ఘాట్ రోడ్డు మీదుగా కదిలిన ఉత్సవ రథం - మహారాజగోపురం వద్ద శాస్త్రోక్తంగా ఆస్థాన మహోత్సవం

ప్రజాభూమి ప్రతినిధి-ఇంద్రకీలాద్రి

దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు సప్తమ ఘట్టానికి చేరుకున్న వేళ, ఇంద్రకీలాద్రి పుర వీధులు సాక్షాత్తు కైలాస-వైకుంఠాలను తలపించాయి. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శనివారం సాయంత్రం నిర్వహించిన ఆదిదంపతుల నగర రథయాత్ర అశేష భక్తజన హర్షాతిరేకాల మధ్య కన్నుల పండువగా సాగింది. ఒకవైపు కొండపై అమ్మవారు సర్వ సంపదల నిలయమైన శ్రీ మహాలక్ష్మి దేవిగా సర్వాభరణ భూషితురాలై దర్శనమిస్తుండగా, సూర్యాస్తమయ ప్రదోషవేళ కొండపై వెలసిన శ్రీ మల్లేశ్వర స్వామి వారి సన్నిధిలో అర్చకులు ఉత్సవ విగ్రహాలకు పూర్ణాహుతి తరహా వైభవంతో విశేష నివేదనలు, పంచహారతులు సమర్పించారు. మంగళవాద్యాల ఘోషతో పల్లకీ కదలగానే వేలాది భక్తజనం ఒక్కసారిగా చేతులెత్తి నమస్కరిస్తూ భక్తిపారవశ్యంలో మునిగితేలారు. కేవలం సంప్రదాయ మేళాలకే పరిమితం కాకుండా, ఈరోజు రథయాత్ర వెంట సాగిన శాక్సోఫోన్ స్వరాలాపనలు, కేరళ పంచవాద్యాల లయబద్ధమైన దరువులు, మరియు కూచిపూడి కళాకారుల ముద్రాయుక్త నాట్య విన్యాసాలు భక్తులను ఎంతగానో



సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. మహిళల కోలాట బృందాల అడుగుల సవ్వడి రథం ముంగిట ప్రత్యేక శోభను సంతరించుకుంది. శ్రీ మల్లేశ్వర స్వామి ఆలయం నుండి ప్రారంభమైన ఈ దివ్యయాత్ర రథం సెంటర్, వినాయకుడి గుడి, కెనాల్ రోడ్డు మీదుగా సాగి కృష్ణానదీ తీరమైన దుర్గా ఘాట్ వద్దకు చేరింది. అక్కడ నదీమతల్లి సాక్షిగా ఆదిదంపతులకు భక్తులు అడుగడుగునా హారతులు పట్టారు. అనంతరం ఘాట్ రోడ్డు మార్గంలో భక్తుల జయజయధ్వానాల నడుమ రథం కొండపైకి చేరుకుంది. నగరోత్సవం పరిసమాప్తమైన అనంతరం, మహారాజగోపురం ముందు ఉత్సవ మూర్తుల ను ఆసీనులను చేసి ఆలయ స్థానాచార్యుల పర్యవేక్షణలో వేదోక్తంగా దివ్య "ఆస్థాన సేవ" నిర్వహించారు.

వేద పండితులు స్వస్తివాచకాలు పలుకగా, అర్చక బృందం విశేష చతుర్వేద హారతులు సమర్పించారు. శాస్త్ర వచనాల ప్రకారం జగన్మాత లక్ష్మీ స్వరూపంలో ఉన్నప్పుడు, పరమేశ్వరునితో కలిసి పురవీధుల్లో విహరించే ఆదిదంపతులను రథంపై దర్శించుకుంటే ఆ ఇంట సిరిసంపదలకు కొరత ఉండదని, సమస్త ఋణబాధలు తొలగి సకల ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని విశ్వసిస్తారు. ఈ విశేష నగర రథోత్సవంలో దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు, దేవస్థానం సిబ్బంది, అసంఖ్యాక భక్తజనం పాల్గొని పరవశించారు.

## నామినేషన్ల స్వీకరణలో

# ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలి

- నేడు మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఒక్క నామినేషన్ కూడా స్వీకరించరాదు
- ఆర్వోలు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

ప్రజాభూమి ప్రతినిధి-మచిలీపట్నం



రెండవ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికలు-2026లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ రేపటితో ముగియనున్న నేపథ్యంలో, నామినేషన్ల స్వీకరణ, ఎన్నికల నియమ నిబంధనల అమలు, చివరి రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధికారులకు ఎదురవుతున్న సందేహాల నివృత్తి తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ శనివారం సాయంత్రం సంబంధిత రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), ఎన్నికల అధికారులతో వర్చువల్ విధానంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్ల స్వీకరణకు ఆదివారం చివరి రోజు కావడంతో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను, గడువులను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. నామినేషన్ల స్వీకరణలో ఎటువంటి పొరపాట్లకు, నిబంధనల ఉల్లంఘనలకు తావులేకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ గడువు మధ్యాహ్నం నేడు 3 గంటలకు ముగుస్తుందని, నిర్ణీత గడువు ముగిసిన తర్వాత ఒక్క సెకను ఆలస్యమైనా ఎట్టి పరిస్థితుల్లోనూ కొత్త నామినేషన్లను స్వీకరించరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అయితే, గడువు ముగిసే సమయానికి ముందే నామినేషన్లు దాఖలు చేసేందుకు సంబంధిత ప్రాంగణంలో లేదా నిర్దేశిత గదిలోకి ప్రవేశించిన అభ్యర్థులు ఉన్నట్లయితే, వర్తించే ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వారందరి నామినేషన్లను స్వీకరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ విషయంలో సమయపాలన అత్యంత కీలకమని, నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన నిబంధనలను ప్రతి రిటర్నింగ్ అధికారి, ఎన్నికల అధికారి స్పష్టంగా అర్థం చేసుకుని అమలు చేయాలని పునరుద్ఘాటించారు. చివరి రోజు అభ్యర్థులకు ఎటువంటి అనవసర ఇబ్బందులు కలగకుండా, అదే సమయంలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘనకు గురికాకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఒక అభ్యర్థి ఒకే వార్డులో ఒకటి కంటే ఎక్కువ నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన సందర్భంలో, నిబంధనల ప్రకారం ఒకే సెక్యూరిటీ డిపాజిట్ సమర్పించడం సరిపోతుందని కలెక్టర్ వివరించారు. అయితే, అదే అభ్యర్థి వేర్వేరు వార్డుల నుంచి పోటీ చేసేందుకు నామినేషన్లు దాఖలు చేసినట్లయితే, ప్రతి వార్డుకు విడివిడిగా నిర్ణీత సెక్యూరిటీ డిపాజిట్ సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఈ అంశంపై అభ్యర్థులకు సరైన అవగాహన కల్పించాలని, నామినేషన్ పత్రాలు, డిపాజిట్ల స్వీకరణ విషయంలో ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులు లేవనెత్తిన వివిధ సందేహాలను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ సమీక్షించి తగిన సూచనలు, వివరణలు అందించారు. నామినేషన్ల స్వీకరణలో ఎదురయ్యే సందేహాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటిపై స్పష్టత పొందిన అనంతరం సంబంధిత సిబ్బందికి కూడా సమాచారం అందించాలని సూచించారు. ఒక అధికారికి అందిన మార్గదర్శకాలు, సూచనలు ఇతర సంబంధిత ఎన్నికల అధికారులకు కూడా చేరేలా సమన్వయం చేసుకోవాలని, ఎన్నికల ప్రక్రియలో అందరూ ఒకే విధమైన అవగాహనతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నేడు నామినేషన్ల స్వీకరణకు చివరి రోజు కావడంతో అన్ని కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది, రికార్డులు, ఇతర ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## నూజివీడులో వైఎస్సార్‌సీపీకి గట్టి ఎదురుదెబ్బ



ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

నూజివీడు మంత్రి క్యాంపుకార్యాలయంలో శనివారం స్థానిక 36వ వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీముఖ్యనాయకులు ఎదురేసి ఎరకయ్య వారి ఐదుకుటుంబాలు వారు సుమారు 20 మంది రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సమక్షంలో పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న అభివృద్ధి, ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకులు, నాయకులు, పార్టీకార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామాలు చేసి తెలుగుదేశం పార్టీలో చేరడం శుభపరిణామం అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి సారథ్యంలోని కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు ప్రజాసమస్యలు పరిష్కారంలో చూపిస్తున్న చిత్తశుద్ధి, నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి టీడీపీలో చేరుతున్నారని తెలిపారు. ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, పార్టీని నమ్ముకుని వచ్చిన నాయకులను, కార్యకర్తలను సముచిత రీతిలో గౌరవించి అండగా ఉంటామని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎదురేసి ఎరకయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఈ రోజు మంత్రి కొలుసు పార్థసారథి సమక్షంలో టీడీపీలో చేరుట చాలా ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో వార్డులో, గ్రామాల్లో, నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీబలోపేతానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కె.వి. సత్యనారాయణరెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

మాజీ డీసీఎంఎస్ చైర్మన్, రావులపాలెం కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంకు అధ్యక్షుడు కె.వి. సత్యనారాయణరెడ్డి (కె.వి.) జన్మదిన వేడుకలు శనివారం రావులపాలెంలోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, నాయకులు, అభిమానులు ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి కె.వి. సత్యనారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. పుష్పగుచ్ఛాలు, బొకేలు అందజేసి ఆయనకు అభినందనలు తెలిపారు. ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రావులపాలెం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పోతంశెట్టి కనికిరెడ్డి, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ నందం వీరవెంకట సత్యనారాయణ, అమలాపురం పార్లమెంటు తెలుగు యువత అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, రాకేష్ వర్మ, కొవ్వూరి అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కనకదుర్గమ్మవారిని దర్శించుకున్న ఆకుల రామకృష్ణ



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

మండల పరిధిలోని ఈతకోట గ్రామంలో జాతీయ రహదారి చెంత కొత్త సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారిని కాపు ఉద్యమ నేత, సీనియర్ రాజకీయ నాయకులు, తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ శనివారం దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న ఆకుల రామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ అర్చకులు ఖండవిల్లి నారాయణాచార్యులు (నాని) రామకృష్ణ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయానికి విచ్చేసిన ఆకుల రామకృష్ణకు ఆలయ కమిటీ చైర్మన్ జనిపిరెడ్డి గోవిందరావు, కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి బోనాల పండుగలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా

చిన శంకర్లపూడిలో ప్రత్యేక పూజలు.. ప్రజల సుఖసంతోషాల కోసం అమ్మవారికి ప్రార్థనలు

ప్రజాభూమి ప్రతినిధి-ప్రత్తిపాడు



దేవి నవరాత్రుల పర్వదినాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం చిన శంకర్లపూడి గ్రామంలో నిర్వహించిన శ్రీ దుర్గాదేవి అమ్మవారి బోనాల పండుగలో ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రత్తిపాడు నియోజకవర్గం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని దుర్గాదేవి అమ్మవారిని ప్రార్థించారు. దేవి నవరాత్రుల సందర్భంగా గ్రామాల్లో నిర్వహించే ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు మన సంప్రదాయాలకు ప్రతీకలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇటువంటి పండుగలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఐక్యత, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే పూజలు, ఉత్సవాలు మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. చిన శంకర్లపూడి గ్రామంలో నిర్వహించిన దుర్గాదేవి బోనాల పండుగ ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో కొనసాగింది.

# ప్రజాభూమి

జనరల్ 14

ఆదివారం 18 అక్టోబరు 2026


## శరన్నవరాత్రి ఉత్సవాల్లో సాంస్కృతిక శోభ”

ప్రజాభూమి ప్రతినిధి–విజయవాడ



ఇంద్రకీలాద్రిపై వైభవంగా నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కొండ దిగువన శ్రీ కనకదుర్గా నగర్ లోని కళావేదిక పై వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత , నృత్య కళాకా రులు తమ ప్రదర్శనలతో, ఆధ్యాత్మిక శోభతో భక్తులను ఆకట్టుకునేలా చేశారు.అనేక రూపాలం కారాలతో జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తున్న తరుణంలో, కళాకారుల గానాలు, నృత్యాలు, భజన కీర్తనలు భక్తులను భక్తిభావంతో పరవశింప జేస్తున్నాయి.దసరా సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా అమ్మవారి వైభవాన్ని, దైవ భక్తిని ప్రతిబింబించేలా తిరుప తికి చెందిన భరత నాట్య కళాకారిణి హరిప్రియ నృత్యాభినయం భక్తులను, ప్రేక్షకులను, విశేషంగా ఆకర్షించింది. “ఉమా మహేశ్వరి”, “శైలసుతే శివసహితే”, “పరిపాహి శ్రీ చాముం డేశ్వరి దేవి”లి వంటి భక్తిరస ప్రధానమైన కీర్తనలకు భావ యుక్తమైన అభినయాన్ని జోడించి, భరత నాట్యం లోని నృత్య, అభినయ విశిష్టతలను కుమారి హరిప్రియ చక్కగా ఆవిష్కరించా రు.శాస్త్రీయ నృత్య సంప్రదాయాన్ని భక్తితో మేళవిస్తూ సాగిన ఈ ప్రదర్శన దసరా ఉత్సవాల్లో ప్రత్యేకతను సంతరించుకుంది. కార్యక్రమం అనంతరం వివిధ ప్రదర్శనలతో భక్తులను ఆకట్టుకున్న కళాకారులను ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలతో పాటు ప్రశంసా పత్రాలను కూడా అందించి సత్కరించారు.

## అందుబాటులో ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.నాగలక్ష్మి



ప్రజాభూమి ప్రతినిధి–విజయవాడ

రెండో సాధారణ మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎన్నికలకు సంబంధించి ఎన్టీఆర్ జిల్లాకు సాధారణ ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన ఐఏఎస్ అధికారి, ఏపీ జెన్కో మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ .నాగలక్ష్మి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలిస్తూ ఎన్నికల ప్రక్రియ సజావుగా, నిబంధనలకు అనుగుణంగా జరిగేలా పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికతకు ప్రాధాన్యతనిస్తూ, ఎన్నికల నియమావళి అమలుకు సంబంధించి ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ దృష్టికి తీసుకురావాల్సిన ఫిర్యాదులు లేదా సమస్యలు ఉంటే సాధారణ ఎన్నికల పరిశీలకురాలిని సంప్రదించవచ్చని తెలిపారు.ఈ మేరకు ఎన్నికల పరిశీలకురాలు నాగలక్ష్మికి లిఫోన్ నంబర్ 7680980032లి ద్వారా లేదా mdapgenco2025@gmail.com ఈ–మెయిల్ చిరునామాకు ఫిర్యాదులు, ఎన్నికలకు సంబంధించిన వివరాలను తెలియజేయవచ్చని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై వైభవంగా ‘అర్చక సత్కారము’

- ఘనంగా అర్చక స్వాములకు
- దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ అధ్యక్షతన ఘనంగా జరిగిన సభ
- సనాతన ధర్మ రక్షణలో, సమాజ శ్రేయస్సులో అర్చకుల పాత్ర అత్యంత కీలకమని కొనియాడిన కమిషనర్
- శ్రీ మల్లికార్జున మహామండపంలో భక్తిశ్రద్ధలతో జరిగిన వేడుక

ప్రజాభూమి ప్రతినిధి–ఇంద్రకీలాద్రి

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవోపేతంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని శనివారం సాయంత్రం కొండపై ఉన్న శ్రీ మల్లికార్జున మహామండపం 6వ అంతస్తులో ‘అర్చక సత్కారము’ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ సభాధ్యక్షతన జరిగిన ఈ సన్మాన సభలో ఉత్సవాల వేళ నిరంతరం వైదిక క్రతువులు నిర్వహిస్తున్న అర్చక స్వాములను ఘనంగా సత్కరించారు. ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర మల్లేశ్వర శాస్త్రి, బ్రహ్మశ్రీ లింగంభొట్ల దుర్గాప్రసాద్ శర్మ, బ్రహ్మశ్రీ కుందుర్తి కనక సుందర శర్మల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా సాగింది.ఈ సందర్భంగా దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్



మాట్లాడుతూ.. సమాజ సంక్షేమంలో, ఆలయ సంప్రదాయాల పరిరక్షణలో అర్చకుల పాత్ర వెలకట్టలేనిదని పేర్కొన్నారు. “ఆలయాల్లో పూజాధికాలు సజావుగా సాగడమే కాకుండా, సమస్త మానవాళి ఆయురారోగ్యాలు, సుభిక్షం కోసం ప్రతిరోజూ సంకల్పం చేసి హోమాలు, జపాలు నిర్వహించేది అర్చకులే. లోక కళ్యాణార్థం శ్రమించే అర్చక స్వాములను గౌరవించుకోవడం మన బాధ్యత.” తరతరాలుగా వస్తున్న వేద సంస్కృతిని, ఆలయ సాంప్రదాయాలను సజీవంగా నిలబెడుతున్నది వైదిక, అర్చక వర్గమేనని కొనియాడారు.అనంతరం వేదికపై అర్చక స్వాములకు దేవస్థానం తరఫున శాలువాలు కప్పి, ప్రసాదాలు అందజేసి సముచిత రీతిలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దేవాదాయ కమిషనర్ కు అర్చకులు ఆశీస్సులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అర్చక స్వాములు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధులను పార దర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వర్తించాలి

- ఎక్కడా రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి–కాకినాడ

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్ని కల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) ఉల్లంఘనలకు తావు లేకుండా, ఎక్కడా రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా అత్యంత పకడ్బందీగా ఎన్నికలను నిర్వ హించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.శనివారం కాకినాడ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వ హణలో భాగంగా జోనల్ అధికారులు, రూట్ అధికా రులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు (ఎఫ్ఎస్‌టీ), స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (ఎస్ఎస్ టీ)లకు ఏర్పాటు చేసిన సమగ్ర శిక్షణా కార్యక్రమానికి. జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, నిబంధనల ఉల్లంఘనల గుర్తింపు, తనిఖీల నిర్వహణ, సీజింగ్ ప్రక్రియ, నివేదికల సమర్పణ తదితర కీలక అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, అభ్యర్థుల పట్ల అధికారులు సమానత్వాన్ని పాటిస్తూ నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నిక లు నిర్వహించాలన్నా రు.జోనల్ అధికారులకు ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేరి యల్ అధికారాలు అప్పగించడమై నదన్నారు. అధికారుల వద్ద పక్కాగా కమ్యూనికేషన్ ప్లాన్ అందుబాటులో ఉండాలన్నారు ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు 24 గంటలూ అప్రమ త్తంగా ఉండి చెక్‌పోస్టులు, సున్నిత ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే మద్యం, నగదు, బహుమతుల అక్రమ రవా ణాను అడ్డుకోవాలన్నారు అవసరమైన చోట వీడియో చిత్రీకరణ చేయాలని, తని ఖీలలో స్వాధీనం



చేసుకున్న నగదు, వస్తువులను సాధారణ తనిఖీల సమయాల్లో ‘అనెక్సర్– ఎ, బి’ ప్రకారం, చెక్‌పోస్టుల వద్ద ‘అనెక్సర్–సి’ ద్వారా సీజ్ చేసి, రోజువారీ నివేదికలను కంట్రోల్ రూమ్‌కు, ఉన్నతాధికారు లకు సమర్పించాలన్నారు. సమస్యా త్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ని ప్రజలతో సమావేశాలు నిర్వ హించి, వారు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకు నేలా భరోసా కల్పించాలన్నారు

జోనల్, రూట్ అధికారులు పోలింగ్ కేంద్రాలను ముందస్తు గా సందర్శించి తాగునీరు, విద్యుత్, ప్రవేశ మార్గాలు వంటి కనీస సదుపాయాలను ధృవీకరించుకోవాలన్నారు. బ్యాలెట్ బాక్సుల భద్రత, సిబ్బంది రవాణా, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో, అంకిత భావంతో పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయా లని జిల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు. శిక్షణా కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణరావు, ఎంసీసీ జిల్లా నోడల్ అధికారిణి జడ్పీ ఉప కార్యనిర్వా హక అధికారి శ్రీలలిత, జిల్లా పంచాయతీ అధికారి వి. రవికుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి పి. రమేష్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, ఆర్డీవో ఎస్. మల్లిబాబు, జోనల్, రూట్ అధికారులు, ఎఫ్ఎస్‌టీ, ఎస్–ఎస్‌టీ బృందాల సభ్యులు మరియు పోలీస్ అధికా రులు పాల్గొన్నారు.

## కాకినాడలో పొగాకు నివారణ కార్యక్రమాల్లో ముందంజలో పాఠశాలలు

### కేవలం నాలుగు నెలల్లోనే 98% పాఠశాలల భాగస్వామ్యం

ప్రజాభూమి ప్రతినిధి–కాకినాడ

పొగాకు వాడకం అనేది తీవ్రమైన ప్రజారోగ్య సమస్యగా కొనసాగుతోంది. చిన్న వయస్సులోనే పొగాకు వినియోగించడం అనేది మాదక ద్రవ్యాల (డ్రగ్స్) వైపు మళ్లీ ప్రమాదం ఉన్నందున ఇది ఒక ప్రధాన ఆందోళనకర అంశంగా మారింది. గ్లోబల్ అడల్ట్ టొబాకో సర్వే ప్రకారం, ఆంధ్రప్రదేశ్ లో 15 సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వారిలో 20% మంది ప్రస్తుతం పొగాకు వినియోగదారులుగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ మరియు ఆరోగ్య శాఖలు కలిసి ‘టొబాకో ఫ్రీ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్’ ప్రోగ్రామ్ ద్వారా పాఠశాల ఆధారిత పొగాకు నివారణను అమలు చేస్తున్నాయి. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలో ప్రస్తుతం ‘నవతరం’ పేరుతో నిర్వహిస్తున్నారు. ఇది ‘నషా ముక్త విద్యాలయ’ (మత్తు పదార్థాల రహిత విద్యాలయం) లో ఒక భాగం. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ నేషనల్ హెల్త్ మిషన్, తొమ్మిది జిల్లాలలో (అనకాపల్లి, అన్నమయ్య, కాకినాడ, కృష్ణా, నంద్యాల, ప్రకాశం, శ్రీ సత్యసాయి, శ్రీకాకుళం, తిరుపతి) ఈ ‘నవతరం’ కార్యక్రమాన్ని అమలు చేయడానికి ‘సంబంధ్ హెల్త్ ఫౌండేషన్’ ను ఇంప్లిమెంటేషన్ భాగస్వామిగా నియమించింది.”ఆరోగ్య మరియు విద్యా మంత్రిత్వ శాఖలు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, ప్రతి విద్యాసంవత్సరంలో పాఠశాలలు తొమ్మిది రకాల పొగాకు వ్యతిరేక కార్యకలాపాలను చేపడతాయి. ఇందులో పాఠశాలలో ఒక నోడల్ అధికగారిని నియమించడం, ప్రతిజ్ఞలు/ర్యాలీలు/పోస్టర్ పోటీలు నిర్వహించడం, పొగాకు రహిత బోర్డులు/సైనేజీలను ప్రదర్శించడం మరియు పాఠశాలల సమీపంలో పొగాకు ఉత్పత్తులను విక్రయించే దుకాణాల సంఖ్యను తెలియజేయడం/ నివేదించడం వంటివి ఉంటాయి. 9 కార్యకలాపాలలో 8 కార్యకలాపాలను నిర్వహించడం ద్వారా పాఠశాలలు ‘పొగాకు రహిత పాఠశాల’ హోదాను సాధించడానికి కృషి చేస్తాయి.



కాకినాడ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ...విద్యాసంవత్సరం మొదటి నాలుగు నెలల్లోనే కాకినాడలోని 98% పాఠశాలలు నవతరం కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ప్రోత్సహకరంగా ఉంది. మొత్తం 1,947 పాఠశాలలు 18,540 పొగాకు వ్యతిరేక కార్యకలాపాలను నిర్వహించాయి. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు విద్యాశాఖ చేసిన కృషిని అభినందిస్తున్నాను. పాఠశాలలను పొగాకు రహితంగా తీర్చిదిద్దడానికి మరియు పిల్లలను పొగాకు వినియోగానికి దూరంగా ఉంచడానికి మనం ఈ ప్రయత్నాలను ఇలాగే కొనసాగించాలి” అని తెలిపారు.కాకినాడ జిల్లాలో నవతరం ప్రోగ్రామ్ పురోగతిని వివరిస్తూ, ఐజూ పి. రమేష్ మాట్లాడుతూ “నాలుగు నెలల్లోనే కాకినాడలోని 98% (1,947) పాఠశాలలు భాగస్వామ్యం కావడం అనేది పొగాకు నివారణలో మన ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల అంకితభావాన్ని తెలియజేస్తోంది

## ఏపీలో జరుగుతున్నది ఎన్నికలు కాదు..

# చంద్రబాబు ఆధ్వర్యంలో పక్కా ‘ఆర్గనైజ్డ్ క్రైమ్’

- రాష్ట్రంలో కిరాయి సైన్యంగా పోలీసులు
- పోలీసుల సాయంతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కూటమి సర్కార్..
- దమ్ముంటే ప్రతిపక్షాన్ని స్వేచ్ఛగా నామినేషన్లు వేయనివ్వాలి
- 44 లక్షల దొంగ ఓట్లతో తూతూమంత్రంగా ఎన్నికల డ్రామా..
- రెండేళ్ల పాలనపై ధైర్యం ఉంటే ప్రజాక్షేత్రంలో తీర్పు తేల్చుకోండి
- సవాల్ విసిరిన సజ్జల రామకృష్ణారెడ్డి.

ప్రజాభూమి ప్రతినిధి–తాడేపల్లి

రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ తీవ్ర అధికార దుర్వినియోగానికి, రాక్షస పాలనకు నిదర్శనంగా మారిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం తాడేపల్లిలోని వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ప్రజలకు చేసిందేమీ లేక, ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదన్న భయంతోనే ప్రతిపక్ష అభ్యర్థులు కనీసం నామినేషన్లు కూడా వేయకుండా పోలీసుల అండతో భౌతిక దాడులకు తెగబడుతోందని మండిపడ్డారు. పులివెందుల వంటి చోట్ల పోలీసులే నేరుగా కార్లపై దాడులు చేయడం అధికార పక్ష కిరాయి సైన్యంలాంటి తీరుకు అద్దం పడుతోందని ఆరోపించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) పూర్తిగా నిష్క్రియాపరంగా మారిపోయిందని, వ్యవస్థలను మేనేజ్ చేస్తూ చంద్రబాబు ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి, తమ పాలనపై ధైర్యం ఉంటే ప్రతిపక్ష అభ్యర్థులను స్వేచ్ఛగా నామినేషన్లు వేయనిచ్చి, ఎన్నికల బరిలో ప్రజా తీర్పును ఆహ్వానించాలని ఆయన సవాల్ విసిరారు.

**ఇది ఎన్నికల ప్రక్రియ కాదు.. పక్కా ఆర్గనైజ్డ్ క్రైమ్!**

రాష్ట్రంలో జరుగుతున్నది స్థానిక సంస్థల ఎన్నికలు ఎంతమాత్రం కాదు. ఇది ముందస్తు ప్రణాళికతో చంద్రబాబు నాయుడు నడిపిస్తున్న ఒక ఆర్గనైజ్డ్ క్రైమ్. ఎన్నికల పేరుతో ప్రజాస్వామ్యాన్ని నిలువునా ఖూనీ చేస్తున్నారు. 15 లక్షల మంది మృతుల ఓట్లతో పాటు మరో 29 లక్షల బోగస్, డూప్లికేట్ ఓట్లు.. ఇలా మొత్తం 44 లక్షల అనుమానాస్పద ఓట్లు జాబితాలో ఉన్నాయి. దగ్గరలోనే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ముగుస్తున్న తరుణంలో, దాన్ని పూర్తికాకముందే ఇంత హడావుడిగా లేని ఓట్లతో ఎన్నికలు జరపాల్సిన అవసరం ప్రభుత్వానికి ఎందుకొచ్చింది? కేవలం 12 రోజుల్లోనే మొత్తం తంతు ముగించేలా కుట్ర పన్నారు. చిట్టచివరి నిమిషంలో రిజర్వేషన్లు ప్రకటించి, ఎవరూ సిద్ధం కాకుండా చేశారు. అధికారంలో ఉన్న అడ్వాంటేజ్‌తో ప్రతిపక్షానికి అసలు అవకాశమే లేకుండా షెడ్యూల్ ఖరారు చేసుకున్నారు.

**– రోజుకు 4 గంటలే సమయం.. సీసీ కెమెరాలు లేని చోట్ల కేంద్రాలు!**

దేశంలో ఎక్కడా లేని విధంగా నామినేషన్లకు రోజుకు కేవలం నాలుగు గంటలు (ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు)



మాత్రమే సమయం ఇచ్చారు. ఆ నాలుగు గంటల్లో కూడా వైయస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి వస్తే భౌతికంగా అడ్డుకుంటున్నారు. నామినేషన్ కేంద్రాలను ప్రధాన కార్యాలయాల్లో కాకుండా, సీసీ కెమెరాలు కూడా లేని సందుగొందుల్లోని చిన్న పాఠశాలల్లో పెట్టారు. అక్కడ టీడీపీ గూండాలు వందల సంఖ్యలో తిష్టవేసి ఉంటే పోలీసులు వారికి రక్షణగా నిలుస్తున్నారు. వైయస్సార్‌సీపీ అభ్యర్థులు పత్రాలు పట్టుకుని వెళ్తే పోలీసులే బలవంతంగా బయటకు నెట్టేస్తున్నారు.

**పులివెందులలో పోలీసులే గూండాల్లా దాడి చేశారు!**

పులివెందులలో జరిగిన దారుణాన్ని ప్రజలందరూ చూశారు. పోలీసులు చెప్పిన సమయానికే ఎంపీ అవినాష్ రెడ్డి వెంట అభ్యర్థులు వెళ్లినా.. వారికి రక్షణ కల్పించాల్సింది పోయి పోలీసులే నేరుగా కార్లపై విరుచుకుపడ్డారు. అక్కడ ఏ గొడవా జరగకపోయినా, ఎవరూ బెదిరించకపోయినా.. కిరాయి సైన్యంలా చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా పోలీసులే కార్లను పగలగొట్టడం, దాడులకు దిగడం రాష్ట్రంలో శాంతిభద్రతల దుస్థితికి నిదర్శనం. పోలీసులు కాకీ చొక్కాలు తీసేసి పచ్చ చొక్కాలు వేసుకుంటే బాగుంటుంది. ఇక బద్వేలులో అధికారులు చూస్తుండగానే టీడీపీ మూకలు లోపలికి చొరబడి మా పార్టీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను కట్టలతో సహా లాక్కెళ్లారు.

**ఎంపీలపైనే దాడులు.. పత్రాలు చించేసిన పచ్చ మూకలు!**

పుంగనూరులో లోక్‌సభలో వైయస్సార్‌సీపీ పక్ష నేత మిథున్‌రెడ్డిపై రాళ్లదాడి చేశారు. నాలుగు గంటలపాటు మా అభ్యర్థులు లోపల నిలబడి ఎదురుచూసినా అధికారులు నామినేషన్ పత్రాలు స్వీకరించలేదు. రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి ఫోన్ చేయించినా ఆర్వోలు పత్రాలు తీసుకోకుండా మొహం చాటేశారు. తిరుపతిలో ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం వెంట వచ్చిన అభ్యర్థుల చేతుల్లోని నామినేషన్ పత్రాలను లాక్కొని చించేశారు. మధ్యాహ్నం రమ్మని చెప్పి, తీరా వెళ్లాక గేట్లు మూసేసి సమయం అయిపోయిందని వెనక్కి పంపించారు. రాయచోటిలో ఏకంగా మా పార్టీ కార్యాలయంపైనే పచ్చ గూండాలు పడి విధ్వంసం సృష్టించారు. గుంజాల నియోజకవర్గంలో ఎన్నికల్లో పోటీ చేస్తున్నారన్న ఒకే ఒక్క కారణంతో అభ్యర్థులను కిడ్నాప్ చేశారు. వారి ఆచూకీ కోసం కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయాల్సి వచ్చిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**ఎస్ఈసీ పూర్తిగా డమ్మీ.. పోలీసుల చేతుల్లోనే సర్వాధికారాలు!**

రాష్ట్రంలో ఎన్నికల సంఘం పూర్తిగా డమ్మీగా మారిపోయింది. పోలీసులే సర్వాధికారులుగా చెలరేగిపోతున్నారు. మేము వెళ్లి ఎస్ఈసీకి ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తే.. వారు దాన్ని డీజీపీకి పంపిస్తున్నారు. ఆ డీజీపీ వాటిని బుట్టదాఖలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో డీఐజీ, ఎస్పీ స్థాయి అధికారులే అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై సెటిల్మెంట్లు చేసుకుంటున్నారు. కేంద్రం నుంచి నిధులు రావనే భయంతోనే ఈ ఎన్నికలను తూతూమంత్రంగా లాగించేయాలని చూస్తున్నారు. తానే ఆటగాడు, తానే రిఫరీ, తానే విజేతగా ప్రకటించుకోవడానికి ఈ ఎన్నికల డ్రామా ఎందుకు? నేరుగా రాష్ట్రపతి పాలన లాంటిది ఏదో పెట్టుకోవచ్చు కదా!

**పక్క రాష్ట్రాల రౌడీలంటూ తప్పుడు ప్రచారం.. ఆధారాలు చూపించగలరా?**

పక్క రాష్ట్రాల నుంచి రౌడీలు వచ్చారంటూ టీడీపీ, ఎల్లో మీడియా తప్పుడు రాతలు రాస్తున్నాయి. ఒకవేళ ఎవరైనా రౌడీలు వస్తే పోలీసుల చేతులు కట్టేశారా? వారిని అరెస్ట్ చేయవచ్చు కదా? పుంగనూరులో మిథున్ రెడ్డి కార్లను తగలబెట్టి, తిరిగి ఆయనే కార్లను తగలబెట్టుకున్నాడని రివర్స్ కేసులు పెట్టడం సిగ్గుచేటు. ఎదుటివారిపై దాడులు చేయడం, తిరిగి బాధితులపైనే తప్పుడు కేసులు బనాయించడం అధికార పార్టీకి అలవాటుగా మారింది. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో పోలీసు వ్యవస్థను ఒక మాఫియాలా మార్చేశారు. చట్టాన్ని అతిక్రమించి కిరాయి సైనికుల్లా వ్యవహరిస్తున్న ప్రతి అధికారి పేరునూ డైరీలో రాసిపెట్టుకుంటున్నాం, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు.

**దమ్ముంటే స్వేచ్ఛగా నామినేషన్లు వేయనివ్వండి: చంద్రబాబుకు సవాల్!**

అసలు ఒక వార్డు సభ్యుడిగా వైయస్సార్‌సీపీ అభ్యర్థి నామినేషన్ వేస్తే చంద్రబాబుకు ఎందుకంత వణుకు? అని సజ్జల రామకృష్ణారెడ్డి సూటిగా ప్రశ్నించారు. ఈ రెండేళ్ల కూటమి పాలన అట్టర్ ఫ్లాప్ అని తేలిపోతుందని, ప్రజలు తిరస్కరిస్తారని భయపడుతున్నారా? అని నిలదీశారు. కూటమి పాలన బ్రహ్మాండంగా ఉందని నమ్మకం ఉంటే.. వైయస్సార్‌సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేసి, ప్రచారం చేసుకోనివ్వాలని... పోలింగ్ బూత్‌లో ప్రజలు ఎవరికి ఓటు వేస్తారో తేల్చుకుందామని సవాల్ చేశారు. మరోవైపు రేపు కూడా నామినేషన్లకు గడువు ఉన్న నేపథ్యంలో... అభ్యర్థులందరూ నిర్భయంగా నామినేషన్లు వేయవచ్చని డీజీపీతో బహిరంగ ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ ఎన్ని దాడులు చేసినా, తప్పుడు కేసులు పెట్టినా వైయస్సార్‌సీపీ శ్రేణులు భయపడే ప్రసక్తే లేదని. వైయస్ జగన్ నాయకత్వంలో ఎలాంటి ఆటుపోట్లనైనా తట్టుకునే ధైర్యం మాకుందని స్పష్టం చేశారు. వైయస్సార్‌సీపీకి ప్రజలే రక్షణ అని.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.